PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 280 | విజయవాడ, బుధవారం 14 మే 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 14 May 2025 | Rs



రాజధానిలో ఉద్రిక్తత

- జెసిబిలతో పేదల దుకాణాల తొలగింపునకు యత్నం
- పేదలు అడ్డుకోవడంతో నిలిపివేత

2




ఫేర్‌వెల్ మ్యాచ్ ఆడించాలి

- రోహిత్, కోహ్లి, అశ్విన్‌లను తగిన రీతిలో సన్మానించాలి
- బిసిసిఐకి స్పిన్ దిగ్గజం అనిల్ కుంబ్లే సూచన

8

రుతుపవనాలు వచ్చేశాయ్!

- నికొబార్ దీవులు, దక్షిణ బంగాళాఖాతంలో ప్రవేశం



న్యూఢిల్లీ : ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న నైరుతి రుతు పవనాలు మంగళవారం దేశంలో ప్రవేశించాయి. దక్షిణ బంగాళాఖాతం, దక్షిణ, ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతాలు, నికోబార్ దీవుల్లోని కొన్ని ప్రాంతాలను నైరుతి రుతుపవనాలు తాకాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) ప్రకటించింది. రాబోయే మూడు నాలుగు రోజులలో రుతుపవనాలు మరింతగా విస్తరిస్తాయని పేర్కొంది. దక్షిణ అరేబియా సముద్రం, మాల్దీవులు - కొమోరిన్ ప్రాంతాలు, దక్షిణ బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలు, అండమాన్ నికోబార్ దీవులు, అండమాన్ సముద్రంలోని మిగిలిన ప్రాంతాలు, మధ్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాల్లో రాబోయే 3,4 రోజులలో రుతుపవనాల విస్తరణకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వివరించింది. రుతుపవనాల రాకతో ఈ ఏడాది సాధారణం కంటే ఎక్కువగానే వర్షపాతం నమోదవు తుందని అంచనా వేసింది. దిగువ వాతావరణ స్థాయిలలో పశ్చిమ గాలులు బలంగా ఉండడం, ఎగువ వాతావరణ స్థాయిలలో తూర్పు గాలులు బలంగా ఉండడం, దక్షిణ ద్వీపకల్పంలో 40 రోజుల పాటు ఉరుములతో కూడిన వర్షపాతం నమోదు కావడం, వాయవ్య పసిఫిక్ మహా సముద్రంలో సాధారణం కంటే ఎక్కువ పీడనం వుండడం... కేరళను రుతుపవనాలు ముందుగానే తాకబోతున్నట్లు సంకేతాలు ఇస్తున్నాయని ఐఎండి తెలిపింది.

తెలుగు రాష్ట్రాల్లో ఎండలు, వానలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రెండు తెలుగు రాష్ట్రాల్లో భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నట్లు వాతావరణశాఖ పేర్కొంది. ఉత్తర దక్షిణ ద్రోణి ప్రభావంతో ఉపరితల చక్రవాక ఆవర్తనాల ప్రభావంతో తెలంగాణలో వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. తెలంగాణ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని, పశ్చిమ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసినట్లు వాతావరణశాఖాధికారి ధర్మరాజు తెలిపారు. రుతుపవనాల ఆగమనంతో గత రెండు రోజులుగా నికోబార్ దీవుల్లో వర్షాలు పడుతున్నాయని తెలిపారు.



ఆంధ్రప్రదేశ్‌లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన భారీ వర్షాలు, మరికొన్ని చోట్ల ఎండల ప్రభావం చూపే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ తెలిపారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ నెల 14న అల్లూరి సీతారామరాజు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, వైఎస్ఆర్, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అంబేద్కర్ కోనసీమ, పల్నాడు, గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు.

ఏ పదవీ చేపట్టను

- జస్టిస్ సంజీవ్ ఖన్నా
- సిజెఐగా పదవీ విరమణ
- నేడు జస్టిస్ గవాయ్ బాధ్యతల స్వీకరణ



న్యూఢిల్లీ : పదవీ విరమణ తర్వాత ఎలాంటి పదవులు చేపట్టబోనని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా తెలిపారు. తదుపరి సిజెఐగా నియమితులవుతున్న జస్టిస్ బిఆర్ గవాయ్ 'అద్భుతమైన ప్రధాన న్యాయమూర్తి' అని కొనియాడారు. మంగళవారం పదవీ విరమణ చేసిన సంజీవ్‌ఖన్నా చివరిసారిగా పూర్తి ధర్మాసనంలో (ఫుల్ బెంచ్) ఆశీనులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మీ అభిమానానికి కృతజ్ఞతలు. నేను ఎన్నో అనుభూతులను వెంట తీసుకొని ఇక్కడి నుండి వెళుతున్నాను. అవి నాకు ఎప్పుడూ గుర్తుంటాయి' అని అన్నారు. అనంతరం తనకు వీడ్కోలు పలికేందుకు కోర్టు రూమ్‌కు వచ్చిన న్యాయవాదులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రజల విశ్వాసాన్ని పొందడంలో బార్, బెంచ్‌ల పాత్రను ఆయన నొక్కి చెప్పారు. న్యాయవ్యవస్థ అంటే న్యాయమూర్తులే కాదని, బార్ కూడా వుంటుందని తెలిపారు. మీరందరూ కూడా వ్యవస్థను పరిరక్షించేవారని ఆయన వ్యాఖ్యానించారు. అనంతరం జస్టిస్ ఖన్నా ప్రెస్ లాంజ్‌ని కూడా సందర్శించారు. భవిష్యత్ ప్రణాళికలు ఏమిటని ఒక పాత్రికేయుడు ప్రశ్నించగా పదవీ విరమణ తర్వాత ఏ పదవినీ చేపట్టబోనని స్పష్టం చేశారు. చట్టానికి సంబంధించి ఏదో ఒకటి చేస్తానని తెలిపారు. జస్టిస్ యశ్వంత్ వర్మ వివాదంపై మీ మనసులో ఏముందని ప్రశ్నించగా 'ఏ విషయంలో అయినా సానుకూలతలు, ప్రతికూలతలను పరిశీలించి హేతుబద్ధంగా నిర్ణయం తీసుకుంటాం. చేసింది తప్పా? ఒప్పా? అనేది భవిష్యత్తు నిర్ణయిస్తుంది' అని వ్యాఖ్యానించారు. కొత్త ప్రధాన న్యాయమూర్తిగా బుధవారం బాధ్యతలు చేపట్టబోతున్న జస్టిస్ గవాయ్ సుప్రీంకోర్టు విలువలను, ప్రాథమిక హక్కులను, మిగతా 7లో

ఆదాయం కోసం అధ్యయనం

- కొత్త వనరులు వెతకండి
- బంగారంపై దృష్టి సారించండి
- ఎలక్ట్రానిక్స్,ఐటి, సేవా రంగాలను పరిశీలించండి
- సమీక్షలో సిఎం ఆదేశం



తీర ప్రాంతాల్లో చేపట్టే ప్రాజెక్టులు, పోర్టులపై సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు.. వార్త 2లో..

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ఖజానాను బలోపేతం చేసేందుకు కొత్త ఆదాయ మార్గాలపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులకు సూచించారు. ఆదాయ వనరుల శాఖల అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సిఎం పలు సూచనలు చేశారు. ఖజానాకు వస్తున్న ఆదాయం, చేస్తున్న వ్యయం, వివిధ శాఖల్లో పరిస్థితి వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఆదాయ వృద్ధికి ఉన్న అవకాశాలు, అనుకూలతలపై లోతైన అధ్యయనం చేయాలని చెప్పారు. ఖజానాకు భారీ ఎత్తున ఆదాయం పెరిగేలా చూడాలని అధికారులను నిర్దేశించారు. ఆదాయ వృద్ధికి ఎలక్ట్రానిక్స్, ఐటి, సేవా రంగాలు ఉపయుక్తంగా ఉంటాయని, వాటిపై దృష్టి సారించాలని సూచించారు.

పసిడిపై ఎందుకలా!

ఈ సమీక్షలో బంగారం క్రయ, విక్రయాలను సిఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. బంగారం కొనుగోళ్లలో దేశంలోనే రాష్ట్రం ముందు ఉన్నప్పటికీ, పన్ను ఆదాయం మాత్రం తక్కువగా వస్తోందని చెప్పారు. దీనిపై దృష్టి సారించాలని సూచించారు. 'ఇలా ఎందుకు జరుగుతోందో చూడండి. పన్ను ఎగవేతలు లేకుండా చూడండి. అవసరమైతే అన్ని శాఖలతో కలిపి డేటా లేక్ ఏర్పాటు చేయండి. ఎక్కడ కొనుగోళ్లు జరిగినా సమాచారం వచ్చేలా చూడండి. అదే విధంగా ప్రతి శాఖకు ఎఐ బృందాన్ని ఏర్పాటు చేసుకోండి.' అని అధికారులకు సూచించారు. వచ్చే రెండు మూడు నెలల్లో ఏఐ ఆధారిత పన్నుల వ్యవస్థను తీసుకురావాలని చెప్పారు.

30 ఏళ్ల కాలాన్ని పరిశీలించండి

ఆదాయం పెంపుకోసం 30 ఏళ్ల కాలాన్ని పరిశీలించాలని సిఎం సూచించారు. '30 ఏళ్ల కాలంలో ఆదాయం ఎలా ఉంది, ఎటువంటి చర్యలు తీసుకున్నారు? వచ్చిన ఫలితాలు ఏమిటన్నది పరిశీలించండి. వాటి ఆధారంగా కొన్ని విధానాలను రూపొందించండి' అని అన్నారు. మద్యం అమ్మకాల ప్రక్రియ పారదర్శకంగా ఉండేలా చూడాలని, పక్క రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం తరలి రాకుండా చూడాలని ఆదేశించారు. దీనికోసం ప్రత్యేకంగా ట్రాకింగ్ విధానం అనుసరించాలని నిర్దేశించారు. రవాణా శాఖ ఆదాయంపై చర్చిస్తూ కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఆదాయం పెరుగుతుంటే రాష్ట్రంలో మాత్రం తక్కువ ఆదాయం రావడానికి కారణాలపై అధికారులను ప్రశ్నించారు. అధికారులు మాట్లాడుతూ ఈ ఏడాది సొంత పన్నుల ద్వారా 1,34,208 కోట్ల రూపాయల ఆదాయాన్ని ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు వివరించారు. ఇది గత ఏడాది కన్నా 29 శాతం అధికంగా ఉన్నట్లు వివరించారు.

కేంద్రం నుంచి తగ్గిన ఆదాయం

కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఇప్పటివరకు తగ్గినట్లు సమావేశంలో గుర్తించారు. గత ఏడాది మే 11 వరకు 17,170 కోట్లు కేంద్రం నుంచి రాగా, ఈ ఏడాది ఇదే కాలానికి కేవలం 12,717 కోట్లు మాత్రమే వచ్చినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. తగ్గిన ఆదాయాన్ని పెంచుకునేందుకు కేంద్ర శాఖలతో సంప్రదింపులు మిగతా 7లో

డేటా అనుసంధానంతో రుణ మంజూరు

- పట్టణాభివృద్ధిశాఖప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మెప్మా పరిధిలోని పట్టణ ప్రాంతాల్లో ఉన్న స్వయం సహాయక సంఘాల సభ్యుల వివరాలను ఎస్‌హెచ్‌జి ప్రొఫైలింగ్ యాప్‌తో అనుసంధానం చేయడం ద్వారా రుణ మంజూరు తేలికవుతుందని పట్టణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ తెలిపారు. మెప్మా లోన్ ఛార్జ్ క్రియేషన్ మాడ్యుల్ (ఎంఎల్‌సిసి) రూపొందించడంపై మంగళవారం మెప్మా కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. అన్ని వివరాలూ ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా సభ్యుల ఇతర రుణాల వివరాలూ తెలుస్తాయని అన్నారు. రుణాల వెరిఫికేషన్ సులభమవుతుందని పేర్కొన్నారు. మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్ మాట్లాడుతూ.. బ్యాంకు రుణాలు యాప్ ద్వారానే మంజూరు చేయాలని, నేరుగా ఇవ్వడానికి లేదని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో 30 వేల మంది మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చాలని, దీనికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.



మురళీ నాయక్ తల్లిదండ్రులను పరామర్శిస్తున్న వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

వీరజవాను మురళీ త్యాగం మరువలేనిది

- నాయక్ కుటుంబానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ పరామర్శ
- వైసిపి తరపున రూ.25 లక్షల సాయం

ప్రజాశక్తి- అనంతపురం, గోరంట్ల

జమ్మూకాశ్మీర్ వద్ద భారత్, పాకిస్తాన్‌ల మధ్య జరిగిన కాల్పుల్లో వీరమరణం పొందిన జవాను మురళీ నాయక్ ప్రాణత్యాగం దేశ ప్రజలు మరువలేనిదని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మురళీ నాయక్ కుటుంబాన్ని మంగళవారం ఆయన పరామర్శించారు. బెంగళూరులోని తన నివాసం నుంచి రోడ్డు మార్గం ద్వారా శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితండాకు చేరుకున్నారు. నేరుగా మురళీ నాయక్ ఇంటికి వెళ్లి ఆయన తల్లిదండ్రులు జ్యోతిబాయి, శ్రీరామ్ మిగతా 7లో



కార్మిక నేత నేపాల్‌దేవ్ భట్టాచార్య కన్నుమూత


న్యూఢిల్లీ : ట్రేడ్ యూనియన్ సీనియర్ నాయకులు, విద్యార్థి ఉద్యమ నిర్మాత, సిపిఎం మాజీ ఎంపి, రాష్ట్ర కమిటీ పూర్వ సభ్యులు, చిత్ర దర్శకులు నేపాల్‌దేవ్ భట్టాచార్య మంగళవారం తుదిశ్వాస విడిచారు. అఖిల భారత రోడ్డు రవాణ కార్మికుల సమాఖ్య (ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్) అధ్యక్షులు, సిఐటియు అఖిల భారత వర్కింగ్ కమిటీ సభ్యులుగా ఉన్న ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇటీవల కోల్‌కతాలోని ఒక నర్సింగ్ హోమ్‌లో చేరిన ఆయన చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున 1:25 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతికి సిపిఎం, పలు ప్రజాసంఘాలు ప్రగాఢ సంతాపం తెలిపాయి. నేపాల్‌దేవ్ భట్టాచార్య భౌతికకాయాన్ని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ, పార్టీ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి ఎమ్‌డి సలీమ్ తదితరులు సందర్శించి, నివాళులర్పించారు.

జిఓ 3 పునరుద్ధరణకు ఆర్డినెన్స్

- స్పెషల్ డిఎస్‌సి నిర్వహించండి
- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఏజెన్సీలో జిఓ నెంబరు 3 పునరుద్ధరణకు ఆర్డినెన్స్ తెచ్చి, స్పెషల్ డిఎస్‌సి నిర్వహించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అప్పటి వరకు ఏజెన్సీలో డిఎస్‌సి రిక్రూట్మెంట్లు వాయిదా వేయాలని ఈ ప్రకటనలో ఆయన సిఎంకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి సమక్షంలో జరిగిన అధికారుల సమీక్షలో మూడు ఆప్షన్లను పరిశీలించినట్లుగా వార్తలు వచ్చాయని, ఇందులో 100 శాతం రిజర్వేషన్ల కల్పనను ఎంచుకోవడం మినహా మరో మార్గం లేదని శ్రీనివాసరావు తెలిపారు. ఇతర ఏ ఆప్షన్ తీసుకున్నా అది గిరిజన నిరుద్యోగులకు అన్యాయం చేసినట్లు అవుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి ఎన్నికల సందర్భంగా ఇటీవల అరకు సందర్శనలలోనూ జిఓ నెంబరు 3ను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. దానికి అనుగుణంగా సాంకేతిక లోపాలను సవరించి, తిరిగి న్యాయ వివాదానానికి చోటులేని విధంగా పాత జిఓ స్థానంలో కొత్త ఆర్డినెన్స్ తీసుకురావాలని సూచించారు. దరఖాస్తుల గడువు ఈనెల 15తో ముగియనున్నందున ఈ సమస్యను అత్యవసరంగా భావించి చర్యలు తీసుకోవాలని, ఏజెన్సీలో అప్పటిదాకా డిఎస్‌సి వాయిదా వేసి తదుపరి స్పెషల్ డిఎస్‌సి నిర్వహించాలని కోరారు.



పోలవరం నిర్వాసితుల నష్టపరిహారంపై దర్యాప్తు అవసరం

- సిఎస్‌కు ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ పూర్వ కమిషనర్ ఇఎఎస్.శర్మ లేఖ

5

పొల్లాచి లైంగిక వేధింపుల కేసులో

9మందికి జీవిత ఖైదు

- బాధితులకు రూ.85లక్షల పరిహారం
- మహిళా న్యాయస్థానం తీర్పు

కోయంబత్తూరు : తమిళనాడులోని పొల్లాచిలో 2019లో జరిగిన లైంగిక వేధింపుల కేసులో కోయంబత్తూరులోని మహిళా కోర్టు మంగళవారం సంచలన తీర్పునిచ్చింది. ఈ కేసులో మొత్తం తొమ్మిది మంది నిందితులనూ దోషులుగా నిర్ధారిస్తూ జీవిత ఖైదు విధించింది. ప్రాసిక్యూషన్, డిఫెన్స్ పక్షాల వాదనలు విన్న తర్వాత జస్టిస్ ఆర్.నందినిదేవి దోషులకు జీవితఖైదు విధిస్తున్నట్లు తీర్పునిచ్చారు. ఈ కేసులోని ఎనిమిదిమంది బాధితులకు రాష్ట్రప్రభుత్వం మొత్తంగా రూ.85 లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది. శబరిరాజన్ అలియాస్ రిష్వంత్, తిరునావుక్కరసు, టి.వసంతకుమార్, ఎం.సతీష్, ఆర్.మణి అలియాస్ మణివన్నన్, పి.బాబు, హరోన్‌పాల్, అరుళనంతం, అరుణ్‌కుమార్‌లను కోర్టు దోషులుగా నిర్ధారించింది. 2019 నుంచి సేలం సెంట్రల్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న వీరిని భారీ పోలీసు భద్రత మధ్య మంగళవారం ఉదయం కోర్టులో హాజరుపరిచారు.

2019 ఫిబ్రవరి 24న ఒక కాలేజీ యువతి పొల్లాచి ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. 12 రోజుల క్రితం పొల్లాచికి సమీపంలో కదులుతున్న కారులో నలుగురు వ్యక్తులు లైంగిక దూషణలకు పాల్పడ్డారని ఆరోపించింది. కళాశాల విద్యార్థినితో పాటు సుమారు తొమ్మిదిమంది మహిళలపై 2016-18 మధ్య దోషులు లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, అత్యాచారాలను వీడియో తీసి, నగదు కోసం బ్లాక్‌మెయిల్ చేయడంతోపాటు పదేపదే అత్యాచారానికి పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. మొదట పొల్లాచి పోలీసులు దర్యాప్తు చేసిన ఈ కేసును తర్వాత తమిళనాడు సిబి-సిఐడికి, ఆ తర్వాత సిబిఐకి బదిలీ చేశారు. దోషులకు వ్యతిరేకంగా మాట్లాడింది 19ఏళ్ల కాలేజీ యువతే. మధ్య తరగతి, దిగువ సామాజిక, ఆర్థిక నేపథ్యాలు కలిగిన కుటుంబాలకు చెందిన యువతులనే నిందితులు లక్ష్యంగా చేసుకునేవారని దర్యాప్తులో వెల్లడైంది. లెక్కలేనంతమందిపై దారుణాలు జరిగినా ఎనిమిది మందే సాక్ష్యమివ్వడానికి ముందుకొచ్చారు. నిందితుల్లో ఒకరైన అరుళనంతం అన్నాడిఎంకె పొల్లాచి పట్టణ విద్యార్థి విభాగ కార్యదర్శి కావడంతో అన్నాడిఎంకె ప్రభుత్వం ఈ ఆరోపణలను తిరస్కరించడంతోపాటు కప్పిపుచ్చేందుకు యత్నించింది. నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదులోనూ ఆలస్యంపై విమర్శలు వెల్లువెత్తాయి.

పల్నాడులో ఘోర రోడ్డు ప్రమాదం

- నలుగురు కార్మికులు దుర్మరణం
- మృతుల్లో భార్యాభర్తలు



పగడాల రమణారెడ్డి , సుబ్బమ్మ, రామాంజి..అంకమ్మ

రోడ్డు ప్రమాద దృశ్యం

ప్రజాశక్తి- వినుకొండ (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై బొలెరోను లారీ ఢీకొనడంతో నలుగురు కార్మికులు మృతి చెందారు. వీరిలో భార్యాభర్తలు ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం... ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం వీరభద్రాపురం పంచాయతీ గడ్డమీదిపల్లి గ్రామానికి చెందిన కార్మికులు పగడాల రామిరెడ్డి (45), ఆయన భార్య సుబ్బమ్మ (40), బొట్టు రామాంజి (35), ఆయన భార్య అంకమ్మ (28)లతో మరికొందరు బొప్పాయి కోతకు బొలెరో వాహనంలో నరసరావుపేట బయలుదేరారు. వినుకొండ మండలం శివాపురం-రామిరెడ్డిపాలెం మధ్య జాతీయ రహదారిపై గుంటూరు నుండి కర్నూలు వైపు వెళ్తున్న కొబ్బరి కాయల లోడు లారీ వేగంగా వచ్చి బొలెరో వాహనాన్ని ఢీకొంది. దీంతో, సుబ్బమ్మ, అంకమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన రామిరెడ్డి, రామంజిరెడ్డి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కన్నెబోయిన నాగమణి, పగడాల శివమ్మ వినుకొండలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమంగా ఉన్న బొలెరో డ్రైవరు నాగేశ్వరరావును గుంటూరు జిజిహెచ్‌కు తరలించారు. ఈ ప్రమాదంలో బొలొరే వాహనం ముందు భాగం తీవ్రంగా దెబ్బతింది.

లారీ రోడ్డుకడ్డంగా బోల్తా పడింది. మృతి చెందిన పగడాల రమణారెడ్డి, సుబ్బమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. పెద్ద కుమార్తె అరుణకు వివాహమైంది. రెండవ కుమారుడు రమణారెడ్డి బిటెక్ పూర్తి చేయగా, చిన్న కుమార్తె నవిత బిటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. బొట్టు రామాంజి, అంకమ్మ దంపతులకు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాలను వినుకొండ సిఐ శోభన్‌బాబు ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలోని బంధువులకు అప్పగించారు. మృతదేహాలను ప్రభుత్వ చీఫ్ విప్ జివి.ఆంజనేయులు, డిసిసిబి చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు సందర్శించారు.

ఈ ప్రమాదంపై మంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

ఈతకెళ్లి ఐదుగురు చిన్నారులు మృతి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం (కడప జిల్లా)

కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలంలోని మల్లెపల్లె చెరువులో ఈతకు వెళ్లి ఐదుగురు చిన్నారులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండల పరిధిలోని బోధనం గ్రామానికి చెందిన చరణ్ (15), పార్థు (12), కడప జిల్లా జమ్మలమడుగు మండలంలోని ఉప్పలపాడుకు చెందిన హర్ష (12), బ్రహ్మంగిరిమఠం మండలంలోని మల్లెపల్లెకు చెందిన దీక్షిత్ (6), కాశినాయన మండలం నల్లేరుకొట్టాలుకు చెందిన తరుణ్ (10) మల్లెపల్లి గ్రామంలోని తమ బంధువుల ఇంటికి వచ్చారు. మంగళవారం మధ్యాహ్నం చెరువులో ఈత ఆడేందుకు వెళ్లారు. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు గాలించారు. చెరువు గట్టు వద్ద చిన్నారుల దుస్తులు, పాదరక్షలు ఉండటంతో వారు నీటిలో మునిగిపోయి ఉంటారని భావించి పోలీసులకు సమాచారమిచ్చారు. గత ఈతగాళ్ల సాయంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఐదుగురు మృతదేహాలను బయటకు తీశారు.

మాజీ ఎమ్మెల్యే వంశీకి బెయిల్

ప్రజాశక్తి - గన్నవరం

కృష్ణాజిల్లా గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌కు బెయిల్ మంజూరైంది. సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో ఆయనకు బెయిల్ మంజూరు చేస్తూ విజయవాడ ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక కోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రెండేళ్ల క్రితం గన్నవరంలోని టిడిపి కార్యాలయంపై దాడి కేసులో సాక్షిగా ఉన్న సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి బెదిరించారనే ఆరోపణలతో పోలీసులు వంశీపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. ఫిబ్రవరిలో ఆయనను అరెస్ట్ చేశారు. ఛార్జిషీటు కూడా ఫైల్ చేశారు. ఈ నేపథ్యంలో రిమాండ్‌లో ఉన్న వంశీ మంగళవారం కోర్టుకు హాజరయ్యారు. ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన కోర్టు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రూ.50 వేలతో పాటు ఇద్దరు పూచీకత్తు సమర్పించాలని ఆదేశించింది. వంశీతోపాటు ఈ కేసులో నిందితులుగా ఉన్న మరో నలుగురికి సైతం బెయిల్ మంజూరైంది.



ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను కలిసిన సిఎం చంద్రబాబు

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం సాయంత్రం బందరురోడ్డులోని చీఫ్ జస్టిస్ నివాసానికి చేరుకున్న సిఎం సుమారు రెండు గంటలపాటు అక్కడ గడిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను సిఎం చీఫ్ జస్టిస్ దృష్టికి తీసుకెళ్లారు. హైకోర్టు శాశ్వత భవన నిర్మాణం, అదే ప్రాంతంలో జరుగుతున్న పలు కట్టడాలకు సంబంధించిన అంశాలనూ చీఫ్ జస్టిస్‌కు మర్యాద పూర్వకంగా తెలిపినట్లు తెలిసింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

నేడు టిడిపి పొలిట్‌బ్యూరో సమావేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడిపి పొలిట్‌బ్యూరో సమావేశం బుధవారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరగనుంది. ఈ సమావేశంలో పహల్గామ్ అమరులకు నివాళులు అర్పించడం, కడపలో ఈ నెలాఖరులో జరగనున్న పార్టీ మహానాడు నిర్వహణ, పార్టీ సంస్థాగత నిర్మాణంపై చర్చ ఉండే అవకాశం ఉంది. 11 నెలల కూటమి ప్రభుత్వ పాలన, విజయాలు తదితర అంశాలపై చర్చించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. వీటితోపాటు నామినేటెడ్ పోస్టుల భర్తీపైనా చర్చించొచ్చని తెలిసింది.

దళితులను సామాజిక బహిష్కరణ చేసిన పెత్తందార్లకు కఠిన శిక్ష

- కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, గూడ్లూరు మండలం, దప్పళంపాడులో దళితులపై సామాజిక బహిష్కరణ చేసిన టిడిపి పెత్తందారులపై అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఒ నల్లప్ప, అండ్ర మాల్యాద్రి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామంలో అర్ధరాత్రి ఈలలు వేశారని, దళిత యువకులపై టిడిపి పెత్తందారులు దాడి చెయ్యడమే కాకుండా ఈ విషయంపై ప్రశ్నించినందుకు మంచినీళ్లు ఇవ్వకుండా, పాలు పోయనీకుండా ఆంక్షలు విధించడం సిగ్గు చేటన్నారు. పక్క గ్రామాలకు కూడా పోకుండా హుకుం జారీ చేయడం దుర్మార్గమైన, కుల దురహంకార చర్యగా పేర్కొన్నారు. ఉపాధి పనులకు రానీయొద్దని ఫీల్డ్ అసిస్టెంట్‌కు చెప్పడం అధికార దుర్వినియోగానికి పాల్పడటమేనని తెలిపారు. దళితులెవరితో మాట్లాడవద్దని, గ్రామంలోకి రావొద్దంటూ మైక్‌లో ప్రకటనలు చేయడాన్ని తప్పుబట్టారు. ఈ దుర్మార్గమైన కులదురహంకార చర్యలపై అధికారులకు దళితులు ఫిర్యాదు చేస్తే పెత్తందారులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోకుండా రాజీ చెయ్యడం సరైంది కాదన్నారు. సాంఘిక బహిష్కరణ జరిగిన కాలానికి దళితులకు నష్టపరిహారం చెల్లించాలని, భవిష్యత్తులో ఇలాంటి దుర్మార్గాలు జరగకుండా దళితులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వ అధికారులను కోరారు.

ఆర్‌డిటిని కాపాడుకోవాలి

- అఖిలపక్ష సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో పేదల అభ్యున్నతికి ఐదు దశాబ్దాలకుపైగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ (ఆర్‌డిటి)ని కాపడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అఖిలపక్ష నాయకులు అన్నారు. విజయవాడలోని దాసరి భవన్‌లో జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో 'ఆర్డిటిని కాపాడుకుందాం' అనే అంశంపై అఖిలపక్ష సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావుల తోడ్పాటుతో పేదరిక నిర్మూలకనకు కృషి చేస్తున్న ఆర్డిటిని కాపాడుకోవాలన్నారు. ఒకవైపు విదేశీ పెట్టుబడులను ఆహ్మానిస్తూ, మరోవైపు విదేశీ విరాళాలతో నడిచే సంస్థలను నిరోధించడం సహేతుకం కాదన్నారు. లౌకిక భావాలతో పేదరిక నిర్మూలన కోసం విదేశీ సంస్థలు, వ్యక్తులు విరాళలతో నిర్వహించే సంస్థల పట్ల కేంద్ర ప్రభుత్వం కఠిన వైఖరి అవలంభించడం దురదృష్టకరమన్నారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో అత్యంత వెనుకబడిన ప్రజల అభ్యున్నతి కోసం ఈ సంస్థ లాభాపేక్ష లేకుండా పని చేస్తోందని తెలిపారు. విద్యా, వైద్యం, ఆరోగ్యం, మహిళా సాధికారత, వ్యవసాయం, సంక్షేమం వంటి రంగాల్లో ఆర్డిటి గణనీయమైన కృషి చేసిందన్నారు. కేవలం వైద్య సేవల కోసమే ఏడాదికి రూ.80 కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. విదేశీ విరాళాలపై ఆధారపడి పని చేసే ఈ సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఎ రిజిస్ట్రేషన్ కేంద్రం రద్దు చేయడాన్ని తప్పుబట్టారు. టిడిపి మాజీ ఎమ్మెల్యే వై.ప్రభాకర చౌదరి మాట్లాడుతూ.. ఆర్డిటికి కులమతాలు లేవని, మథర్ థెరిస్సాను ఆదర్శంగా తీసుకుని అనంతపురం అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతో మైనార్టీల పట్ల కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. ఇది సరైన విధానం కాదని స్పష్టం చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ.. 3,877 గ్రామాల్లో పేద ప్రజల కోసం ఆర్డిటి సవలు అందిస్తుందని తెలిపారు. పి4 ఆలోచనను 50 ఏళ్ల కిందటి నుంచే అమలు చేస్తోందని అలాంటి ఆర్డిటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జెల్లి విల్సన్, సిపిఐ కార్యదర్శి వర్గ సభ్యులు అక్కినేని వజన, కాంగ్రెస్ నాయకులు కొరివి వినయ్ కుమార్, సాహితీవేత్త గొళ్ల నారాయణరావు, ఎపి గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు ఎ.వి పటేల్, సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.



అభివాదం చేస్తున్న అఖిలపక్ష నేతలు

పోర్ట్ ఆధారిత ఎకానమీ కోసం ప్రణాళికలు

- రూ.3,500 కోట్లతో దుగరాజపట్నంలో నౌకా నిర్మాణ కేంద్రం
- సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సుదీర్ఘ సముద్ర తీరం ద్వారా రాష్ట్రంలో పోర్ట్ ఆధారిత ఎకానమీని సాధించేందుకు ప్రణాళికతో పనిచేస్తున్నామని సిఎం చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో వెయ్యి కిలోమీటర్లకు పైగా ఉన్న సముద్ర తీరాన్ని పూర్తి స్థాయిలో ఉపయోగించుకుని మారిటైమ్ ప్రాజెక్టులు నెలకొల్పుతామన్నారు. రాష్ట్రంలో తీర ప్రాంతాల్లో చేపట్టే ప్రాజెక్టులు, పోర్టులపై సిఎం మంగళవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. తీర ప్రాంతంలో ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్ట్ లేదా ఒక షిప్పింగ్ హార్బర్ నిర్మించాలనే ఆలోచనతో తాము ఉన్నామని కేంద్ర ప్రభుత్వ పోర్ట్స్, షిప్పింగ్, వాటర్‌వేస్ శాఖ సెక్రటరీ టికె రామచంద్రన్‌కు సిఎం చంద్రబాబు వివరించారు. రాష్ట్ర విభజన సమయంలో నెల్లూరు జిల్లా, దుగరాజపట్నంలో పోర్టు, ఆధారిత పరిశ్రమల ఏర్పాటుతో తిరుపతి జిల్లా పరిధిలోకి వచ్చిన దుగరాజపట్నంలో షిప్ బిల్డింగ్ అండ్ రిపేర్ క్లస్టర్ ఏర్పాటు అంశంపై కేంద్ర బృందంతో చర్చించారు. ఇనిషియల్ ఫీజిబులిటీ రిపోర్టు ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 2 వేల ఎకరాల్లో షిప్ బిల్డింగ్ సెంటర్ ఏర్పాటుకు నిర్ణయించినట్లు సిఎం తెలిపారు. దుగరాజపట్నంలో నౌకా నిర్మాణం, మరమ్మతుల క్లస్టర్, గ్రీన్‌ఫీల్డ్ పోర్టుతో కలిపి అభివృద్ధి చేయనున్నట్లు, 4 డ్రై డాక్‌లు, అవుట్ ఫిటింగ్ జెట్టీలు, షిప్ లిఫ్ట్ సౌకర్యం కలిగిన నౌకా నిర్మాణ కేంద్రం ఇక్కడ వస్తుందన్నారు. షిప్ బిల్డింగ్ పరిశ్రమకు వెయ్యి ఎకరాలు అవసరం ఉంటుందని, ఈ ప్రాజెక్టును చేపట్టడానికి కేంద్రం సుమారు రూ.3,500 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూ సేకరణ చేపడుతుందని, పరిశ్రమకు అనువైన ప్రాంతంగా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పివి) ఏర్పాటు చేసి ప్రపంచ స్థాయి సంస్థలను ఆహ్వానించి ఇక్కడ షిప్ బిల్డింగ్ పరిశ్రమను ఏర్పాటు చేస్తామన్నారు. నౌకా నిర్మాణ కేంద్రం ద్వారా సుమారు రూ.26 వేలకోట్ల పెట్టుబడులు వస్తాయన్నారు. ప్రత్యక్షంగా 5 వేల మందికి, పరోక్షంగా 30 వేల మందికి ఈ ప్రాజెక్టు ద్వారా లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఇందుకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు.

రివర్ క్రూయిజ్ సర్క్యూట్స్‌పై అధ్యయనం

పోలవరం, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాంతాల్లో రివర్ క్రూయిజ్ సర్క్యూట్స్‌ను అభివృద్ధి చేసే అంశంపై అధ్యయనం చేయాలని అధికారులకు సిఎం సూచించారు. ఈ సమీక్షలో మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యాన సాగుతో అధిక ఆదాయం

- పదేళ్లలో సాగు రెట్టింపు
- 11 ప్రాధాన్య పంటలు, 24 క్లస్టర్లు
- హార్టికల్చర్ సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గోదావరి, కృష్ణా డెల్టా మినహా రాష్ట్రంలో మిగిలిన అన్ని ప్రాంతాల్లోనూ హార్టికల్చర్ సాగును విస్తృతంగా ప్రోత్సహించాలని, రైతుకు ఎకరాకు ఏడాదికి కనీసం రూ.లక్ష ఆదాయం ఆర్జించడమే లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. హార్టికల్చర్ సాగుపై సచివాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. దీనిపై అధికారులకు సిఎం పలు సూచనలు చేశారు. మిరప, అరటి, మామిడి, ఆయిల్‌పామ్, కోకో, డ్రాగన్ ఫ్రూట్, జీడి మామిడి, కాఫీ, కొబ్బరి, టమోటా, ఉల్లి వంటి 11 ప్రాధాన్య పంటలతో రాష్ట్రంలో 24 క్లస్టర్లు ఏర్పాటు చేసి రైతులకు తోడ్పాటు అందించాలని కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలో 18.23 లక్షల హెక్టార్లలో ఉన్న ఉద్యానవన సాగును, వచ్చే ఐదేళ్లలో రెట్టింపు చేయాలని, ఆయిల్‌పామ్, కోకో, కొబ్బరి పంటల డిమాండ్ దృష్ట్యా రైతులకు ఈ పంటల సాగు విషయంలో అవగాహన కల్పించాలని కోరారు. ప్రపంచంలో కోకో సాగులో ఒకశాతం కన్నా తక్కువ మన దేశంలో సాగవుతోందని పేర్కొన్నారు. ప్రపంచ మార్కెట్లో ఉన్న డిమాండ్‌ను అందిపుచ్చుకునేలా లక్ష ఎకరాల్లో కోకో సాగు చేసేలా చూడాలన్నారు. కోకో పంట కోసిన తరువాత నాణ్యత విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకునేలా శిక్షణ ఇవ్వాలన్నారు. మైక్రో ఇరిగేషన్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న సబ్సిడీని రాష్ట్రంలో రైతులు వినియోగించుకునేలా చూడాలని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, చిన్న రైతులకు డ్రిప్ ఇరిగేషన్‌తో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రైతులు ఏర్పాటుచేసిన మిషన్లకు ఆటోమేషన్ పరికరాలు అమర్చాలని కోరారు. పదివేల హెక్టార్లలో పండ్ల సాగు చేస్తున్న రైతులకు రూ.32 కోట్ల వ్యయంతో ఫ్రూట్ కవర్లు సబ్సిడీపై అందించామని, దీంతో రైతులకు రూ.120 కోట్లు అదనంగా ఆదాయం వచ్చిందని వివరించారు. ఈ సమీక్షలో మంత్రి అచ్చెన్నాయుడు, అగ్రిక్చలర్ మిషన్ కార్పొరేషన్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన అనుమతులు

- ప్రతి కంపెనీకి నోడల్ ఆఫీసరు
- మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కొత్తగా సంస్థలను ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చిన పెద్ద కంపెనీలకు అవసరమైన అనుమతులను త్వరితగతిన మంజూరు చేసేందుకు ప్రతి కంపెనీకి ఒక నోడల్ ఆఫీసరును నియమించాలని అధికారులను విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్‌శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఉండవల్లిలోని ఆయన నివాసంలో ఐటి, ఎలక్ట్రానిక్స్‌శాఖల ఉన్నతాధికారులతో ఆయన మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. విశాఖ నగరాన్ని అత్యాధునిక సాంకేతికతల కేంద్రంగా, ఐటి హబ్‌గా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం ప్రణాళికలు రూపొందించాలన్నారు. రాష్ట్రంలో యూనిట్ల స్థాపనకు ఆసక్తి చూపుతున్న కంపెనీల పెట్టుబడులు, ఉద్యోగాలపై మంత్రి సమీక్షిస్తూ ఇప్పటి వరకు 91 ఐటి, ఎలక్ట్రానిక్స్ కంపెనీలు, రూ.91,839 కోట్ల పెట్టుబడులు, 1,41,407 ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకొచ్చాయని తెలిపారు. ఆయా కంపెనీలకు అనుమతులు త్వరితగతిన మంజూరు చేయాలని, సాధ్యమైనంత త్వరగా కంపెనీల ప్రతినిధులతో సంప్రదింపులు జరపాలని అన్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో ఐటి, ఎలక్ట్రానిక్స్ ఉద్యోగాలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. రాబోయే ఐదేళ్లలో ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 5 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ఐటి కంపెనీలకు చెల్లించాల్సిన ప్రోత్సాహక బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వీడియో కాన్ఫరెన్స్ ఎక్విప్‌మెంట్‌ను ఆధునీకరించాలని, రతన్‌టాటా ఇన్నోవేషన్‌హబ్ ఏర్పాట్లను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.



ప్రభుత్వానికి సంబంధించిన పౌరసేవలన్నీ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందుబాటులో ఉంచాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. ప్రస్తుతం 317 రకాల సేవలు మనమిత్ర యాప్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. నెలాఖరుకు 400 రకాల సేవలకు విస్తరించాలని, రెవెన్యూశాఖతో పాటు వివిధ రకాల సేవల సమయాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి సర్టిఫికెట్ బ్లాక్ చెయిన్, క్యూఆర్ కోడ్‌తో నిర్ధారించుకునేలా టెక్నాలజీతో అనుసంధానం చేయాలన్నారు. మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలు, పంచాయతీల్లో పన్నుల బకాయిల వివరాలు వాట్సాప్‌లో వచ్చేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. బకాయిలకు సంబంధించి ఎప్పటికప్పుడు అలర్ట్ మెసేజ్‌లు పంపేలా చూడాలని, ఆర్‌టిజిఎస్‌కు సంబంధించి డేటా పాయింట్లు, కెపిఐలను ఇంటిగ్రేట్ చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రాధాన్యత పథకాలకు సంబంధించి రియల్ టైమ్ సమాచారాన్ని ఆర్‌టిజిఎస్‌లో పొందుపరచాలన్నారు. తుపానులు, వరదలు, పిడుగులు పడటం వంటి వాతావరణ సమాచారాన్ని రియల్‌టైమ్‌లో అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

జూన్ 9, 10 తేదీల్లో విశాఖలో ఇ- గవర్నెన్స్ జాతీయ సదస్సు

జూన్ 9, 10 తేదీల్లో విశాఖలో జరగనున్న ఇ-గవర్నెన్స్ జాతీయ సదస్సుకు విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. వివిధ శాఖలకు సంబంధించిన సమాచారం అంతటినీ ఏకీకృతం చేసి ఒక వెబ్‌సైట్‌లో పొందుపరిచి ఎఐ ఎనేబుల్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈజ్‌ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మరింత సరళతరం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వానికి సంబంధించిన అన్ని రకాల జిఓలు, యాప్‌లను సింగిల్ ప్లాట్‌ఫారమ్‌పైకి తెచ్చి ఒకే వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తేవాలన్నారు. ఈ సమావేశంలో ఐటి అండ్ సి సెక్రటరీ కాటంనేని భాస్కర్, స్పెషల్ సెక్రటరీ బి సుందర్, ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు సిఇఒ సాయికాంత్ వర్మ, ఎపి టెక్నాలజీ సర్వీసెస్ ఎమ్‌డి సూర్యతేజ్, ఆర్‌టిజిఎస్ సిఇఒ ప్రకార్‌జైన్ పాల్గొన్నారు.

రాజధానిలో ఉద్రిక్తత

- జెసిబిలతో పేదల దుకాణాల తొలగింపునకు యత్నం
- పేదలు అడ్డుకోవడంతో నిలిపివేత

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)



సిఆర్‌డిఎ అధికారులతో పేదలు, టిడిపి నాయకుల వాగ్వివాదం

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. పేదల దుకాణాలను తొలగించేందుకు సిఆర్‌డిఎ, పోలీసులు యత్నించడం, జెసిబిలకు పేదలు అడ్డుగా నిలబడటంతో ఉద్విగ్న పరిస్థితులు నెలకొన్నాయి. బతుకు దెరువు కోసం రోడ్డు పక్కన చిన్న చిన్న దుకాణాలు పెట్టుకుంటే వాటిని కూల్చుతారా? అని సిఆర్‌డిఎ అధికారులను పేదలు నిలదీశారు. స్థానిక అయ్యన్న చెరువు కాలనీకి చెందిన కొంతమంది పేదలు తుళ్లూరు - గుంటూరు రహదారి పక్కన దుకాణాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. దుకాణాలకు పక్కనే ఆంజనేయ స్వామి గుడి కోసం కేటాయించిన స్థలం ఉంది. దుకాణాలలో మద్యం అమ్మకాలు సాగుతున్నాయని, స్థలాలు ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారని సిఆర్‌డిఎ అధికారులకు ఆంజనేయ స్వామి గుడి స్థల యజమాని ఫిర్యాదు చేశారు. దీంతో దుకాణాల తొలగింపునకు తహశీల్దార్ రవిబాబు, రెవెన్యూ, పోలీసులు చర్యలు చేపట్టారు. నిర్మాణంలో ఉన్న దుకాణాలను జెసిబిలతో తొలగించారు. మిగిలిన వాటిని కూడా తొలగించేందుకు యత్నించగా పేదలు, టిడిపి నాయకులు అడ్డుకున్నారు. తుళ్లూరు - గుంటూరు రహదారికి 50 అడుగుల దూరంలో గుడి పక్కన, హైస్కూల్, కళాశాల, టిడ్కో గృహాల వద్ద మద్యం దుకాణాలకు అనుమతి ఎలా ఇచ్చారని పేదలు నిలదీశారు. ముందుగా గ్రామంలో రహదారుల పక్కన ఉన్న ఆక్రమణలను తొలగించాలని, పేదల జోలికొస్తే ఊరుకునేది లేదని తెలుగు యువత మండల అధ్యక్షులు మూల్పూరి నరేష్, గూడపాటి శ్రీకాంత్, కొమ్మినేని అప్పారావు హెచ్చరించారు. దీంతో అధికారులు చేసేదిలేక అక్కడి నుంచి వెనుదిరిగారు.

మహిళలను మోసగించిన కూటమి పాలన

- వైసిపి మహిళా కార్యకర్తల సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కూటమి ప్రభుత్వం మహిళలను మోసం చేసిందని, జగన్ పాలనలో ఉన్న సంక్షేమ పథకాలన్నీ రద్దు చేసిందని వైసిపి మహిళా నేతలు పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో వైసిపి మహిళా విభాగ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి పార్టీ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, అనుబంధ విభాగాల ఇన్‌ఛార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ మంత్రులు ఆర్‌కె రోజా, తానేటి వనిత, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, లేళ్ల అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసిపి మహిళా విభాగం అధ్యక్షులు వరుదు కల్యాణి మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి సూపర్ స్కామ్స్ అమలు చేస్తున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి ఆర్‌కె రోజా మాట్లాడుతూ.. మహిళా సమస్యలపై పోరాటం కొత్తకాదని, గురుతర బాధ్యతతో ముందుకు వెళ్లాలని అన్నారు. చంద్రబాబు ఏడాది పాలనలో అవమానాలు, అరాచకాలు, అఘాయిత్యాలు, అక్రమ కేసులు, వేధింపులే ఉంటున్నాయన్నారు. మాజీ మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ.. తప్పుచేసి మొన్నటి ఎన్నికల్లో ఓడిపోలేదని, తప్పుడు ప్రచారం వల్లే ఓడిపోయామని తెలిపారు. సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. వైసిపి అధికారంలో ఉన్న సమయంలో సంక్షేమంపై దృష్టిపెట్టి కార్యకర్తలను పట్టించుకోలేదని, అందువల్లే ఓడిపోయామని అన్నారు.

'ఉపాధి'లో ప్రభుత్వ నిర్ణయాలను నిరసిస్తూ 20న ఆందోళనలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి హామీ చట్టం అమలులో ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఈ నెల 20వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టనున్నట్లు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ ఆందోళనల్లో పేదలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధి హామీలో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని గ్రామీణ పేదల కోసం తెచ్చిన ఈ చట్టం నిధులతో వ్యక్తిగత, దేవాలయాల కోనేర్లు, భూ స్వాముల పోలాల్లో పండ్ల తోటలు, ఉద్యాన వనాల కోసం ఖర్చు చేయాలన్న నిర్ణయాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. చట్టాన్ని యదాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంట్లో ఎలుకలు ఉన్నాయని ఇంటిని తగల పెట్టిన చందంగా గ్రామీణ ఉపాధి హామీ చట్టం పరిస్థితి తయారైందని పేర్కొన్నారు. గ్రామీణ పేదలకు పనులు లేని సమయంలో ఉపాధి చట్టం కింద పనులు కల్పించి పట్టెడన్నం పెట్టడానికి ఈ చట్టాన్ని తీసుకువచ్చినట్లు వెల్లడించారు. దీనిని సక్రమంగా అమలు చేయాల్సిన ప్రభుత్వమే పై నుంచి కింది స్థాయి వరకూ అవినీతి, అక్రమాలకు పాల్పడటానికి ప్రభుత్వ వైఫల్యమే కారణమన్నారు. ప్రభుత్వం అసమర్ధను పేదలపైకి నెట్టడం అన్యాయమని తెలిపారు. ప్రభుత్వం చేపట్టే పోలవరం, అమరావతి వంటి భారీ ప్రాజెక్టుల్లో వేల కోట్ల అవినీతి జరిగిందని పనులు నిలుపుదల చేశారా అని ప్రశ్నించారు. ఉపాధి చట్టంలో ప్రస్తుతం చేసే పనులు సన్నా, చిన్నకారు రైతుల భూముల అభివృద్ధి కోసమే ఇవి రద్దు చేసి గ్రామీణ సంపన్నులు, కాంట్రాక్టర్లకు రాజకీయ నాయకులకు ద్రోహదపడేలా సవరణలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇదే జరిగితే ఇక పేదలు పనులు లేక వలసలు పోవాల్సి వస్తుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో సిపిఎం సీనియర్ నాయకులు రమణరావు మృతి

ప్రజాశక్తి - గాజువాక, కలెక్టరేట్ (విశాఖపట్నం)



రమణరావు (ఫైల్)

విశాఖపట్నం జిల్లా గాజువాక పోలీస్ స్టేషన్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సిపిఎం సీనియర్ నాయకులు పివైవి.రమణరావు (74) మంగళవారం ఉదయం దుర్మరణం చెందారు. ప్రజాశక్తి దినపత్రికను పాఠకులకు అందించేందుకు బైక్‌పై వెళ్తుండగా రాంగ్‌రూట్‌లో మోటారు బైకుపై వచ్చిన ఓ వ్యక్తి ఢీకొట్టాడు. దీంతో, తీవ్రంగా గాయపడిన రమణరావును నగరంలోని ఓ ఆసుపత్రికి తరలించగా అక్కడ పరిస్థితి విషమించి మృతి చెందారు. 1973లో బిహెచ్‌పివిలో ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌లో రమణరావు ఉద్యోగిగా చేరారు. 1981లో సిపిఎంలో చేరారు. పార్టీ శాఖ కార్యదర్శిగానూ, బిహెచ్‌పివి ఎఫ్‌సి, గాజువాక జోన్ కమిటీ, ఎడ్యుకేషన్ సబ్ కమిటీ సభ్యునిగానూ బాధ్యతలు నిర్వహించారు. డివైఎఫ్‌ఐలోనూ పనిచేశారు. కళాకారుడుగా 1980లో బిహెచ్‌పివిలో ప్రజానాట్య మండలిని నిర్మించారు. పలు కళా ప్రదర్శనలు ఇచ్చారు. హల్లాబోల్ వీధి నాటిక, ప్రజా ఉద్యమ నాటికలు సుమారుగా 600 ప్రాంతాల్లో ప్రదర్శించారు. ఎవ్వనిచేజనించు, ఉప్పెన వచ్చింది, నరకం మరి ఎక్కడలేదు, రాయి మొదలగు నాటికలను జాతీయంగా ప్రదర్శనలు ఇచ్చారు. రమణరావుకు భార్య సుభద్ర, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు ఆయన అంత్యక్రియలు గాజువాకలో జరగనున్నాయి.

యువతరానికి ఆదర్శం

రమణరావు మృతిపట్ల సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, సిపిఎం రాష్ట్ర కమిటీ తరపున కార్యదర్శి వి. శ్రీనివాసరావు తీవ్ర సంతాపం తెలియజేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వృద్ధాప్యంలో సైతం ప్రజాశక్తి పంపిణీ బాధ్యత నిర్వహించడం స్ఫూర్తిదాయకమని, ఈ బాధ్యత నిర్వహణలో ఆయన అసువులు బాశారని శ్రీనివాసరావు పేర్కొన్నారు. తన కృషి ద్వారా యువతరానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, ఎస్.పుణ్యవతి, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, ప్రజాశక్తి సంపాదకులు బి.తులసీదాస్, సిజిఎం అచ్చుతరావు తదితరులు కూడా రమణ మృతి పట్ల సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. భౌతికకాయం వద్ద పలువురు నాయకులు నివాళులర్పించారు. రమణరావు ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని సిపిఎం రాష్ట్ర కమిటీ పేర్కొంది.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను పోరాటాలతో అడ్డుకుంటామని స్టీల్ త్రిఫ్ట్ సొసైటీ కార్యదర్శి డిఎస్ఆర్‌సి మూర్తి అన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1552వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) కార్యకర్తలు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం సుదీర్ఘకాలంగా పోరాటం కొనసాగుతున్నా ప్రభుత్వానికి పట్టకపోవడం దారుణమన్నారు. రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన ఈ కర్మాగారాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టడం తగదన్నారు. ప్రజల, కార్మికుల ఆకాంక్షను గుర్తెరిగి మోడీ ప్రభుత్వం తన తీరును మార్చుకోవాలని కోరారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20న జరిగే జాతీయ సమ్మెలో ఉక్కు కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. దీక్షల్లో నాయకులు భానుమూర్తి, కె అప్పారావు, జగ్గారావు, యు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'ఆ సిబ్బంది'పై చర్యలు

- పవన్‌కల్యాణ్ ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంచిత్తూరు జిల్లాలో అటవీ, ప్రభుత్వ, బుగ్గమఠం భూములను ఆక్రమణలు చేశారని, భూములు ఆక్రమణలకు గురికాకుండా రక్షించలేని సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. భూములు ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులతోపాటు అటవీ పర్యావరణ చట్టాలను అనుసరించి కేసులు నమోదు చేయాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజి సిఫారసు చేశారు.. భూములవిజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజి ఇచ్చిన విజిలెన్స్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

పిహెచ్‌సిల పనితీరులో ఉమ్మడి కృష్ణా జిల్లా ఫస్ట్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరుపై నిర్వహించిన శాఖాపరమైన మదింపులో ఉమ్మడి కృష్ణా జిల్లా మొదటి స్థానంలో, విజయనగరం, ప్రకాశం జిల్లాలు తరువాత స్థానాల్లో నిలిచినట్లు వైద్యారోగ్యశాఖ మంత్రి వై సత్యకుమార్ యాదవ్ తెలిపారు. అనంతపురం జిల్లా చివరి స్థానంలో, రాయలసీమలోని మిగిలిన 3 జిల్లాలు జాబితాలో వెనకబడి ఉండటంపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు ఆయా జిల్లాల డిఎంహెచ్‌ఒలను వివరణ కోరారు. సచివాలయం నుంచి అన్ని జిల్లాల వైద్యారోగ్యశాఖ అధికారులతో వీడియోకాన్ఫరెన్స్‌ను మంత్రి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌టిఆర్ వైద్య సేవల వినియోగంలో రాయలసీమలోని సెకండరీ ఆస్పత్రులు వెనుకబడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం, వివిధ పథకాల అమలును పర్యవేక్షించే జిల్లా వైద్యారోగ్య అధికారులు, జిల్లా ఆరోగ్య సేవల సమన్వయకర్తలు పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. డిఎంహెచ్‌ఒ కార్యాలయాలపై వస్తున్న అవినీతి ఆరోపణలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతికి అడ్డుకట్ట వేసి జవాబుదారీ తనం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. డిఎంహెచ్‌ఒలకు తగు శిక్షణ ఇవ్వాలన్నారు. ఏడాదికి రెండు పర్యాయాలు వీరి పనితీరును మదింపు చేసి మూడు గ్రేడ్లు ఇవ్వాలన్నారు. కార్యాలయ సిబ్బందిని ప్రతి మూడేళ్లకు తప్పని సరిగా బదిలీ చేయాలన్నారు. నియామకాల్లో ప్రతిభ ఆధారిత ఎంపిక ఉంటుందనే విషయాన్ని వెల్లడిస్తూ.. అభ్యర్థులు దళారుల బారినపడి మోసపోవద్దన్నారు. ఈ సమావేశంలో వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు, సెకండరీ హెల్త్ డైరెక్టర్ ఎ సిరి, ఇతర విభాగాల అధిపతులు పాల్గొన్నారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండ్యన్ వర్చువల్‌గా పాల్గొన్నారు.


మృతుడు ఆదినారాయణ (ఫైల్)

అప్పుల బాధతో ఇద్దరు కౌలురైతుల ఆత్మహత్య

వేర్వేరు జిల్లాల్లో ఘటనలు

ప్రజాశక్తి-ముప్పాళ్ల (పల్నాడు జిల్లా), బండి ఆత్మకూర్ (నంద్యాల జిల్లా)

అప్పుల బాధతో వేర్వేరు జిల్లాల్లో ఇద్దరు కౌలురైతులు ఆత్మహత్య చేసుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలంలోని చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన ఆళ్ల ఆదినారాయణ (45) ఐదెకరాలు కౌలుకు తీసుకుని మిర్చి, పసుపు పంటలను సాగుచేస్తున్నారు. సుమారు రూ.10 లక్షల వరకు అప్పుచేసి పెట్టుబడులు పెట్టారు. ఆశించిన దిగుబడులు లేకపోవడంతో పాటు ధరలు కూడా అంతంతమాత్రంగానే ఉండడంతో నష్టాలే వచ్చాయి. ఈ క్రమంలో అప్పులు తీర్చేమార్గం లేక తీవ్ర మనస్తాపానికి గురైన ఆదినారాయణ సోమవారం ఇంటి వద్దే గడ్డి మందు తాగారు. గమనించిన అతని కుటుంబీకులు హుటాహుటిన నర్సారావుపేటలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆదినారాయణ మంగళవారం ఉదయం మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలం భోజనం గ్రామానికి చెందిన కౌలు రైతు రాముడు (65) తనకున్న ఎకరా పొలంతో పాటు కౌలుకు తొమ్మిది ఎకరాల పొలం తీసుకుని వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ ఏడాది ఆరు ఎకరాల్లో పొగాకు పంట, నాలుగు ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. దాదాపు రూ. 12 లక్షల వరకు పెట్టుబడులు పెట్టారు. ఈ ఏడాది అకాల వర్షాలతో పంట దెబ్బతినడంతో పాటు దిగుబడి కూడా తగ్గిపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. మరోపక్క పండిన పొగాకు పంటను వ్యాపారులు కొనుగోలు చేయకపోవడం, రుణదాతలు ఒత్తిడి చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. మంగళవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. రాముడుకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు శ్రీనివాసులు ఉన్నారు. కుమార్తెలకు వివాహాలు అయ్యాయి.

సాగర్, పులిచింతలలో తగ్గిన నీటి నిల్వలు

- కృష్ణా పరివాహక ప్రాంతంలో పొంచి ఉన్న ఎద్దడి
- పెరుగుతున్న తాగునీటి సమస్యలు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

కృష్ణా బేసిన్‌లోని జలాశయాల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గాయి. వేసవి తీవ్రత పెరగడం, ఆరు నెలలుగా సరైన వర్షాలు లేకపోవడం, ఎగువ నుంచి నీటి ప్రవాహం నిలిచిపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. శ్రీశైలం, నాగార్జుసాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీల్లో నీటి నిల్వలు తగ్గడంతో ఈ ఏడాది ముందస్తు ఖరీఫ్‌పై రైతులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. కోస్తా జిల్లాల్లో గత నాలుగు రోజులుగా వేసవి తీవ్రత పెరిగింది. వడగాల్పులు ఉధృతమయ్యాయి. నీటి నిల్వలు తగ్గడం వల్ల తాగునీటి ఇబ్బందులు పొంచి ఉన్నాయి. శ్రీశైలంలో గరిష్ట నీటి నిల్వ 215.08 టిఎంసిలు కాగా, మంగళవారం 36.77 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. నాగార్జున సాగర్ జలాశయం గరిష్ట నీటి నిల్వ 312.04 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 136.65 టిఎంసిలు మాత్రమే ఉన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. పులిచింతలలో గరిష్ట నీటి నిల్వ 45.77 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 26.29 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. మూడు జలాశయాల నుంచి దిగువకు నీటి విడుదల జరగడం లేదు. ప్రకాశం బ్యారేజీ గరిష్ట నీటి నిల్వ 3.07 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 2.69 టిఎంసిలు ఉన్నాయి. పులిచింతలలో నీటి నిల్వ పూర్తిగా తగ్గడం వల్ల ప్రకాశం బ్యారేజీకి కేవలం తాగునీటికి రోజుకు 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం, సాగర్ నుంచి పూర్తిగా నీటి విడుదల నిలిపివేశారు. నాగార్జున సాగర్ ఆయకట్టు, కృష్ణా డెల్టాలో గత ఖరీఫ్‌లోనే అవసరానికి మించి కృష్ణా జలాలను వినియోగించుకున్నట్టు తెలంగాణ ప్రభుత్వం కృష్ణా వాటర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు ఫిర్యాదు చేయడంతో రబీకి కూడా కృష్ణా పరివాహక ప్రాంతానికి అరకొరగానే నీటి సరఫరా జరిగింది. ఈ నేపథ్యంలో గుంటూరు, పల్నాడు, ప్రకాశం, ఉమ్మడి కృష్ణా, బాపట్ల జిల్లాల్లో తాగునీటి ఎద్దడి పెరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో తాగునీటి పనులు పూర్తి కాకపోవడంతో పలు గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడింది. గతేడాది కాలంలో కూడా జలజీవన్ మిషన్ ద్వారా పనులు పూర్తి కాలేదు. గుంటూరు జిల్లాలో మొత్తం 260 రక్షిత నీటి చెరువులు ఉండగా, సాగర్ కాల్వల నుంచి పూర్తి స్థాయిలో నీరు అందడం లేదు. నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలో పల్నాడు జిల్లాలో 200 చెరువుల్లో నీటి నిల్వలు పడిపోయాయి. చిలకలూరిపేట, వినుకొండ తదితర ప్రాంతాలకూ తాగునీటి సమస్యలు ఏర్పడుతున్నాయి. రాబోయే నెల రోజుల్లో వర్షాలు కురిస్తే పరిస్థితి మెరుగుపడుతుందని లేదంటే జలాశయాల్లో నీటి నిల్వలు మరింత తగ్గుతాయని అధికార వర్గాలు చెబుతున్నాయి. వర్షాలు పూర్తి స్థాయిలో కురవడానికి ఇంకా రెండు నెలల సమయం ఉందని, అప్పటివరకు తాగునీటికి తప్ప ఇతర అవసరాలకు నీటి విడుదల ఉండదని ఆ వర్గాలు తెలిపాయి.


పులిచింతలలో తగ్గిన నీటి నిల్వ

మన్యం జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడి నాలుగేళ్లు కావస్తున్నా జిల్లాలో విద్యాభివృద్ధికి తోడ్పడే విద్యాసంస్థలు లేకపోవడం బాధాకరమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ అశోక్ అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో మంగళవారం జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉత్తరాంధ్ర జిల్లాలు బాగా వెనకబడిన ప్రాంతాలని, ఇలాంటి ప్రాంతాల్లో వెంటనే విద్యారంగ సమస్యలు పరిష్కరించేలా విద్యాభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, పార్వతీపురంలో మెడికల్ కాలేజీ, గిరిజన పోస్ట్ మెట్రిక్ కాలేజీ, బాయ్స్ హాస్టల్‌కు సొంత భవనం నిర్మించాలని, ఉపాధ్యాయులపై యాప్ విధాన నిబంధనలను రద్దు చేయాలని, 117 జిఒను రద్దు చేసి పాఠశాలల విలీనం ఆపాలని డిమాండ్ చేశారు. మన్యం జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి కె.రాజు మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్, ఎఎన్ఎం పోస్టులను భర్తీ చేయాలని, ఖాళీగా ఉన్న సంక్షేమ హాస్టళ్లలో వార్డెన్లను, వర్కర్లను వెంటనే నియమించాలని కోరారు. గరుగుబిల్లి, సీతంపేట మండలాల్లో జూనియర్ కళాశాల, కురుపాం, బలిజిపేట కేంద్రాల్లో డిగ్రీ కళాశాలలు, వీరఘట్టంలోని డిగ్రీ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి, బిసి పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లకు సొంత భవనాలు, గిరిజన పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లకు అదనపు భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. మెస్ ఛార్జీలు రూ. మూడు వేలకు పెంచాలని, పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలుపై స్పష్టత ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టి అఖిల్, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ సింహాచలం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్

రూ.71.28 లక్షల విలులైన సెల్‌ఫోన్లు రికవరీ : ఏలూరు ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రూ.71.28 లక్షల విలువైన 594 సెల్‌ఫోన్లను రికవరీ చేశామని ఏలూరు జిల్లా ఎస్‌పి ప్రతాప్‌శివ కిషోర్ తెలిపారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను ఎస్‌పి వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 2,976 సెల్‌ఫోన్లు రికవరీ చేశామని, వీటి విలువ రూ.4.75 కోట్లు ఉంటుందని తెలిపారు. జిల్లాల నుంచి ఇతర రాష్ట్రాల నుంచి కూడా సిసిఎస్ పోలీసులు రికవరీ చేశారన్నారు. ఎవరైనా దొంగిలించిన సెల్‌ఫోన్లు తీసుకొచ్చి అమ్మడానికి చూస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పోలీసు అధికారులం, నేవీ, ఆర్మీ అధికారులమని వీడియో కాల్స్ ద్వారా సైబర్ నేరగాళ్లు ప్రజల నుంచి సొమ్ములు కొల్లగొడుతున్నారని, అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెల్‌ఫోన్ చోరీకి గురైన వెంటనే సిఇఐఆర్ పోర్టల్‌కు లేదా 1930 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.


బాధితునికి సెల్‌ఫోన్ అందిస్తున్న ఎస్‌పి

ఎంపి మిథున్ రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు విచారించాలి

- సుప్రీంకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వైసిపి ఎంపి మిథున్ రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై మరోసారి విచారించాలని రాష్ట్ర హైకోర్టుకు సుప్రీంకోర్టు ఆదేశించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ పివి మిథున్ రెడ్డి దాఖలు చేసిన ముందస్తు పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ మహాదేవన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. గతంలో ముందస్తు బెయిల్ నిరాకరిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. మెరిట్స్ ఆధారంగా మళ్లీ తాజాగా వాదనలు విని ముందస్తు బెయిల్‌పై నిర్ణయాన్ని వెల్లడించాలని హైకోర్టుకు సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది.

విచారణ సంస్థ చూపిన కొత్త ఆధారాలను పరిగణనలోకి తీసుకొని మిథున్ రెడ్డి బెయిల్‌పై హైకోర్టు నిర్ణయం తీసుకోవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బెయిల్‌పై హైకోర్టు తీర్పు ఇచ్చేంత వరకూ మిథున్ రెడ్డిని అరెస్టు చేయబోమని సుప్రీంకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి హామీ ఇచ్చారు. నాలుగు వారాల్లో మిథున్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టాలని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. మిథున్ రెడ్డి తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి మను వాదనలు వినిపించారు.

కృష్ణమోహన్‌రెడ్డి, ధనంజయ్‌రెడ్డిని 16 వరకు అరెస్టు చేయొద్దు

- రాష్ట్ర మద్యం కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర మద్యం కేసులో నిందితులుగా ఉన్న కృష్ణమోహన్‌రెడ్డి, ధనంజయ్‌రెడ్డిని ఈ నెల 16 వరకు అరెస్టు చేయొద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. మద్యం అవినీతి వ్యవహారంలో ముందస్తు బెయిల్ కోరుతూ సుప్రీంకోర్టును కృష్ణమోహన్‌రెడ్డి, ధనంజయ్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప ఆశ్రయించారు. ఈ ముగ్గురు దాఖలు చేసిన పిటిషన్లను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జెబి పార్థివాలా, జస్టిస్ మహదేవన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపిస్తూ.. హైకోర్టులో విచారణ జరుగుతున్నప్పుడు మధ్యంతర బెయిల్ పిటిషన్ దాఖలు చేశారని, ఆ పిటిషన్ విచారణార్హం కాదని పేర్కొన్నారు. ముగ్గురు పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాదులు వికాష్ సింగ్, సిద్ధార్థ దవే, నాగముత్తు వాదనలు వినిపించారు. తదుపరి విచారణను వచ్చే శుక్రవారానికి సుప్రీంకోర్టు వాయిదా వేసింది.


సంక్షేమశాఖల బడ్జెట్ అంచనాపై సమీక్ష


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర అసెంబ్లీ అంచనాల కమిటీ.. 2019-22 మధ్య కాలంలోని బడ్జెట్ అంచనాలపై సమీక్ష నిర్వహించింది. కమిటీ ఛైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు అధ్యక్షతన అసెంబ్లీ కమిటీ హాలులో మంగళవారం కమిటీ సమావేశమైంది. 2019 నుంచి 2022 మధ్య మూడేళ్ల కాలంలో సాంఘిక, గిరిజన, మైనార్టీ సంక్షేమశాఖలకు సంబంధించిన అంచనాలపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించింది. బుధవారం జరిగే కమిటీ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి బడ్జెట్ అంచనాలపై ఆ శాఖ అధికారులతో సమీక్షించనున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అసెంబ్లీ అంచనాల కమిటీ సభ్యులు భూమా అఖిలప్రియ, బి పార్థసారథి, మద్దిపాటి వెంకటరాజు, నిమ్మక జయకృష్ణ, అసెంబ్లీ ఉప కార్యదర్శి రాజ్‌కుమార్, సాంఘిక, గిరిజన, మైనార్టీ సంక్షేమశాఖల అధికారులు పాల్గొన్నారు.

డిఎస్సీ ప్రత్యేకం-ఎస్ఎ/ఎస్‌జిటి

విద్యాదృక్పథాలు : బాలలు, మానవ హక్కులు


-కె.ఎస్.లక్ష్మణరావు,
మాజీ శాసనమండలి సభ్యులు,
సెల్ : 8309965083



రాజ్యాంగంలో పొందుపర్చిన బాలల హక్కులు ఇవే..

బాలల సంక్షేమం కోసం భారత రాజ్యాంగంలో కొన్ని ప్రాథమిక హక్కులను పొందుపర్చారు. భారత రాజ్యాంగం మూడో భాగంలో పొందుపర్చిన ఆర్టికల్ 14 నుండి 32 వరకు గల ప్రాథమిక హక్కులన్నీ బాలలకు వర్తిస్తాయి. ఆదేశిక సూత్రాల్లోని ఆర్టికల్స్ 39, 45, 51 కూడా బాల హక్కుల గురించి చెబుతున్నాయి.

ఆర్టికల్ 15 (3) : బాలల సంక్షేమం కోసం ప్రత్యేక శాసనాలు చేసే అధికారం ప్రభుత్వాలకు ఉంది.

ఆర్టికల్ 19 : వాక్ స్వాతంత్ర్య హక్కు, సమావేశమయ్యే హక్కు, సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కు, నివశించే హక్కు, ఆస్థి హక్కు, ఇష్టమైన వృత్తి, వ్యాపార హక్కు బాలలకూ వర్తిస్తాయి.

ఆర్టికల్ 21 : వ్యక్తిగత ప్రాణ రక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛ బాలలకూ వర్తిస్తాయి.

ఆర్టికల్ 21 ఎ : రాజ్యం 6 నుండి 14 సంవత్సరాల బాలలందరికీ రాజ్యం (స్టేట్) చట్ట ప్రకారం నిర్ణయించిన విధంగా ఉచిత, నిర్బంధ విద్యని అందిస్తుంది.

ఆర్టికల్ 23 : వ్యక్తుల్ని వ్యాపార వస్తువులుగా మార్చడం, వారి చేత నిర్భంద సేవలు చేయించడం వంటివి చట్ట విరుద్ధం అనేది బాలలకూ వర్తిస్తుంది.

ఆర్టికల్ 24 : పధ్నాలుగు సంవత్సరాలలోపు బాలల్ని కర్మాగారాలలో పనిలో పెట్టుకోవడం లేదా ప్రమాదకరమైన పనుల్లో నియమించడం నిషేదించబడింది.

ఆర్టికల్ 39 (2) : చిన్న వయసులో బాలల్ని వారి వయస్సుకు, శక్తికి మించిన పనుల్లో నియమించరాదు.

ఆర్టికల్ 39 (ఎఫ్) : బాలల్ని దారిద్ర్యం, నైతిక పతనాల నుండి కాపాడుతూ వారు స్వేచ్ఛ, గౌరవం, ఆరోగ్యంతో వికాసం పొందడానికి అన్ని సదుపాయాలను సమకూర్చాలి.

ఆర్టికల్ 45 : ఆరు సంవత్సరాల వయస్సు వచ్చేంత వరకూ శిశు సంరక్షణ, విద్యని రాజ్యం అందించే ప్రయత్నం చేస్తుంది.

ఆర్టికల్ 15 ఎ (కె) : 6 నుంచి 14 సంవత్సరాల వయస్సు బాలలకు తల్లిదండ్రి లేదా సంరక్షకుడు విద్యావకాశాలను కల్పించాలి.

బాలల హక్కుల ఒప్పందం-ఒడంబడిక

ఐక్యరాజ్యసమితి 1989 నవంబరు 20న ఆమోదించిన బాలల హక్కుల ఒడంబడికలో తెలిపిన హక్కులను చూద్దాం.

1. మనుగడ హక్కు (రైట్ టు సర్వైవల్)

ఆర్టికల్ 6(1) : ప్రతి బాల జీవించే హక్కును కలిగి ఉన్నాడని రాజ్యాలు గుర్తించాలి.

ఆర్టికల్ 6(2) : బాల గరిష్టంగా బ్రతకడానికి, అభివృద్ధి చెందడానికి రాజ్యాలు బాధ్యత వహించాలి.

2. సంరక్షణ హక్కు (రైట్ టు ప్రొటెక్షన్)

ఆర్టికల్ 2(2) : బాలల తల్లిదండ్రులు, చట్టబద్ధ సంరక్షకులు, లేదా కుటుంబ సభ్యుల స్థాయి, పనులు, వ్యక్తపరచిన అభిప్రాయాలు, లేక నమ్మకాల కారణంగా ఉండే అన్ని రకాల వివక్ష లేక శిక్ష నుండి రాజ్యాలు బాలను సంరక్షించడానికి తగిన చర్యలను చేపడతాయి.

ఆర్టికల్ 3(2) : బాల చక్కగా ఉండటానికి తగిన సంరక్షణ, శ్రద్ధను రాజ్యాలు తీసుకుంటాయి.

ఆర్టికల్ 3(2) : బాలల సంరక్షణలోని సంస్థలు, సేవలు, సౌకర్యాలు నిర్ధారించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా రాజ్యాలు శ్రద్ధ తీసుకుంటాయి.

ఆర్టికల్ 16(2) : బాల ఏకాంతం, కుటుంబం, గృహం లేదా ఉత్తర ప్రత్యుత్తరాల విషయాల్లో చట్టవిరుద్ధ చొరబాటు నుండి రక్షణ పొందే హక్కు ఉంది.

ఆర్టికల్ 19 : లైంగిక వేధింపు, దోపిడీతోపాటు శారీరక, మానసిక నష్టం లేక నిర్లక్ష్యం నుండి రక్షణకు రాజ్యాలు తగిన చట్టపరమైన, పరిపాలనా పరమైన, సామాజికపరమైన, విద్యాపరమైన చర్యల్ని తీసుకుంటాయి. **ఆర్టికల్ 23(2), 23(3) :** వైకల్యం గల పిల్లలకు ప్రత్యేక చికిత్స, సంరక్షణ రాజ్యాలు అందించాలి.

ఆర్టికల్ 24(1), 24(2): అత్యున్నతమైన ప్రామాణికత గలిగిన ఆరోగ్యాన్ని పొందే అర్హతను కలిగి ఉన్నాడు. రాజ్యాలు సంరక్షణను చూడటంతోపాటు ఆరోగ్యం, విద్య, శిశు మరణాలు తగ్గించడంపై శ్రద్ధ వహించాలి.

ఆర్టికల్ 26 : బాల సామాజిక భద్రతను గుర్తించి దానిని సాధించడానికి తగిన చర్యలను రాజ్యాలు చేపడతాయి.

ఆర్టికల్ 32(1) : రాజ్యాలు బాల ఆర్థిక దోపిడీకి గురికాకుండా ఉండాల్సిన హక్కుని గుర్తించి తగిన చర్యలను చేపడతాయి.

ఆర్టికల్ 33 : మత్తు పదార్థాల చట్ట విరుద్ధ వినియోగం, మత్తు పదార్థాల తయారీ లేదా దొంగ రవాణాలో భాగస్వామ్యులవడం నుండి రాజ్యాలు బాలల్ని కాపాడతాయి.

ఆర్టికల్ 36 : బాలల సంక్షేమానికి సంబంధించిన అన్ని రకాల దోపిడీల నుండి బాలను రాజ్యాలు కాపాడతాయి.

3. అభివృద్ధి (వికాస) హక్కు (రైట్ టు డెవలప్‌మెంట్)

ఆర్టికల్ 6(1), 6(2) : ప్రతి బాల జీవించే హక్కును కలిగి ఉన్నాడు. గరిష్టంగా బ్రతికేలా, అభివృద్ధి చెందేలా రాజ్యాలు చూడాలి.

ఆర్టికల్ 18 : బాలని పెంచే, అభివృద్ధి పర్చే బాధ్యత తల్లిదండ్రులు ఇద్దరికీ ఉందనే సూత్రాన్ని గుర్తించేలా చేయటానికి తగిన చర్యలను చేపడతాయి.

ఆర్టికల్ 27(1) : బాలశారీరక, మానసిక, నైతిక, సాంఘిక అభివృద్ధి కోసం ప్రామాణికమైన జీవనాన్ని గడిపే హక్కు ఉందని రాజ్యాలు గుర్తిస్తాయి.

ఆర్టికల్ 27(2) : బాల అభివృద్ధికి తల్లిదండ్రులదే ప్రాథమిక బాధ్యత.

ఆర్టికల్ 27(3) : బాలల సంక్షేమం కోసం తల్లిదండ్రులకి లేదా ఇతరులకి రాజ్యాలు సహాయాన్ని అందిస్తాయి.

4.పాల్గొనే హక్కు (రైట్ టు పార్టిసిపేషన్)

ఆర్టికల్ 12(1) : ప్రభావితం చేసే అన్ని అంశాల్లో తన అభిప్రాయాల్ని స్వేచ్ఛగా వ్యక్తపర్చే అవకాశాన్ని అలా చేయగల సామర్థ్యం గలిగిన బాలకు ఇవ్వాలి.

ఆర్టికల్ 23(1) : గౌరవం, స్వీయ నిర్భరతను కల్పిస్తూ సముదాయంలో బాల చురుకుగా పాల్గొనగలిగిన పరిస్థితుల్లో శారీరకంగా లేక మానసికంగా వైకల్యం గలిగిన బాల సంపూర్ణమైన, చక్కని జీవనాన్ని గడపడాన్ని రాజ్యాలు గుర్తించాలి.

ఆర్టికల్ 31(2) : బాల పరిపూర్ణంగా సాంస్కృతిక, కళాత్మక జీవనంలో పాల్గొనే హక్కుని రాజ్యాలు గౌరవించడం, అభివృద్ధి పరచడంతోపాటుగా అతనికి సాంస్కృతిక, కళాత్మక, వినోదాత్మక, తీరిక సమయం కృత్యాల్లో పాల్గొనడానికి సరైన, సమాన అవకాశాలను రాజ్యాలు కల్పించాలి.

5. విద్యాహక్కు (రైట్ టు ఎడ్యుకేషన్)

ఆర్టికల్ 28(1) : రాజ్యాలు బాలల విద్యా హక్కుని గుర్తించి బాలలందరికీ నిర్బంధ, ఉచిత ప్రాథమిక విద్యను అందించాలి. వివిధ రకాల మాధ్యమిక, సాధారణ, ఔద్యోగిక, విద్యను అభివృద్ధి పర్చి అందించాలి సరైన ప్రాతిపదికన అందరికీ ఉన్నత విద్య అందుబాటులో ఉండేలా చూడాలి.

ఆర్టికల్ 28(2) : పాఠశాలలో క్రమశిక్షణ మానవ గౌరవానికి తగినట్లుగా, ఈ ఒప్పందానికి అనుగుణంగా ఉండేలా చర్యలు చేపట్టాలి.

ఆర్టికల్ 28(3) : విద్యకు సంబంధించిన అంశాల్లో, ప్రపంచంలో నిరక్షరాస్యతని తగ్గించే విషయాల్లో, శాస్త్రీయ, సాంకేతిక జ్ఞానంలో, నూతన బోధనా పద్ధతుల్లో రాజ్యాలు సహకరించుకోవాలి.

ఆర్టికల్ 29(1) : బాలమూర్తిమత్వం, ప్రతిభలు, మానసిక, శారీరక సామర్థ్యాలు పూర్తి స్థాయికి అభివృద్ధి చెందాలి. మానవ హక్కుల, ప్రాథమిక స్వాతంత్ర్యాల పరంగా విద్య అభివృద్ధి చెందాలి. స్వేచ్ఛాయుత సమాజంలో బాధ్యతాయుత జీవనం కోసం, స్వేచ్ఛాయుత సమాజంలో బాధ్యతాయుత నైతిక, జాతీయ, మత, ప్రాంతీయ ప్రజలందరితో అవగాహన, శాంతి, సహనం, లింగ సమానత్వం, స్నేహం కలిగి ఉండే భావాన్ని విద్య ద్వారా అభివృద్ధి చెందించాలి. పర్యావరణం గురించిన విద్య ఉండాలి.

రేపు : ప్రాథమిక హక్కులు

మానవ హక్కులు (హ్యూమన్‌రైట్స్)

4.4.1 మానవ హక్కుల సార్వత్రిక ప్రకటన (యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్‌రైట్స్)

యునైటెడ్ నేషన్స్ అవతారికలో ప్రాథమిక మానవ హక్కులపై నమ్మకం వెలిబుచ్చింది. యునైటెడ్ నేషన్స్ చార్టర్‌లోని ఆర్టికల్ 1లో 'జాతి, లింగ, భాష, మతం లాంటి వివక్షత లేకుండా మానవ హక్కులను, ప్రాథమిక స్వేచ్ఛలను గౌరవించడం, పెంపొందించడం కోసం అంతర్జాతీయ సహకారం తీసుకోబడుతుంది" అని వివరించబడింది. యునైటెడ్ నేషన్స్ సర్వ ప్రతినిధి సభ (జనరల్ అసెంబ్లీ) 1948 డిసెంబర్ 10న మానవ హక్కుల సార్వత్రిక ప్రకటనను ఆమోదించింది. (డిసెంబర్ 10ని మానవ హక్కుల దినోత్సవంగా జరుపుకుంటున్నాం) మానవ హక్కుల సార్వత్రిక ప్రకటనలోని 30 ఆర్టికల్‌ను సంక్షిప్తంగా తెలుసుకుందాం.

1. స్వేచ్ఛగా పుట్టిన మానవులంతా గౌరవం, హక్కుల విషయంలో సమానమే.
2. ఎలాంటి జాతి, రంగు, లింగం, భాష, మతం, రాజకీయ లేక ఇతర అభిప్రాయం, జాతి లేక సామాజిక ఆవిర్భావం, ఆస్తి, పుట్టుక లేక ఇతర స్థితి కారణంగా ఎలాంటి వివక్షత లేకుండా ఈ ప్రకటనలోని అన్ని హక్కులు. స్వేచ్ఛలు పొందడానికి ప్రతి ఒక్కరూ అర్హులు.
3. ప్రతి ఒక్కరూ జీవన, స్వేచ్ఛ, రక్షణ హక్కులను కలిగి ఉన్నారు.
4. ఏ వ్యక్తి బానిసగా లేదా సేవలో కట్టివేయబడరాదు. అన్ని రకాల బానిసత్వం, బానిస వ్యాపారం నిషేధింపబడుతుంది.
5. ఎవరూ చిత్రహింసకు లేదా క్రూరత్వానికి, అమానుషత్వానికి లేక దండనకు గురి చేయబడరాదు.
6. ప్రతిచోట చట్టం ముందు వ్యక్తిగా గుర్తింపు పొందే హక్కు, ప్రతి ఒక్కరికీ ఉంది.
7. చట్టం ముందు అందరూ సమానులే. ఎలాంటి వివక్షతా లేకుండా చట్ట సంరక్షణకు అందరూ సమానంగా అర్హులే.
8. రాజ్యాంగం లేదా న్యాయం ద్వారా కల్పించబడిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించే చర్యలపై పరిహారం పొందేందుకు న్యాయస్థానాలకు వెళ్లే హక్కును ప్రతి ఒక్కరూ కలిగి ఉన్నారు.
9. ఆర్బిట్రరీగా ఎవరినీ అరెస్టు చేయడం, నిర్బంధించడం లేదా ప్రవాసంలోకి పంపడం చేయరాదు.
10. తన హక్కులు, ఆబ్లిగేషన్లు, తనపై మోపబడిన నేరాలకు సంబంధించి స్వతంత్ర, నిష్పక్షపాత న్యాయస్థానంలో సరసమైన, బహిరంగ వాదనకు ప్రతి ఒక్కరూ అర్హులై ఉన్నారు.
11. బహిరంగ విచారణలో చట్ట ప్రకారం నేరం ఋజువయ్యేంత వరకు నేరం చేశాడని చెప్పబడే ప్రతి వ్యక్తినీ నిర్దోషిగానే భావించాలి.
12. ఎవరి ఏకాంతం, కుటుంబం, ఉత్తర ప్రత్యుత్తరాల్లో ఆర్బిట్రరీగా కలుగజేసుకోరాదు. ఎవరి గౌరవం, పేరు ప్రఖ్యాతులపై దాడి జరుపరాదు. అలాంటి జోక్యాలు లేదా దాడుల నుండి చట్ట సంరక్షణ పొందే హక్కును ప్రతి ఒక్కరూ కలిగి ఉన్నారు.
13. దేశ సరిహద్దుల లోపల స్వేచ్ఛగా వెళ్ళగలిగే, నివాసం ఏర్పరచుకొనే హక్కును కలిగి ఉన్నారు. అలానే ఏ దేశాన్నైనా విడిచి వెళ్ళడం లేదా తిరిగి రావడానికి హక్కును కలిగి ఉన్నారు.
14. విచారణ నుండి తప్పించుకొనేందుకు ఇతర దేశాల్లో ఆశ్రయం పొందే హక్కును కలిగి ఉన్నారు.
15. ప్రతి ఒక్కరూ జాతీయత హక్కును కలిగి ఉన్నారు.
16. జాతి, జాతీయత లేక మతం కారణంగా ఎలాంటి పరిమితి లేకుండా పరిపూర్ణ వయసులో పురుషులు, స్త్రీలు వివాహం చేసుకొనే, కుటుంబాన్ని ఏర్పాటు చేసుకొనే హక్కు వుంది. .
17. ఒంటరిగా లేదా ఇతరులతో కలిసి ఆస్తిని కలిగి ఉండే హక్కు ఉంటుంది.
18. ఆలోచన, చేతనత్వం, మత స్వేచ్ఛా హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది.
19. అభిప్రాయం, భావవ్యక్తీకరణ స్వేచ్ఛ ఉంటుంది.
20. శాంతియుతంగా సమావేశాలు నిర్వహించుకోవడానికి సంఘాలు ఏర్పరచుకోవచ్చు.
21. ప్రతి ఒక్కరు వారి దేశ ప్రభుత్వ పాలనలో పాలు పంచుకోవచ్చు.
22. సమాజంలో సభ్యునిగా సామాజిక రక్షణ పొందే హక్కు ఉంది.
23. పనిచేయడానికి, ఉద్యోగాన్ని స్వేచ్ఛగా ఎంపిక చేసికోడానికి, పనికి అనుకూలమైన పరిస్థితులను కలిగి ఉండటానికి, నిరుద్యోగం నుండి రక్షణ పొందడానికి ప్రతి ఒక్కరికి హక్కు ఉంది. ఎలాంటి వివక్షత లేకుండా సమాన పనికి సమాన వేతనం పొందే హక్కు ఉంది. తమ అభిరుచుల సంరక్షణకు ట్రేడ్ యూనియన్ల స్థాపనకు, వాటిలో చేరడానికి హక్కు ఉంది.
24. పని గంటల పరిమితి, జీతంతో కూడిన శలవులతో సహా విశ్రాంతి, విరామ సమయం పొందే హక్కు ఉంది.
25. తన, తన కుటుంబ ఆరోగ్యం, సంక్షేమ కోసం ఆహారం, బట్టలు, గృహవసతి, వైద్య సంరక్షణ, ఇతర అత్యవసర సామాజిక సేవలతో సహా ప్రామాణిక జీవనానికి అవసరమైన అన్నింటిని పొందే హక్కు ఉంది.
26. ప్రతి ఒక్కరికి విద్యా హక్కు ఉంది. కనీసం ప్రాథమిక, ఆధార స్థాయిల వరకు విద్య ఉచితంగా అందించబడాలి. ప్రాథమిక విద్య నిర్బంధంగా ఉండాలి. సాంకేతిక, వృత్తి విద్య అందరికీ సాధారణంగా లభించాలి. ప్రతిభప్రాతిపదికగా ఉన్నత విద్య అందరికీ అందుబాటులో ఉండాలి. విద్య మానవ మూర్తిమత్వ పరిపూర్ణ వికాసం కోసం నిర్దేశించబడాలి. మానవ హక్కులు, ప్రాథమిక స్వేచ్ఛల పట్ల గౌరవాన్ని పటిష్ట పర్చేదిగా ఉండాలి. అది అన్ని దేశాలు, జాతి లేక మత సమూహాల మధ్య సహనం, స్నేహాన్ని పెంపొందించాలి. శాంతిని కాపాడటంలో యునైటెడ్ నేషన్స్ చర్యలను ముందుకు తీసుకుపోయేదిగా ఉండాలి.
27. సముదాయ సాంస్కృతిక కార్యకలాపాల్లో స్వేచ్ఛగా పాల్గొనడానికి, కళలను ఆస్వాదించడానికి, శాస్త్రీయ ప్రగతిని దాని ఫలితాలను అనుభవించడానికి ప్రతి ఒక్కరికీ హక్కుంది. శాస్త్ర భాష లేక కళా ఉత్పత్తి పరంగా ఉత్పన్నమయ్యే నైతిక, భౌతిక అభిరుచులని కాపాడుకొనే హక్కు ఉంది.
28. ఈ ప్రకటనలోని హక్కుల్ని, స్వేచ్ఛల్ని సాధించేందుకు సామాజిక, అంతర్జాతీయ వ్యవహారాల్లో పాల్గొనడానికి ప్రతి వ్యక్తి అర్హుడే.
29. తన మూర్తిమత్వం స్వేచ్ఛగా, పరిపూర్ణంగా అభివృద్ధి చెందడానికి సమాజం పట్ల ప్రతి ఒక్కరికీ బాధ్యతలు ఉన్నాయి.
30. ఈ ప్రకటనలోని హక్కులు, స్వేచ్ఛలను విచ్ఛిన్నం చేయడానికి ఏ దేశం, సమూహం లేదా వ్యక్తి ఎలాంటి పనిలో నిమగ్నంకాకూడదు. ఎలాంటి కార్యాన్ని నిర్వర్తించరాదు.

సంపాదకీయం

సత్యం.. సత్యం...


నిజాన్ని నిలువునా పాతేయాలని... తిమ్మిని బమ్మిని చేసెయ్యాలని పాలక వర్గాలు భావిస్తుంటాయి. కానీ, వాస్తవాలు ఎప్పుడో ఒకప్పుడు పాతాళం నుంచైనా బయటకు వచ్చి నాటి తప్పులకు వారిని బోనులో నిలబెడుతుంటాయి. కోవిడ్ అనగానే... మనదేశంలో గుర్తొచ్చేది... గంగానదిలో కొట్టుకుపోతున్న శవాలు, గుట్టలు గుట్టలుగా 24 గంటలూ శ్మశానాల్లో సాగిన అంత్యక్రియలు... కనీసం తమ రక్తసంబంధీకులను సైతం కడసారి చూడటానికి కూడా వెళ్లలేని నిస్సహాయ స్థితిలో ప్రజలు అనుభవించిన మానసిక వ్యథ. వాటిని అరికట్టడంలో విఫలమైన పాలకులు ఆ లెక్కలు బయటకు రాకుండా తొక్కిపెట్టేందుకు నానా అవస్థలు పడ్డారు.

2021లో మన దేశాన్ని వణికించిన సార్స్ కోవిడ్-2 డెల్టా వేరియంట్ విషయంలో కేంద్రం, పలు రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన తప్పుడు నివేదికల బాగోతాన్ని తాజాగా విడుదలైన భారత సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సిఆర్ఎస్) నివేదిక కళ్లకు కట్టింది. ఆ ఏడాది దేశవ్యాప్తంగా 3.32 లక్షల మరణాలే సంభవించినట్లు అప్పట్లో కేంద్రం, పలు రాష్ట్రాల్లోని అధికార పార్టీలు చూపించాయి. తాజాగా విడుదలైన నివేదిక ప్రకారం ఆ మరణాలు 21.5 లక్షలు. అంటే ఆరున్నర రెట్లు అధికం. ఇక బిజెపి పాలిత రాష్ట్రాల సంగతి చెప్పనక్కర్లేదు! డెల్టా వేరియంట్ వల్ల 5,812 మరణాలు సంభవించినట్లు ప్రకటించుకున్న గుజరాత్‌లో ప్రాణాలు కోల్పోయింది 2.5 లక్షలని, ప్రకటించిన దానికంటే 44.2 రెట్లు అధికమని కేంద్రం ఆధ్వర్యంలో పనిచేసే సిఆర్ఎస్ నివేదిక చెబుతోంది. ఇక ఉత్తర ప్రదేశ్‌లో 2.8 లక్షల మరణాలకు గానూ లెక్కల్లో చూపింది 14,551. ఇది మోడీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో, ఉత్తర ప్రదేశ్ యోగి ఆదిత్యనాథ్ పాలనలో చెప్పే అధికారిక లెక్కలకూ... వాస్తవాలకూ ఉన్న హస్తమశకాంతర వ్యత్యాసం. ఇక మధ్యప్రదేశ్‌లోనూ 14,563 మరణాలే నమోదయ్యాయి. లక్షా 26 వేల 774 మరణాలు అదనంగా సంభవించాయి.

ఇంత దారుణంగా ఎందుకు డెల్టా వేరియంట్ విజృంభించిందో ఒక్కసారి గుర్తు చేసుకుంటే... గుజరాత్‌లో గానీ, ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో గానీ వైద్య ఆరోగ్య రంగం పరిస్థితి దారుణంగా ఉంది. ఈ వేరియంట్‌లో రోగికి ఆక్సిజన్ అవసరం ఎక్కువ. ఆసుపత్రులపై ఒత్తిడి పెంచింది. చాలా ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులు విపరీతమైన దోపిడీ చేశాయి. ఆ సమయంలో సిపిఎం, వామపక్షాలు మన రాష్ట్రంతోపాటు చాలా రాష్ట్రాల్లో తమ భవనాలను కోవిడ్ కేంద్రాలుగా మార్చి సేవలందించడం, పశ్చిమ బెంగాల్, త్రిపుర తదితర రాష్ట్రాల్లో ఇళ్లకు ఆక్సిజన్ సిలిండర్లు అందించడం, కేరళలో ప్రతి రోగికీ సరైన వైద్యం అందేలా చేయడం ద్వారా ఈ మహమ్మారికి అడ్డుకట్ట వేసేందుకు తమ వంతు ప్రయత్నం చేశాయి. ప్రభుత్వ వైద్యరంగం సరైన సేవలందించే పరిస్థితి లేని రాష్ట్రాల్లో చాలామంది ఇళ్ల వద్దే ప్రాణాలు కోల్పోయారు. వాటిని డెల్టా వేరియంట్ లెక్కల్లో కలపకుండా.. వేర్వేరు పేర్లతో నమోదు చేసి తమ బాధ్యతల నుంచి తప్పుకునేందుకు పాలకులు ప్రయత్నించడం సిగ్గుచేటు! అందుకు భిన్నంగా 44,721 మరణాలు సంభవించినట్లు కేరళ అప్పట్లో ప్రకటించింది. సిఆర్ఎస్ రికార్డుల ప్రకారం మరణించింది 65,655. దాదాపు వాస్తవ గణాంకాలు నమోదు చేసిన కేరళపై బురదజల్లేందుకు అప్పట్లో ప్రధాని మొదలు కమలం, కాంగ్రెస్ పార్టీలు తీవ్రంగా ప్రయత్నించాయి. కర్ణాటక సరిహద్దులనుసైతం మూసేసింది. వాస్తవానికి అక్కడ లక్షన్నర మరణాలు సంభవించాయి. కోవిడ్‌ను ఎదుర్కోవడంలో గణనీయమైన కృషి చేసి, ఆరోగ్యరంగంపై పూర్తిస్థాయి శ్రద్ధపెట్టి, ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన కేరళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కారు.

ఈ గణాంకాలు సైతం సకాలంలో విడుదలకాకుండా కేంద్రం మోకాలడ్డింది. నాలుగేళ్ల తరువాతనైనా విడుదల కావడంతో వాస్తవాలు ప్రపంచం ముందుకు వచ్చాయి. మహమ్మారి నిజమైన ప్రభావాన్ని అంచనా వేయడానికి, జనాభా డేటాను ప్రచురించడానికి సైతం కేంద్రం విముఖత చూపుతుండటం సరికాదు! చాలా దేశాలతో పోలిస్తే మన దేశంలో ఇప్పటికీ జనన మరణాల వివరాలు నమోదులో చాలా లోపాలు ఉంటున్నాయి. ఏమైనాగాని ఎల్లకాలమూ సత్యాన్ని దాచిపెట్టడం సాధ్యం కాదు. అటువంటి ప్రయత్నాలు తాత్కాలికమేనని సిఆర్ఎస్ డేటాతో మరోసారి రుజువైంది.

మంచి మాట



మనకు గల సత్తాను బట్టి
మనల్ని మనం
అంచనా వేసుకుంటాం.
మనం చేసిన పనులను బట్టి
ఇతరులు మనల్ని
అంచనా వేస్తారు.
- లాంగ్ ఫెలో,
కవి, విద్యావేత్త.

వక్ఫ్ చట్ట సవరణ-మైనారిటీలపై దాడి

విశ్లేషణ



హన్నన్ మొల్లా

వక్ఫ్ అన్నది అరబిక్ పదం. మత పరమైన, దాతృత్వ పరమైన లక్ష్యాలతో ఏర్పడిన ఆస్తిని వక్ఫ్‌గా పరిగణిస్తారు. ఒకసారి వక్ఫ్ ఆస్తిగా ఏర్పడ్డాక...దానిని వెనక్కు తీసుకోడానికి గాని, వేరే వాళ్ళు స్వాధీనం చేసుకోడానికిగాని, ఇతరులకు అమ్మడానికి గాని వీలు లేదు.

దేశంలో భారతీయ రైల్వే తర్వాత అతి ఎక్కువ భూమి వక్ఫ్‌ల వద్దే ఉందని ప్రకటించారు. ఆ తర్వాత ఈ విస్తారమైన, విలువైన భూమిని ఏవిధంగా చేజిక్కించుకోవాలన్నది చర్చ జరిగింది. ఈ భూమిలో అధిక భాగం పట్టణ ప్రాంతాల్లో ఉంది. అందుచేత దాని విలువ చాలా ఎక్కువగా ఉంటుంది. భూదాహంతో తహతహలాడుతున్న కార్పొరేట్ వ్యక్తుల కళ్ళు ఈ వక్ఫ్ భూముల మీద పడ్డాయి. ఇందుకు ఒక ఉదాహరణ అంబానీది. ముంబైలో చట్ట విరుద్ధంగా చాలా విలువైన వక్ఫ్ భూమిని అంబానీ కొనుగోలు చేసి అక్కడ తన భార్య కోసం రూ.16,000 కోట్లు వెచ్చించి ఒక రాజమహల్ నిర్మించాడు. ఈ కేసు ప్రస్తుతం కోర్టులో ఉంది. బహుశా అంబానీ ఈ కేసు ఓడిపోవచ్చు.


ఇటువంటి కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడడానికి, వాళ్ళు మరిన్ని వక్ఫ్ భూముల్ని చేజిక్కించుకోడానికి వీలుగా మోడీ ప్రభుత్వం ఆ వక్ఫ్ భూముల మీద పెత్తనాన్ని తన చేతుల్లోకి తీసుకోడానికి వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. ఈ నేపథ్యంలో వక్ఫ్ సవరణ చట్టం-2025ను పరిశీలించాలి.

మోడీ ప్రభుత్వ హయాంలో మైనారిటీలు ఎడతెగని బాధలు అనుభవిస్తున్నారు. ముస్లింల జీవితాలలోని అన్ని పార్శ్వాలలోకీ వివక్షత చొచ్చుకుపోతున్నది. ముస్లింలు ఈ దేశానికి చారిత్రికంగా అందించిన అభివృద్ధిని తుడిచివేయడానికి ప్రయత్నిస్తున్నారు. సమాజంలో లౌకిక, హేతుబద్ధ భావాలను వ్యక్తం చేసేవారి గొంతుకలను నొక్కేస్తున్నారు.

ఇటువంటి నేపథ్యంలో బిజెపి ప్రభుత్వం వక్ఫ్ చట్టానికి సవరణ తేవడం వెనుక ఉద్దేశం ముస్లిం మహిళలకు ప్రయోజనాలు కల్పించడం కోసమేనని ప్రకటిస్తోంది. ఇంతకన్నా మోసపూరితమైనది, అసంబద్ధమైనది ఇంకొకటుంటుందా? సుల్తానుల, మొఘల్ చక్రవర్తుల కాలంలో... ముస్లిం ప్రజల ప్రయోజనాల కోసం...ఈ వక్ఫ్ ఆస్తులు ఇస్లామిక్ ఆచారాల ప్రకారం ఏర్పడ్డాయి. 1932లో బ్రిటిష్ ప్రభుత్వం ఈ సాంప్రదాయాలను అన్నింటినీ ఒక చట్ట రూపంలోకి తెచ్చి వక్ఫ్ చట్టం చేసింది.

వక్ఫ్ చట్టాన్ని 1959లో, 1964లో, 1969లో, 1984లో సవరించారు. ఇవన్నీ చిన్న చిన్న మార్పుల కోసమే జరిగాయి. కొత్తగా తలెత్తుతున్న అవసరాలకు అనుగుణంగా, ఇస్లామిక్ పండితుల, ముస్లిం సంస్థల సలహాల మేరకు ఈ సవరణలు చేశారు. ఆ తర్వాత ఒక జాయింట్ పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ ఈ చట్టాన్ని లోతుగా అధ్యయనం చేసింది. అనంతరం ఆ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు 1995లో సమగ్రమైన వక్ఫ్ చట్టాన్ని చేశారు. ఈ చట్టం ప్రకారం వక్ఫ్ వ్యవహారాలను నిర్వహించేందుకు, పర్యవేక్షించేందుకు వక్ఫ్ బోర్డులు ఏర్పడ్డాయి. ప్రతీ వక్ఫ్‌నూ ఒక ముతావాలి లేదా ఒక ముతావాలి కమిటీ నడుపుతాయి. ఈ కమిటీలో ఆస్తిని దానం చేసినవారు, ఇతర ముస్లిం సభ్యులు ఉంటారు. వారు ఇస్లాం చట్టాల, సాంప్రదాయాల ప్రకారం వక్ఫ్‌లను నిర్వహిస్తారు.

ఈ కార్యకలాపాలనన్నింటినీ పర్యవేక్షించడానికి, మార్గదర్శకత్వం నెరపడానికి ప్రతీ రాష్ట్రంలోనూ ఒక వక్ఫ్ బోర్డు ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వంలోని ఒక సీనియర్ అధికారి ఈ బోర్డుకు ముఖ్య కార్యనిర్వాహక అధికారిగా (సిఇవో) ఉంటారు. అన్ని వక్ఫ్‌లు రిజిస్టరు చేసుకునివుండాలి. వాటి వార్షిక ఆదాయ వ్యయాల వివరాలను వక్ఫ్ బోర్డుకు ప్రతీ ఏడూ సమర్పించాలి. ఎక్కడైనా వివాదం తలెత్తితే దానిని వక్ఫ్ బోర్డు వక్ఫ్ చట్టాల ప్రకారం పరిష్కరించాలి. ఒకవేళ పరిష్కారం కాకుండా మిగిలిపోతే ఆ వివాదాన్ని కోర్టుకు నివేదిస్తారు.



వక్ఫ్ చట్టం అమలులో చాలా బలహీనతలు పొడచూపాయి. ఉదాహరణకు:1995 చట్టం వక్ఫ్ నిబంధనలను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు బాధ్యత ఇచ్చింది. కాని చాలా రాష్ట్రాలు నేటికీ ఆ నిబంధనలను రూపొందించలేదు. కేంద్ర ప్రభుత్వం ఒక కేంద్ర వక్ఫ్ కమిషనర్‌ను నియమించాలని ఆ చట్టం ఆదేశించింది. కాని కేంద్ర ప్రభుత్వం ఆ ఆదేశాన్ని సైతం అమలు చేయడంలో విఫలమైంది. ప్రభుత్వాలవైపు నుండి తలెత్తిన పలు లోపాల కారణంగా అనేక సమస్యలు పుట్టుకొస్తున్నాయి.

వక్ఫ్‌ల నిర్వహణలో అవకతవకలు, అవినీతి వంటివి చోటు చేసుకుంటున్నాయని, వక్ఫ్ ఆస్తులు కబ్జా అయిపోతున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ తప్పులకు కేవలం ముస్లిం ప్రజానీకాన్ని లేదా ఆ వక్ఫ్ సంస్థలను మాత్రమే నిందించడం సరైనదేనా? వ్యవస్థాగతంగా ఉన్న అనేక లొసుగుల వలన, పర్యవేక్షణా లోపాల వలన ఇవి ఎక్కువగా జరుగుతున్నాయి. ఇప్పుడున్న చట్టాన్ని కట్టుదిట్టంగా, సమర్ధవంతంగా అమలు జరపడమే పరిష్కారం. ప్రభుత్వ నిర్వహణా లోపాలను సరిదిద్దుకోవడం మానేసి కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని సవరించడానికి పూనుకుంది. అందుకు ఆ లోపాలనే సాకుగా చూపిస్తోంది. ఈ వైఖరి అంతిమంగా వక్ఫ్ లక్ష్యాలకు, దాని ప్రయోజనాలకు హానికరంగా తయారు కాగలదు.

1995 వక్ఫ్ చట్టానికి కేంద్ర ప్రభుత్వం ఏకంగా నలభై పైగా సవరణలను ప్రతిపాదించింది. ఇందుకు సంబంధించిన బిల్లును పార్లమెంటరీ కమిటీకి పంపింది. ఆ కమిటీ చాలా తొందరపాటుగా వ్యవహరించి తన సిఫార్సులను ఇచ్చింది. ప్రతిపక్షాలకు చెందిన కమిటీ మెంబర్ల అభిప్రాయాలను నమోదు చేయలేదు. అక్కడితో ఆగకుండా వారందరినీ కమిటీ నుండి బహిష్కరించారు. కమిటీలోని పాలక పార్టీ సభ్యులు మాత్రమే కూర్చుని ఆ సిఫార్సులను ఆమోదించారు. ఆ సిఫార్సులన్నీ మైనారిటీలకు వ్యతిరేకంగా ఉన్నవే. కమిటీ నివేదికను స్పీకర్ త్వరగా ఆమోదించారు. వెంటనే ఆ బిల్లును లోక్‌సభ లోను, రాజ్యసభలోను మెరుపు వేగంతో ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకున్నారు. ఆ వెంటనే రాష్ట్రపతి ఆమోద ముద్ర కూడా పడిపోయింది.

సవరించిన చట్టాన్ని వెంటనే అమలులోకి తెస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దాంతో భారీ ఎత్తున వక్ఫ్ భూములు కబ్జాలకు గురౌతాయన్న ఆందోళనలు తలెత్తాయి. మైనారిటీలలో ఇది భయాన్ని, ఆందోళనను కలుగజేసింది. దాంతో వారు దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాలలో వేలాదిగా నిరసన ప్రదర్శనలకు దిగారు. అన్ని ప్రజాస్వామిక, ప్రతిపక్ష పార్టీలూ వారికి మద్దతుగా నిలిచాయి. వక్ఫ్ చట్ట సవరణను వెనక్కి తీసుకోవాలన్న వారి డిమాండ్‌ను పూర్తిగా సమర్ధించాయి.

ముందే వివరించినట్టు, 'వక్ఫ్' అనేది ఒక అరబిక్ పదం. దాని మూలాలు ఇస్లామిక్ సాంప్రదాయాలలో, పద్ధతులలో ఉన్నాయి. అయితే ఇప్పుడు చట్టానికి చేసిన సవరణ వక్ఫ్ మౌలిక భావననే మార్చేయడానికి పూనుకుంది. 'ఐక్య యాజమాన్యం', 'సాధికారత', 'సామర్ధ్యం', 'అభివృద్ధి' వంటి పదాలను జొప్పించింది. ఈ పదాల వెనుక గూఢంగా వేరే ప్రయోజనాలు దాగున్నాయని ఆందోళన కలుగుతోంది. వక్ఫ్ ఎల్లప్పుడూ ఇస్లామిక్ సూత్రాలనే అనుసరిస్తోంది. అటువంటప్పుడు "ఐక్య యాజమాన్యం" అన్న పదాన్ని జొప్పించడం ఎందుకు? ఎవరితో ఐక్యత? దానివలన మత స్వయం నిర్ణయాధికారానికి ఎటువంటి ముప్పు వాటిల్లనుంది? ముస్లిమేతరులను వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో భాగస్వాములుగా చేయడానికే ఈ పదాన్ని చేర్చారా? ఇటువంటి ఉమ్మడి ఆస్తుల నిర్వహణలో ఈ ప్రభుత్వం ఇంతవరకూ ప్రదర్శించిన నిర్వాకం ఎలా ఉంది?

> దేశంలో భారతీయ రైల్వే తర్వాత అతి ఎక్కువ భూమి వక్ఫ్‌ల వద్దే ఉందని ప్రకటించారు. ఆ తర్వాత ఈ విస్తారమైన, విలువైన భూమిని ఏవిధంగా చేజిక్కించుకోవాలన్నది చర్చ జరిగింది. ఈ భూమిలో అధిక భాగం పట్టణ ప్రాంతాల్లో ఉంది. అందుచేత దాని విలువ చాలా ఎక్కువగా ఉంటుంది. భూదాహంతో తహతహలాడుతున్న కార్పొరేట్ వ్యక్తుల కళ్ళు ఈ వక్ఫ్ భూముల మీద పడ్డాయి. ఇందుకు ఒక ఉదాహరణ అంబానీది. ముంబైలో చట్ట విరుద్ధంగా చాలా విలువైన వక్ఫ్ భూమిని అంబానీ కొనుగోలు చేసి అక్కడ తన భార్య కోసం రూ.16,000 కోట్లు వెచ్చించి ఒక రాజమహల్ నిర్మించాడు.

వక్ఫ్ ఆస్తులు యావత్తు ముస్లిం ప్రజానీకానికీ ఉపయోగపడడం కోసం ఉన్నాయి. కాని చట్ట సవరణలో అనవసరంగా ముస్లింలలో చీలికలు తెచ్చే విధంగా ముస్లింలను వర్గీకరించడం జరిగింది. వక్ఫ్ బోర్డులను రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తాయి. కాని ఈ చట్ట సవరణ చేసేటప్పుడు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల పాత్రను పూర్తిగా విస్మరించింది. ఇది రాష్ట్రాల అధికారాల మీద ప్రత్యక్ష దాడి.

సవరించిన చట్టంలోని క్లాజు నెం.4 అసలు చట్టంలోని వక్ఫ్ ప్రయోజనాన్నే వక్రీకరిస్తోంది. "ఏ వ్యక్తి యొక్క స్థిర, చరాస్తులనైనా" అని అసలు చట్టంలో ఉన్నదానిని ఇప్పుడు "ముస్లిం మతాన్ని కనీసం గత ఐదేళ్ళుగా ఆచరిస్తున్న ఏ వ్యక్తి యొక్క స్థిర, చరాస్తులనైనా" అని మార్చారు. గతంలో ముస్లిమేతరులు కూడా మైనారిటీలకు మద్దతుగా వక్ఫ్‌లను ఏర్పరచడానికి సహకరించారు. ఇప్పుడు అలా సహకరించడానికి వీలు లేకుండా సవరణ చేశారు. ఇది కేవలం మైనారిటీలకు మాత్రమే వ్యతిరేకంగా లేదు. ఏ వ్యక్తికైనా వక్ఫ్‌కు దానం చేసే స్వేచ్ఛను ఇది కాలరాస్తోంది. 1995 చట్టంలో ఉన్న సమైక్యతా స్ఫూర్తిని దెబ్బ తీస్తోంది. ఇంతవరకూ వక్ఫ్ ఆస్తులకు సంబంధించి ఏ విచారణనైనా చేపట్టడానికి వక్ఫ్ బోర్డుకు అధికారం ఉండేది. ఇప్పుడు ఆ అధికారాన్ని జిల్లా కలెక్టర్‌కు బదలాయించారు. ఒక ముస్లిం-నిర్వహణ యాజమాన్య సంస్థ నుండి అధికారం ప్రభుత్వ అధికారులకు అప్పగించడం జరిగింది. ఇప్పుడు వక్ఫ్ రిజిస్ట్రేషన్ కూడా జిల్లా కలెక్టర్ సమక్షంలోనే జరగాలి. ఇంతవరకూ ఇస్లామిక్ సాంప్రదాయాలకు అనుగుణంగా జరుగుతున్నదానికి ఇది విరుద్ధం. వక్ఫ్ పరిధిలోకి వచ్చే ప్రభుత్వ భూములపై నిర్ణయాధికారం ఇప్పుడు జిల్లా కలెక్టర్లకు అప్పగించారు. గతంలో వక్ఫ్ కమిషనర్‌ను వక్ఫ్ బోర్డు నియమించేది. ఆ వక్ఫ్ కమిషనర్‌కు ఉన్న అధికారాలను తొలగించి వాటిని కూడా ఇప్పుడు జిల్లా కలెక్టర్లకు కట్టబెట్టారు. ఇది వక్ఫ్ వ్యవస్థకు ఉన్న మతపరమైన హక్కులపై తీవ్ర దాడి.

గతంలో చట్టం వక్ఫ్ బోర్డులో కనీసం ఇద్దరు మహిళలు ఉండాలని నిర్దేశించింది. ఇప్పుడు సవరించిన చట్టంలో ఇద్దరు మాత్రమే మహిళలు ఉండాలని చెప్తోంది. కేంద్ర వక్ఫ్ కౌన్సిల్‌లో అందరూ ముస్లింలే ఉండాలని ఇంతకు ముందున్న చట్టం చెప్పింది. కాని ఇప్పుడు చేసిన సవరణ ప్రకారం ఇద్దరు ముస్లిమేతరులను కౌన్సిల్ సభ్యులుగా చేర్చవచ్చు. ఇది ఒక మత వ్యవస్థలో ఇతరులు చొరబడడం అవుతుంది. ముస్లిం సంస్థలలో మత వివాదాలను రేకెత్తించడానికి దారి తీస్తుంది. ఇక్కడ సహజంగానే ఈ ప్రభుత్వానికి ఒక సవాలు ఎదురౌతుంది. "ఈ ప్రభుత్వం హిందూ దేవాలయాల నిర్వహణ కోసం ముస్లిం సభ్యులను నియమించే ఆలోచననైనా చేయగలుగుతుందా?"

పాత చట్టం ప్రకారం వక్ఫ్ బోర్డు వివాద పరిష్కారం కోసం ఏర్పరిచే ఏ ట్రిబ్యునల్‌లోనైనా సభ్యులుగా ఇస్లామిక్ చట్టంలో నిపుణులైనవారినే నియమించాలి. ఇప్పుడు ఆ షరతు ఏదీ లేదు. ఏ వ్యక్తినైనా, ఎటువంటి నైపుణ్యం లేకపోయినా, ఏ పరిజ్ఞానమూ లేకపోయినా ట్రిబ్యునల్‌కు సభ్యుడిగా నియమించవచ్చు. ముస్లిమేతరులను కూడా నియమించవచ్చు. ఇది ముస్లిం మత వ్యవహారాల్లో ఇతరులను చొప్పించి మత ఘర్షణలను రెచ్చగొట్టడానికి దారితీస్తుంది.

గతంలో వక్ఫ్ బోర్డులో ఒక ముస్లిం పార్లమెంటు సభ్యుడు కాని అసెంబ్లీకి చెందిన ముస్లిం సభ్యుడు కాని ఉండాలని చట్టంలో ఉంది. కాని ఇప్పుడు దానిని తొలగించారు. దాని వలన బోర్డులో ముస్లిమేతరుల ఆధిపత్యం పెరిగే ప్రమాదం ఉంది. ఈ ప్రభుత్వం హిందూ దేవాలయాల ట్రస్టుల్లో ముస్లింలను నియమించడానికి సిద్ధంగా ఉందా? గతంలో వక్ఫ్ ట్రిబ్యునళ్లను నియమించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండేది. ఇప్పుడు దానిని తొలగించి నేరుగా జిల్లా కలెక్టర్లకు కట్టబెట్టారు. ఇక రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ ఎక్కడుంటుంది? గతంలో వక్ఫ్‌కు చెందిన అకౌంట్లను ఆడిట్ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండేది. ఇప్పుడు సవరించిన చట్టం ప్రకారం ఆ అధికారాన్ని మొత్తం కేంద్ర ప్రభుత్వం తన చేతిలోకి తీసుకుంది.


గతంలో బ్రిటిష్ పాలనా కాలంలో జిల్లా కలెక్టర్లకు కొన్ని అధికారాలను ఇచ్చారు. కాని ఆ కలెక్టర్లకు ఉన్న విపరీతమైన పనుల భారం వలన, బహు బాధ్యతల వలన వక్ఫ్‌కు సంబంధించిన పనులను వారు పట్టించుకోడంలో విఫలమయ్యారు. అందుచేత ఆ సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేశారు. ఇప్పుడు చట్టానికి చేసిన సవరణలు మళ్ళీ పరిస్థితిని మొదటికే తెస్తున్నాయి. ముస్లిం వక్ఫ్ బోర్డు, ముస్లిం సభ్యులతో కూడిన ట్రిబ్యునళ్ళు చేస్తున్న పనులను జిల్లా కలెక్టర్లకు, ముస్లిమేతర అధికారులకు అప్పజెప్పడం అంటే వక్ఫ్ ఆస్తుల మీద ఇస్లామిక్ యాజమాన్యం స్థానంలో ప్రభుత్వ ప్రత్యక్ష యాజమాన్యాన్ని తీసుకురావడమే అవుతుంది.

ఈ సవరణలన్నీ చూస్తే వక్ఫ్‌లను మెరుగ్గా నిర్వహించే లక్ష్యంతో కాకుండా, ఒక మత విద్వేషపు మానసిక స్థితి నుండి కేంద్ర ప్రభుత్వం వీటిని తెచ్చిందని స్పష్టం అవుతోంది. రాజ్యాంగంలో 25, 26 అధికరణలు మైనారిటీలకు గ్యారంటీ చేసిన ప్రాథమిక హక్కులకు ఈ సవరణ భంగం కలిగిస్తోంది. తమ మత సంస్థలను తాముగా నిర్వహించుకునే హక్కును ఒక కుట్ర ప్రకారం వారికి నిరాకరించడం జరుగుతోంది. ఈ సవరణలను సమర్ధించుకోడానికి ప్రభుత్వం చేస్తున్న వాదనల్లో వాస్తవమూ లేదు, అవి సరైనవీ కావు. కేవలం ఒక మత విద్వేష ఎజెండాను అమలు చేసే లక్ష్యమే కనిపిస్తోంది. వక్ఫ్ అసలైన స్ఫూర్తిని దెబ్బతీసి దానిని ఒక ప్రభుత్వ యాజమాన్యంలో నడిచే సంస్థగా, ముస్లిమేతరుల పెత్తనంలో నడిచే వ్యవస్థగా మార్చివేసే ప్రమాదం కనిపిస్తోంది. సహజంగానే ఈ సవరణలు మైనారిటీలను తీవ్ర భయాందోళనలకు గురి చేస్తున్నాయి. 'హిందూ రాజ్యం' స్థాపించాలనే దిశగా ప్రభుత్వం వేస్తున్న అడుగులు తీవ్ర అస్థిరతకు కారణమౌతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఈ చట్ట సవరణలను ఉపసంహరించడమే పరిష్కారం.

(స్వేచ్ఛానుసరణ)

ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ భారత్‌కు నష్టదాయకం

విమర్శ



వై. కేశవరావు

అమెరికా ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ కోరుతున్నది, మోడీ ప్రభుత్వం అందుకు సిద్ధపడింది. అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి వాన్స్ ఇప్పటికే చర్చలు జరిపి వెళ్లారు. అమెరికా వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ ద్వైపాక్షిక ఒప్పందంలో వ్యవసాయాన్ని మినహాయించేందుకు వీలు లేదని స్పష్టం చేశారు. ఫ్రీ ట్రేడ్ ఒప్పందం జరిగితే, అమెరికా వ్యవసాయ ఉత్పత్తులన్నీ సుంకాలు లేకుండా దిగుమతి చేసుకోవలసి ఉంటుంది. పాలు, పాల పొడి, సోయా బీన్స్, కాఫీ, మొక్కజొన్న, గోధుమలు, బియ్యం, పప్పులు, నూనె గింజలు, పత్తి, ఎథనాల్ దిగుమతులలో ఉంటాయి. జన్యు మార్పిడి విత్తనాలు, పండ్లు, కూరగాయలు, ప్రాసెసింగ్ చేసిన ఆహార పదార్థాలు దిగుమతులు అవుతాయి.

ఎరువులు, డీజిల్‌పై ఇస్తున్న సబ్సిడీలు తగ్గించాలని కూడా అమెరికా కోరుతున్నది. అమెరికాలో బ్లూ బాక్స్, అంబర్ బాక్స్, గ్రీన్ బాక్స్‌ల పేరుతో రైతులకు వ్యవసాయ పెట్టుబడులలో 50 శాతం వరకు సబ్సిడీలు ఇస్తారు. మన ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలు అన్నీ కలిపి 3 శాతం మించి లేవు. అందువల్ల మన పంటల ఉత్పత్తి ఖర్చులు ఎక్కువ. ఎరువులు, డీజిల్‌పై సబ్సిడీలు తగ్గిస్తే మన పంటల ఉత్పత్తి ఖర్చులు మరింత పెరుగుతాయి. 50 శాతం సబ్సిడీలు పొందుతున్న అమెరికా రైతులతో హీనమైన సబ్సిడీలు పొందుతూ పంటలు పండిస్తున్న మన రైతులు పోటీ పడాల్సి వస్తుంది. అది సాధ్యం అయ్యేది కాదు, ఈ పోటీలో మన పంటలు ధరలు పడిపోయి మన రైతులు దివాళా తీయడం తప్ప వేరే మార్గం ఉండదు. విదేశీ, స్వదేశీ కంపెనీలు, ఎగుమతి, దిగుమతి వ్యాపారులు కుమ్మక్కై ధరలు తెగ కోసి లాభాలు గడించడానికి ఉపయోగపడుతుంది.

మన ప్రజా పంపిణీ వ్యవస్థను ఎత్తివేయాలన్నది అమెరికా విధిస్తున్న మరొక షరతు. ప్రజా పంపిణీ వ్యవస్థ అవసరాల నిమిత్తం ప్రభుత్వం కొనుగోలు చేసి నిల్వ ఉంచుతుంది. ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా కొనుగోలు ఉండడానికి, కొంతవరకు వ్యాపారులు మార్కెట్ రేట్లు తెగ్గోయడానికి వీలు లేకుండా ఉంది. ప్రభుత్వ సంస్థలు కొనుగోలు బాధ్యత నుండి తప్పుకుంటే వ్యాపారుల ఇష్టారాజ్యం అవుతుంది. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో ధరల స్థిరీకరణ నిధి రద్దు చేసింది. ప్రభుత్వ సంస్థలు కొనుగోళ్ళు చేయడం లేదు. ఫలితంగా ఈ ఏడాది రైతులు పండిస్తున్న మన పంటల ధరలన్నీ పడిపోయాయి. మిర్చి, పొగాకు, ధాన్యం, మినుములు, పత్తి, జీడి పిక్కలు, కోకో గింజల ధరలు గత ఏడాదికన్నా సగానికి సగం తగ్గించుకోవడం, లేదా అసలు కొనకపోవడం చూస్తున్నాము. అగ్రిమెంట్ రాకముందే ఇలా ఉంటే అగ్రిమెంట్ వస్తే ఎలా ఉంటుందో ఊహించాలంటేనే పరిస్థితి భయానకంగా ఉంది.

అమెరికా కంపెనీలపై వ్యాజ్యాలు వేసే విధానం రద్దు చేయాలన్నది అగ్రిమెంట్‌లో అమెరికా కోరుతున్న మరొక షరతు. ఇప్పటికే బహుళజాతి కంపెనీలకు లొంగిన భారత ప్రభుత్వం విత్తన చట్టాన్ని పక్కన పెట్టింది. ప్రత్తి పంటకు మాత్రమే ఉన్నది. నాసిరకం విత్తనాల వల్ల రైతులు నష్టపోతే కోర్టుకు వెళ్లే అవకాశం ఉంది. ఈ అవకాశం ఉండగానే కంపెనీలు కోర్టు తీర్పులకు సైతం లెక్కచేయకుండా రైతులను ముప్పతిప్పలు పెడుతున్నాయి. కోర్టుకు వెళ్లే అవకాశం లేకుండా చేస్తే కంపెనీల ఇష్టారాజ్యం అవుతుంది. నాసిరకం విత్తనాలు, క్రిమిసంహారకాలు రైతులను తీవ్రంగా నష్టపరుస్తాయి.

వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధాన పత్రం


కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధాన పత్రం విడుదల చేసింది. పత్రం విడుదల చేసిన 15 రోజుల లోపల అభ్యంతరాలు ఉంటే తెలియజేయమని చెప్పింది. ఈ పత్రాన్ని పరిశీలిస్తే రెండు అంశాలు స్పష్టం అవుతున్నాయి. 2020లో అప్రజాస్వామికంగా తెచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాల స్థానంలో కార్పొరేట్ల దోపిడీకి అనుకూలమైన విధానాలను దొడ్డి దారిన అమలుకు పూనుకోవడం. విదేశీ, స్వదేశీ కార్పొరేట్ కంపెనీలు మన వ్యవసాయ మార్కెట్లలో స్వేచ్ఛగా ప్రవేశించి అయిన కాడికి మన రైతాంగాన్ని దోపిడీ చేయడం.

ఇప్పుడున్న మార్కెట్ చట్టానికి 12 సవరణలు చేసింది. సవరణలు అన్నీ విదేశీ, స్వదేశీ, కార్పొరేట్ శక్తులు, ఎగుమతి దిగుమతి వ్యాపారులు మన వ్యవసాయ మార్కెట్లలో స్వేచ్ఛగా జొరబడి మన రైతులను దోపిడీ చేయడానికి వీలు కల్పించేవే. ఎగుమతి దిగుమతి దారులు, ప్రాసెసింగ్ కంపెనీలు మనకున్న సంస్థగత మార్కెట్ యార్డులు, ఎఫ్‌సిఐ, సిడబ్ల్యూసి, వేర్‌హౌసింగ్ గోడౌన్లను స్వేచ్ఛగా వినియోగించుకోవడానికి వీలు కల్పించేవే. ఇప్పటికే 2 లక్షల టన్నులు నిల్వ సామర్థ్యం కలిగిన గోడౌన్లు అదానికి అప్పగించారు. ఈ విధానం ప్రకారం పంటలకు మద్దతు ధరల విధానం ఉండదు. రైతులు తమ పంటలను కంపెనీల, వ్యాపార వర్గాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి అమ్ముకోవాల్సి రావడం తప్ప గత్యంతరం ఉండదు. ప్రభుత్వ ఏజెన్సీలేవీ మార్కెట్లో కొనుగోలు చేయవు. ఈ విధానాలు రద్దు చేసిన చట్టాల కన్నా మరింత ప్రమాదకరమైనవి.

సరళీకరణ విధానాల పుణ్యమా అని వ్యవసాయ రంగం సంక్షోభానికి గురైంది. రైతు పండించిన పంటలకు మద్దతు ధరలు లేకుండా పోయాయి. ఫలితంగా రైతాంగం రుణగ్రస్తులయ్యారు. మద్దతు ధరల కన్నా తక్కువకు అమ్మడం, కొనడం వలన రైతాంగం ఏటా రూ.2 లక్షల కోట్లు కోల్పోతున్నారని అంచనా. దేశంలో రైతు సంఘాలు చేసిన పోరాట ఫలితంగా డా|| స్వామినాథన్ కమిషన్ ఏర్పడింది.

> అమెరికా వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ ద్వైపాక్షిక ఒప్పందంలో వ్యవసాయాన్ని మినహాయించేందుకు వీలు లేదని స్పష్టం చేశారు. ఫ్రీ ట్రేడ్ ఒప్పందం జరిగితే, అమెరికా వ్యవసాయ ఉత్పత్తులన్నీ సుంకాలు లేకుండా దిగుమతి చేసుకోవలసి ఉంటుంది. పాలు, పాల పొడి, సోయా బీన్స్, కాఫీ, మొక్కజొన్న, గోధుమలు, బియ్యం, పప్పులు, నూనె గింజలు, పత్తి, ఎథనాల్ దిగుమతులలో ఉంటాయి. జన్యు మార్పిడి విత్తనాలు, పండ్లు, కూరగాయలు, ప్రాసెసింగ్ చేసిన ఆహార పదార్థాలు దిగుమతులు అవుతాయి. ఎరువులు, డీజిల్‌పై ఇస్తున్న సబ్సిడీలు తగ్గించాలని కూడా అమెరికా కోరుతున్నది.

స్వామినాథన్ కమిషన్ వ్యవసాయ సంక్షోభం పరిష్కారానికి అనేక విలువైన సూచనలు చేసింది. ఆ సూచనలలో అత్యంత కీలకమైనది రైతు పండించిన పంటలకు మద్దతు ధరలు కల్పించడం. స్వామినాథన్ సమగ్ర ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50 శాతం కలిపి పంటల ధరలు నిర్ణయించాలని, ఆ ధరల అమలుకు పటిష్టమైన చట్టం చేయాలని సూచించారు. దానిని సి2 ప్లస్ 50 శాతం ఫార్ములాగా పేర్కొన్నారు. దేశంలోని రైతు సంఘాలు సి2 ప్లస్ 50 శాతం ఫార్ములా అమలు కోసం, రైతు రుణ విముక్తి కోసం పోరాటం సాగించిన క్రమంలో బిజెపి ఎన్నికలలో అమలుకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చాక మోసగించింది. రైతులు కోరుతున్న చట్టాలకు మారుగా కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు మూడు నల్ల చట్టాలను తెచ్చింది. 13 మాసాల రైతాంగ పోరాట ఫలితంగా అవి రద్దయ్యాయి. ఆ సందర్భంగా రైతు సంఘాలకు రాత పూర్వకంగా ఇచ్చిన హామీని తుంగలో తొక్కి కార్పొరేట్ అనుకూలమైన విధానాలతో వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధానం రూపొందించింది. బిజెపి ప్రభుత్వం భారత రైతాంగానికి ద్రోహం చేసింది. వ్యవసాయ రంగాన్ని విదేశీ, స్వదేశీ, కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకే వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధాన పత్రం. దానితో పాటు మొత్తం మన వ్యవసాయ రంగాన్ని అదాని, అంబానీలకు, సింజెంటా, పైనీర్, కార్గిల్, బేయర్, డూపాంట్ తదితర కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడానికి సిద్ధం అవుతుంది. 'ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్, వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధానం' అమలైతే మన వ్యవసాయ రంగాన్ని బహుళజాతి కంపెనీల కబంధ హస్తాలకు అప్పగించడమే. నల్లచట్టాలను విధానం రద్దు చేయడం కోసం గతంలో 13 నెలలు పోరాడి ఎలా రద్దు చేయించుకున్నామో...సి2 ప్లస్ 50 ధరల కోసం, రుణ విమోచన చట్టం కోసం అంతకన్నా మిన్నగా పోరాడాల్సిన అవసరం ఉంది. అందుకుగాను రైతాంగం, కౌలురైతులు, వ్యవసాయ కార్మికులు సన్నాహం కావాల్సి ఉంది.



/ వ్యాసకర్త రైతుసంఘం సీనియర్ నాయకులు /

పోలవరం నిర్వాసితుల నష్టపరిహారంపై దర్యాప్తు అవసరం

● సిఎస్‌కు ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ పూర్వ కమిషనర్ ఇఎఎస్.శర్మ లేఖ

ప్రజాశక్తి - విశాఖపట్నం

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఇవ్వాల్సిన నష్టపరిహారంపైనా, అటవీ హక్కుల చట్టం కింద వ్యక్తిగత, కమ్యూనిటీ పట్టాలపైనా లోతైన దర్యాప్తు అవసరమని ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ పూర్వ కమిషనర్ ఇఎఎస్.శర్మ తెలిపారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు మంగళవారం ఒక లేఖ రాశారు. ఆ వివరాలను మీడియాకు విడుదల చేశారు. పోలవరం ప్రాజెక్టు కారణంగా లక్షలాదిగా ఆదివాసీలు నిర్వాసితులవుతున్నారని పేర్కొన్నారు. 'రాజ్యాంగంలో ఐదో షెడ్యూల్ కింద నిర్వాసితులకు ఉన్న హక్కులను కోల్పోవడమే కాకుండా 2006 అటవీ హక్కుల చట్టం కింద పోడు వ్యవసాయం చేస్తున్న వారికి రావాల్సిన వ్యక్తిగత, కమ్యూనిటీ పట్టాలు కూడా కోల్పోయే అవకాశం ఉంది. నిర్వాసితుల నష్టపరిహారం విషయానికొస్తే ఒక న్యూస్ రిపోర్టు ప్రకారం.. మొదటి ఫేజ్ (41.5 మీటర్ల లెవెల్)లో 20,946 కుటుంబాలు, రెండవ ఫేజ్ (45 మీటర్ల లెవెల్)లో 85,000 కుటుంబాలు నిర్వాసితులు అవుతున్నారని, వారికి ఇవ్వవలసిన నష్టపరిహారం మొదటి ఫేజ్‌లో ఆరు నుంచి ఏడు వేల కోట్ల రూపాయలుగా, రెండవ ఫేజ్‌లో 30 వేల కోట్ల రూపాయలుగా అంచనా వేశారు. 2025 మార్చి 27న రాష్ట్ర ముఖ్యమంత్రి చేసిన ప్రకటన ప్రకారం 2019-24లో ముందున్న ప్రభుత్వం నిర్వాసితులకు ఎటువంటి నష్ట పరిహారమూ జమ చేయలేదు. కానీ ముందున్న ప్రభుత్వం 2022 సెప్టెంబర్ 19న తెలియజేసిన వివరాల ఆధారంగా అప్పటి ప్రభుత్వం 14,110 మంది నిర్వాసితులకు రూ.19,080 కోట్ల నష్టపరిహారం అప్పటికే ఇవ్వడం జరిగిందని, ఈ రెండు ప్రకటనలలో తెలియజేయబడిన వివరాల ఆధారంగా ముందున్న ప్రభుత్వం ప్రస్తావించిన రూ.19,080 కోట్ల నష్టపరిహారం దుర్వినియోగం అయినట్లు కనిపిస్తోంది. ఆ మొత్తం ఎవరి అకౌంట్లలో జమ అయిందో దర్యాప్తు చేయించాల్సిన అవసరముంది. ప్రాజెక్టు కింద నిర్వాసితులయ్యే ఆదివాసీలు ఐదో షెడ్యూల్ కింద వారికి ఉన్న హక్కులను కోల్పోనున్నారు. ఆ విషయంలో ప్రభుత్వం వారి హక్కులకు ఏ విధంగా రక్షణ కల్పిస్తుందో, జాతీయ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కమిషన్‌ను సంప్రదించి, ఒక సమగ్రమైన ప్రణాళిక అమలు చేయాలి. ప్రాజెక్టు కింద అటవీ ప్రాంతంలో జీవిస్తున్న ఆదివాసీలకు 2006 అటవీ హక్కుల చట్టం కింద వ్యక్తిగత, కమ్యూనిటీ పట్టా హక్కులు రావాల్సి ఉన్నాయి. 2019లో రాష్ట్ర ప్రభుత్వం పార్లమెంటుకు తెలియజేసిన వివరాల ఆధారంగా పోడు వ్యవసాయదారులకు రావలసిన వ్యక్తిగత పట్టాలే కాకుండా అదనంగా 70,724 ఎకరాల భూముల విషయంలో 167 కమ్యూనిటీ పట్టాలు ఇవ్వవలసిన అవసరం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఆ విషయంలో అక్కడి ఆదివాసీ గ్రామసభలను సంప్రదించాలి' అని ఆయన విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు కారణంగా విస్తృతంగా నష్టపోయేది ఆదివాసీలు మాత్రమేనని ప్రభుత్వం గుర్తించాలని, వారికి అన్యాయం జరగకుండా చూడడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. తాను సూచించిన విషయాల మీద ప్రభుత్వం ఆలస్యం చేయకుండా ఒక ప్రకటన చేయాలని విజ్ఞప్తి చేశారు.


ఆందోళన చేస్తున్న పోలవరం నిర్వాసితులు (ఫైల్ ఫోటో)

మెగా డిఎస్‌సి నుంచి ఏజెన్సీ పోస్టులు మినహాయించాలి

● ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి - అరకులోయ రూరల్ (అల్లూరి జిల్లా)

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మెగా డిఎస్‌సిలో ఏజెన్సీ పోస్టులను మినహాయించి, ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోతా రామారావు, కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో జిఒ నెంబరు 3 పునరుద్ధరణకు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చి ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ ఇచ్చి, వంద శాతం గిరిజనుల తోనే ఆ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మెగా డిఎస్‌సిలో ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ సమక్షంలో జరిగిన సమీక్షలో మూడు ఆప్షన్లు పరిశీలిస్తున్నట్లు వార్తలు వెలువడ్డాయని పేర్కొన్నారు. ఆదివాసీలకు న్యాయం జర గాలంటే ఏజెన్సీ ప్రాంతంలో వంద శాతం రిజర్వేషన్ కల్పనతోనే సాధ్యమని తెలిపారు. మిగతా ఆప్షన్లు అమలు చేస్తే ఆదివాసీలకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. టిడిపి ఎన్నికల మ్యాని ఫెస్టో ప్రకారం.. జిఒ నెంబరు 3 చట్టబద్ధతకు వెంటనే చర్యలు తీసు కోవాలని కోరారు. మెగా డిఎస్‌సి దరఖాస్తు గడువుఈ నెల 15తో ముగియనుందని, ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని మెగా డిఎస్‌సి నుంచి ఏజెన్సీ పోస్టులను మినహాయించాలని డిమాండ్ చేశారు.

లిక్కర్ స్కామ్ కేసులో సిట్ అదుపులో గోవిందప్ప బాలాజీ

● జడ్‌పి చైర్మన్ అనుచరుల్లో ఆందోళన

ప్రజాశక్తి - వి.కోట (చిత్తూరు జిల్లా)

గత వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన లిక్కర్ స్కామ్ కేసులో మంగళవారం కీలక పరిణామం చోటు చేసుకుంది. భారతి సిమెంట్స్‌లో చిత్తూరు జిల్లా వి కోట మండలానికి చెందిన జడ్‌పి చైర్మన్ శ్రీనివాసులు తమ్ముడు బాలాజీ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత లిక్కర్ అవకతవకలపై సిట్ ఏర్పాటు చేసింది. ఈ కేసులో 'ఎ 33'గా గోవిందప్ప బాలాజీని సిట్ చేర్చింది. మూడ్రోజుల క్రితమే సిట్ హైదరాబాద్‌లో గోవిందప్ప బాలాజీ ఇంట్లో శోదాలు చేసినట్లు తెలుస్తోంది. మంగళవారం కర్ణాటకలోని మైసూరులో ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. గోవిందప్ప బాలాజీ బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు అరెస్టు నుంచి మధ్యంతర రక్షణ ఇవ్వడానికి నిరాకరించింది. బాలాజీని సిట్ అదుపులోకి తీసుకుందన్న సమాచారం తెలియడంతో మండలంలోని బాలాజీ అభిమానుల్లోనూ జడ్‌పి చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అనుచరుల్లోనూ ఆందోళన నెలకొంది.



మున్సిపల్ కార్మికుల జీతాలు జూన్ 1 లోపు పెంచాలి

● సంయుక్త సమావేశంలో కార్మిక సంఘాల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపల్ శాఖలో పనిచేస్తున్న వివిధ కేటగిరీల ఇంజినీరింగ్ కార్మికులకు జిఓ 36 ప్రకారం జీతాలు పెంచాలని, ఇతర సమస్యలను జూన్ ఒకటో తేదీలోపు పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ.. ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలో మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయంలో సిడిఎంఎ పి సంపత్ కుమార్ మున్సిపల్ శాఖలోని వివిధ కార్మిక సంఘాలతో సంయుక్త సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని కార్మిక సంఘాలు ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని కోరాయి. సిడిఎంఎ సంపత్ కుమార్ స్పందిస్తూ, అనేక మున్సిపాలిటీల్లో 65 శాతం నిధులు అవుట్‌సోర్సింగ్ కార్మికులకు జీతభత్యాలకు ఖర్చు అవుతుందని తెలిపారు. మున్సిపాలిటీల ఆదాయం పెంచి ఇంజినీరింగ్ కార్మికులకు న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇంజినీరింగ్ కార్మికుల జీతాల పెంపు, ఆప్కాస్ వ్యవస్థ కొనసాగింపు తదితర విషయాలపై త్వరలోని పురపాలకశాఖ మంత్రి పి నారాయణ ఆధ్వర్యాన జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తొలుత మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. గత 17 రోజుల సమ్మె సందర్భంగా ఇంజినీరింగ్ కార్మికుల జీతభత్యాల పెంపు విషయమై ఏర్పాటు చేసిన 9 మంది అధికారుల కమిటీ క్యాటగిరీల నిర్ణయంలోనూ, జీతాల పెంపు ప్రతిపాదనలతోనూ తీవ్ర పొరపాట్లు చేసిందన్నారు. వెంటనే వాటిని సరిచేసి ఇంజినీరింగ్ కార్మికులకు జిఓ 11 ప్రకారం క్యాటగిరీలు నిర్ణయించడం, జిఓ 36 ప్రకారం జీతాలు పెంచాలని ప్రతిపాదించారు. చర్చల్లో పాల్గొన్న ఒక్క స్వతంత్ర సంఘం మినహా ఎఐటియుసి, టిఎన్‌టియుసి, జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిఓ 36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని కోరాయి. మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులందరికీ సమ న్యాయం జరగాలంటే ఉమ్మడి రాష్ట్రంలోని 2013లో మున్సిపల్ కార్మికుల కోసం ప్రత్యేకంగా జారీ చేసిన జిఓ 1615 ప్రకారం పిఆర్‌సి జీతాలు, కరువు భత్యం, మధ్యంతర భృతి, ఇంజినీరింగ్ కార్మికుల నైపుణ్యానికి అనుగుణంగా జీతాలు పెంచాలని ఈ సందర్భంగా యూనియన్‌లు విజ్ఞప్తి చేశాయి. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో ఇఎన్‌సి ప్రభాకరరావు, అదనపు డైరెక్టర్లు మురళీకృష్ణ గౌడ్, సి అనురాధ, జెడి గోపాలకృష్ణారెడ్డి, సహాయ డైరెక్టర్ వెంకట రామయ్య, ఆప్కాస్ జిఎం బి నాగప్రసాద్, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, కె నాగభూషణం, బి ముత్యాలరావు, ఎస్ జ్యోతిబసు, సంజీవరాయుడు, శ్రీనివాసరావుతో పాటు ఎఐటియుసి అనుబంధ సంఘం నాయకులు సుబ్బారాయుడు, టిఎన్‌టియుసి నాయకులు వైవి రమణ, జివిఎంసి నాయకులు ఆనంద్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల తొలగింపు

ప్రజాశక్తి-అమరావతి

తప్పుడు విద్యార్హత సర్టిఫికెట్లను సమర్పించి ఎన్‌రోల్ అయిన వారిని న్యాయవాదుల జాబితా నుంచి తొలగిస్తూ రాష్ట్ర బార్ కౌన్సిల్ కీలక నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి కౌన్సిల్ కార్యదర్శి పద్మలత పేరిట మంగళవారం నోటిఫికేషన్ వెలువడింది.

బార్ కౌన్సిల్ తొలగించిన వారిలో విశాఖపట్నం, పామిడిపల్లికి చెందిన నక్కెళ్ల సత్యవతి, గాజువాకకు చెందిన ఎల్లపు నవీన్, భీమునిపట్నంకు చెందిన ఎంవి మహేశ్వరరావు, విశాఖకు చెందిన ఎం ప్రవీణ, అదే జిల్లాకు చెందిన గేదెల రాజశేఖర్, తూర్పుగోదావరి జిల్లా, తునికి చెందిన చింతకాయల సిఎస్ఎన్ మూర్తి, సామర్లకోటకు చెందిన పి పద్మప్రియ, అదే జిల్లాకు చెందిన కురుపూడి సత్యనారాయణ, పశ్చిమ గోదావరి జిల్లా, నిడదవోలుకు చెందిన కందుకూరి విశ్వక్, గుంటూరు జిల్లా తెనాలికి చెందిన డి చాముండేశ్వరి, గుంటూరుకు చెందిన డి రత్నకుమారి, గుంటూరు జిల్లా, దర్శిపాలెంకు చెందిన సురేష్ బాబు యడల, ప్రకాశం జిల్లా, దర్శి గ్రామానికి చెందిన సిహెచ్ సిద్ధయ్య, నెల్లూరు జిల్లా, కోవూరుకు చెందిన డేగా సాయి వెంకట సుమన్, నెల్లూరు, తోటపల్లిగూడూరుకు చెందిన వెంకట రమణయ్య తాళ్లూరు, అనంతపురం జిల్లాకు చెందిన సిడి పురుషోత్తం, చిత్తూరు జిల్లా, పలమనేరుకు చెందిన జి సుబ్రహ్మణ్యం ఉన్నారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్‌రోల్‌మెంట్ కమిటీ ఉత్తర్వులకు అనుగుణంగా వీళ్లను తొలగించినట్లు నోటిఫికేషన్‌లో వివరించింది.

పెట్రోలియం ఉత్పత్తులపై పిల్ డిస్మిస్

ప్రజాశక్తి-అమరావతి

కేంద్రపాలిత ప్రాంతం పాండిచ్చేరికి చెందిన యానాంలో విక్రయించాల్సిన పెట్రోలియం ఉత్పత్తులను రాష్ట్రంలో అమ్మకాలు చేయడంపై సిబిఐ దర్యాప్తునకు ఆదేశించాలంటూ దాఖలైన పిల్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. సిబిఐ దర్యాప్తునకు ఆదేశించేందుకు నిరాకరించింది. సిబిఐ దర్యాప్తునకు ఆదేశించాలంటూ రాజమహేంద్రవరానికి చెందిన ఎ భీమనాగ రమేష్ 2023లో దాఖలు చేసిన పిల్‌లో జోక్యం చేసుకునేందుకు ఆస్కారం లేదని వెల్లడించింది. ఈ వ్యవహారంపై పోలీసుల దర్యాప్తును కాదని సిబిఐ దర్యాప్తునకు ఎందుకు ఆదేశించాలో నిర్దిష్ట కారణాలను పిటిషనర్ వివరించలేదని తప్పుపట్టింది. అరుదైన, అసాధారణ పరిస్థితుల్లోనే సిబిఐ దర్యాప్తునకు ఆదేశాలు ఇవ్వగలమని స్పష్టం చేసింది. పిల్‌లో జోక్యం చేసుకోబోమని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం తీర్పు చెప్పింది.

ఆర్‌పిల ఆదాయం పెంచేందుకు మీ సేవల పనులు

- ఎపి మెప్మా ఆర్‌పిల ఉద్యోగుల సంఘం వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మెప్మా ఆర్‌పిలకు ఆదాయం పెంచేందుకు మీ సేవల పనులు చేయడానికి అవకాశం కల్పించాలని ఎపి మెప్మా ఆర్‌పిల ఉద్యోగుల సంఘం (సిఐటియు) రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు మెప్మా ఎమ్‌డి తేజ్ భరత్‌ను, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి కొలనుకొండలోని మెప్మా కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆర్‌పిలకు గౌరవ వేతనం పెంచి ఆరేళ్లయ్యిందన్నారు. వేతనాలు పెంచాలని అనేక పర్యాయాలు అధికారులకు విన్నవించినా, ఆదాయం పెంపునకు అవకాశం కల్పిస్తామనే హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ప్రభుత్వం వేతనాలు పెంచకుండా, ఆదాయం పెరిగే మార్గాలు చూపించకుండా ఉండటం సరైంది కాదన్నారు. మీ సేవకు సంబంధించిన పనులు ఆర్‌పిలు చేయడానికి అవకాశం కల్పించాలని, తద్వారా వచ్చే ఆదాయంతో వారి కుటుంబాలకు సహాయ పడాలని విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టుల వృత్తి నైపుణ్యం పెంపునకు కృషి

- ప్రెస్ అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జర్నలిస్టుల్లో వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకు కృషి చేస్తానని సి రాఘవాచారి ప్రెస్ అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్ తెలిపారు. విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఎపియుడబ్ల్యుజె అర్బన్ యూనిట్ అధ్యక్షులు చావా రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయనను ఎపియుడబ్ల్యుజె, ప్రెస్‌క్లబ్, సామ్నా నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ.. ప్రస్తుతం కొత్తగా జర్నలిజంలోకి వచ్చే వారికి అకాడమీ ద్వారా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎపియుడబ్ల్యుజె నాయకులు మాట్లాడుతూ.. వర్కింగ్ జర్నలిస్ట్‌గా ఉన్న వ్యక్తిని ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా నియమించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఐజెయు కౌన్సిల్ సభ్యులు ఎస్‌కె బాబు, విజయవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కె జయరాజ్, డి నాగరాజు, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ రమణారెడ్డి, అర్బన్ యూనిట్ కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు, సామ్నా నగర అధ్యక్షులు ఎంవి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో భద్రత

ప్రజాశక్తి-అమరావతి

వైసిపి నేత ఇందూరి ప్రతాప్‌రెడ్డికి భద్రతను పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. భద్రతకు అయ్యే ఖర్చులను ప్రతాప్‌రెడ్డి వెచ్చించే ప్రాతిపదికపై 8 వారాలపాటు భద్రతను పునరుద్ధరించాలని ఆదేశించింది. పోలీసులు కౌంటర్ దాఖలు చేయాలంది. విచారణను జులై ఒకటికి వాయిదా వేస్తూ జస్టిస్ నూనెపల్లి హరినాథ్ ఆదేశాలు జారీ చేశారు. ఒక కేసులో ప్రధాన సాక్షిగా ఉన్న తన భర్తకు ప్రాణహాని ఉన్నందున 2020 నుంచి పోలీసుల భద్రత కల్పన జరిగిందంటూ భార్య ఇందూరి మహేశ్వరి హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వం ఒక్కసారిగా ఆ భద్రతను తొలగించిందన్నారు. ఏప్రిల్ 5న ప్రతాప్‌రెడ్డిపై హత్యాయత్నం జరిగిందని, భద్రతను పునరుద్ధరించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ప్రతాప్‌రెడ్డికి ప్రాణహాని లేదని ప్రభుత్వం చెప్పింది. అనంతరం హైకోర్టు పైవిధంగా పోలీసులకు ఉత్తర్వులు జారీ చేసింది.

బెయిల్ కోరుతూ పిఎస్ఆర్ పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

సినీనటి కాదంబరి జత్వానీ ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు పెట్టిన కేసులో బెయిల్ ఇవ్వాలంటూ సీనియర్ ఐపిఎస్ అధికారి పిఎస్ఆర్ ఆంజనేయులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ఉన్నత స్థాయి అధికారులు తప్పుడు కేసు నమోదు చేశారన్నారు. ప్రభుత్వ రాజకీయ వేటలో భాగంగా తనపై గుంటూరు, నగరపాలెం పోలీసులు మరో కేసు నమోదు చేయించిందన్నారు. జత్వానీ ఫిర్యాదు మేరకు నమోదు చేసిన కేసులో సస్పెండ్ అయిన నాటి నుంచి తాను దర్యాప్తుకు సహకరిస్తానని చెబుతూనే ఉన్నట్లు వివరించారు. జత్వానీ నిర్దిష్ట ఆరోపణలు తనపై చేయలేదన్నారు. కేసు దర్యాప్తునకు సహకరిస్తున్నప్పటికీ సహకరించడం లేదని పోలీసులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మంగళవారం దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఉద్దేశపూర్వకంగా దర్యాప్తును సాగదీయడం వెనుక దురుద్దేశాలు ఉన్నా యన్నారు. ఇదే కేసులో ఇతర అధికారులు కేసు విచారణపై స్టే ఉత్తర్వులు పొందారని గుర్తు చేశారు.

భారత్, పాక్ కాల్పుల విరమణను స్వాగతిస్తున్నాం

- నిర్మాణాత్మక పాత్ర పోషించడానికి సిద్ధం : చైనా

బీజింగ్ : భారత్, పాకిస్తాన్‌ల మధ్య కాల్పుల విరమణ మద్దతిస్తున్న, చైనా ఆ పరిణామాన్ని స్వాగతించింది. సమగ్రమైన రీతిలో, శాశ్వత కాల్పుల విరమణను సాకారం చేయడంలో నిర్మాణాత్మక పాత్ర పోషించడానికి సిద్ధంగా వున్నామని తెలిపింది. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ అమలు వల్ల రెండు దేశాల ప్రాథమిక, దీర్ఘకాలిక ప్రయోజనాలు నెరవేరుతాయని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి లిన్‌జియాన్ వ్యాఖ్యానించారు. కాల్పుల విరమణ వల్ల ఈ ప్రాంతంలో శాంతి, సుస్థిరతలు నెలకొనడానికి సానుకూల వాతావరణం నెలకొంటుందని చెప్పారు. అంతర్జాతీయ సమాజం సాధారణ ఆకాంక్షకు అనుగుణంగా వ్యవహరించిందని పేర్కొన్నారు. మీడియా సమావేశంలో లిన్ జియాన్ మాట్లాడుతూ భారత్, పాకిస్తాన్‌లు ఇరుగు పొరుగు దేశాలని, వాటిని ఒకదాన్నుండి మరొకటిని వేరు చేయలేమని, ఆ రెండు చైనాకు పొరుగు దేశాలని అన్నారు. ఉద్రిక్తతలపై చైనా సంబంధిత పక్షాలతో సన్నిహితంగా చర్చలు జరుపుతూనే వుందన్నారు. ప్రశాంతత పాటించి, సంయమనం వహించి, పరిస్థితులు పెచ్చరిల్లకుండా చూడాలని కోరినట్లు చెప్పారు. చర్చలు, సంప్రదిం పుల ద్వారా విభేదాలను పరిష్కరించుకోవాలని, రాజకీయ పరిష్కార పంథాకు రావాల్సి వుందని అన్నారు. ప్రాంతీయ శాంతి, సుస్థిరతలను పరిరక్షించడానికి కృషి చేస్తుందని అన్నారు.

ఉగ్ర చర్యలకు దిగితే బుద్ధి చెబుతాం

- ఆదంపూర్ వైమానిక స్థావరాన్ని సందర్శించిన ప్రధాని మోడీ
- సైనికుల శక్తి సామర్థ్యాలపై ప్రశంసలు



జలంధర్ : ఉగ్రవాదానికి మద్దతునిచ్చే పాకిస్తాన్‌కు ఆపరేషన్ సిందూర్‌తో స్పష్టమైన లక్ష్మణ రేఖను గీశామని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. పంజాబ్‌లోని ఆదంపూర్ వైమానిక స్థావరాన్ని మంగళవారం సందర్శించిన ప్రధాని అక్కడ సైనికులతో మాట్లాడారు. పాకిస్తాన్ సరిహద్దుకు కేవలం వంద కిలోమీటర్ల దూరంలోనే ఉన్న ఈ ఎయిర్‌బేస్‌లో మాట్లాడుతూ పాక్‌కు హెచ్చరికలు చేశారు. ఆదంపూర్ ఎయిర్‌బేస్‌ను ధ్వంసం చేశామని, అక్కడ మోహరించిన ఎస్-400 రక్షణ వ్యవస్థను కూడా నాశనం చేశామని ఇటీవల పాకిస్తాన్ చెప్పుకుంది. వైమానిక స్థావరానికి ఎటువంటి నష్టం వాటిల్లలేదని, పైగా ఎస్-400 రక్షణ వ్యవస్థ చెక్కు చెదరలేదని ఒక్క ఫోటోతో తేల్చి చెప్పింది. ఈ సందర్భంగా ప్రధాని మోడీ సైనికులతో మాట్లాడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పాకిస్తాన్‌లోని ఏ ప్రదేశం ఇక ఉగ్రవాదులకు సురక్షితం కాదని స్పష్టం చేశారు. 'ఉగ్రవాదులను వారి ఇళ్లలోకి ఇక హతమార్చుతాం. వారు తప్పించుకోవడానికి ఎలాంటి అవకాశం ఇవ్వం' అని అన్నారు. పాక్ అణు బ్లాక్‌మెయిలింగ్‌ను భారత్ సహించబోదని తేల్చి చెప్పారు. వైమానిక దళ సామర్థ్యాన్ని చూసి ప్రతి భారతీయుడు గర్విస్తున్నాడని కొనియాడారు. పాకిస్తాన్ ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ మన వైమానిక స్థావరాలు, రక్షణ దళ మౌలిక సదుపాయాలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని మోడీ చెప్పారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో మానవ శక్తి, యంత్ర శక్తి మధ్య మన సైన్యం గొప్ప సమన్వయం సాధించిందని, సాంకేతికతను వ్యూహంతో అనుసంధానించిందని తెలిపారు. పాకిస్తాన్ మళ్లీ ఉగ్రవాద చర్యలకు పూనుకుంటే భారత్ తనదైన పద్ధతిలో గట్టిగానే సమాధానం ఇస్తుందని ప్రధాని స్పష్టం చేశారు. పర్యటన అనంతరం మోడీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఈ వివరాలను పోస్ట్ చేశారు.

అత్యంత గోప్యంగా పర్యటన

ఉదయం 6.15 గంటలకు ఆదంపూర్ వైమానిక స్థావరానికి చేరుకున్న మోడీ సుమారు 50 నిమిషాల పాటు అక్కడ గడిపారు. వైమానిక దళ సిబ్బందితో, సాయుధ దళాల సీనియర్ అధికారులతో ముచ్చటించారు. ఆపరేషన్ సిందూర్‌పై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రధాని పర్యటనను అత్యంత గోప్యంగా ఉంచారు.

ఉద్యమ నేత నేపాల్‌దేవ్ భట్టాచార్య

- పలువురు సంతాపం

కొల్‌కతా : రాజ్యసభ మాజీ సభ్యులు, కార్మిక ఉద్యమ నేత, 74 ఏళ్ల నేపాల్‌దేవ్ భట్టాచార్య మృతికి సిపిఎం, పలు ప్రజాసంఘాలు తీవ్ర సంతాపం తెలిపాయి. 1979లో ఎస్ఎఫ్ఐ తొలి అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై, 1986 వరకూ కొనసాగిన ఆయన విద్యార్థి ఉద్యమ నిర్మాతల్లో ఒకరు. పశ్చిమ బెంగాల్‌లో అసంఘటిత కార్మికులను సంఘటితం చేయడంలో కీలక పాత్ర పోషించారు. బెంగాల్‌తోపాటు జాతీయ స్థాయిలో రవాణా కార్మికుల ఉద్యమానికి నాయకత్వం వహించారు. 2022 జులైలో జరిగిన అఖిల భారత రోడ్డు రవాణ కార్మికుల సమాఖ్య (ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్) 11వ మహాసభలో అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సిఐటియు ఆలిండియా వర్కింగ్ కమిటీ సభ్యుడిగా ఉన్నారు. సిఐటియు ఉత్తర 24 పరగణా జిల్లా కమిటీ అధ్యక్షులు కూడా. 1981లో బెంగాల్ నుంచి సిపిఎం తరఫున రాజ్యసభకు ఎన్నికయ్యారు. అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ, ఇటీవల ఆసుపత్రిలో చేరే వరకూ ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. బెంగాలీ సినిమా రంగంలోనూ ఆయన విశేషకృషి చేశారు. 2000లో మిథున్ చక్రవర్తి, దేవశ్రీ రాయ్ నటించిన చకా చిత్రానికి ఆయన దర్శకత్వం వహించారు.

నేపాల్‌దేవ్‌కు పలువురి నివాళి

నేపాల్‌దేవ్ భట్టాచార్య భౌతికకాయాన్ని సిపిఎం ప్రధానకార్యదర్శి ఎంఎ బేబీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి ఎమ్‌డి సలీమ్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. మృతిపై సిఐటియు, ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్, ఎఐకెఎస్, ఎస్ఎఫ్ఐ, పలు ప్రజాసంఘాలు సంతాపం ప్రకటించాయి. ట్రేడ్ యూనియన్ ఉద్యమం అనుభవజ్ఞుడైన ఒక సీనియర్ నేతను కోల్పోయిందని, ఉద్యమానికి భారీ నష్టమని సిఐటియు పేర్కొంది. ఆయన భార్య మంజుల భట్టాచార్య, ఇతర కుటుంబ సభ్యులు, మిత్రులకు సంతాపాన్ని తెలియజేసింది. భట్టాచార్య మృతి ఆయన కుటుంబానికే కాకుండా రవాణ కార్మికులు, శ్రమజీవులకు తీవ్రమైన నష్టంగా ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ పేర్కొంది. రాజ్యసభ సభ్యుడిగానూ ఆయన కార్మిక హక్కులు, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల అభివృద్ధి కోసం చేసిన పోరాటంగా గుర్తుండిపోతుందని తెలిపింది. దేశంలో విప్లవాత్మక ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడానికే తన జీవితాన్ని అంకితం చేశారని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) ప్రకటించింది. భట్టాచార్య మార్గదర్శకత్వంలోనే ఎస్ఎఫ్ఐ దేశ విద్యార్థి ఉద్యమంలో ప్రముఖ సంస్థగా అవతరించిందని, మతతత్వ శక్తులకు, విద్యను కార్పొరేట్లు స్వాధీనం చేసుకోవడానికి వ్యతిరేకంగా ప్రతిఘటన శక్తిగా ఉద్భవించిందని తెలిపింది.



నేపాల్‌దేవ్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎండి సలీమ్, ఇతర నాయకులు

బెదిరింపులు, గుత్తాధిపత్య ధోరణులు చెల్లవు

- చైనా -సెలాక్ సమావేశంలో జిన్‌పింగ్ వ్యాఖ్యలు



బీజింగ్ : అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధాన్ని ఎదుర్కొంటున్న వేళ అన్ని దేశాలు సమైక్యంగా నిలబడాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. ప్రపంచ శాంతి సుస్థిరతలను పరిరక్షించడానికి అన్ని దేశాలు కలిసి మెలిసి పనిచేస్తూ, ఏకతాటిపైకి రావాల్సిన అవసరం వుందని అన్నారు. టారిఫ్‌ల యుద్ధంలో విజేతలంటూ ఎవరూ వుండరని పరోక్షంగా ట్రంప్‌ను ఉద్దేశిస్తూ వ్యాఖ్యలు చేశారు. బెదిరింపులు, గుత్తాధిపత్యం వంటి ధోరణులు ఏకాకి కావడానికే దారితీస్తాయని హెచ్చరించారు. ఈనాడు ప్రపంచం పెను మార్పులకు గురవుతోందని, ఒకదాని వెనుక మరొకటిగా అనేక ముప్పులు తలెత్తుతూనే వున్నాయని చెప్పారు. సంఘీభావం, సహకారం ద్వారా మాత్రమే మనం ప్రపంచ శాంతి సుస్థిరతలను కాపాడుకోగలమని అన్నారు. 30కి పైగా లాటిన్ అమెరికా, కరేబియా దేశాల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో జిన్‌పింగ్ ప్రసంగించారు.

సెలాక్ నేతలతో వాంగ్ భేటీ

బీజింగ్‌లో జరుగుతున్న చైనా-సెలాక్ నాల్గవ మంత్రిత్వ స్థాయి సమావేశంలో పాల్గొన్న దేశాల్లో కొన్ని దేశాల విదేశాంగ మంత్రులు, ప్రతినిధులతో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి భేటీ అయ్యారు. చైనా - క్యూబా సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఇరు దేశాల అధ్యక్షులు అర్థవంతమైన చర్చలు జరిపారని తెలిపారు.

సిఎం ఓఎస్‌డి (మీడియా రిలేషన్)గా సుబుధిని

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సంబంధించి ఢిల్లీ కేంద్రంగా మీడియా సంబంధిత విభాగంలో పనిచేసేందుకు ఆఫీసరు ఆన్ స్పెషల్ డ్యూటీ (మీడియా రిలేషన్స్)గా సుసాంత సుబుధిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు జిఓ ఆర్‌టి నెంబరు 905ను విడుదల చేసింది. ఈయన నియామకం కాంట్రాక్టు బేసిస్‌లో అని ప్రభుత్వం పేర్కొంది.

ఏ పదవీ చేపట్టను

(మొదటి పేజీ తరువాయి)

మౌలిక రాజ్యాంగ సిద్ధాంతాలను పరిరక్షిస్తారని సంజీవ్ ఖన్నా విశ్వాసం వ్యక్తం చేశారు. జస్టిస్ గవాయ్ తనకు గల 'అతిపెద్ద తోడ్పాటు' అని వ్యాఖ్యానించారు. ఆయన నాయకత్వ పటిమ, నిబద్ధతను కొనియాడారు.

ఖన్నా రాజ్యాంగపరమైన విలువలతో నిండిన తీర్పులిచ్చారు : జస్టిస్ గవాయ్

స్పష్టత, నైతిక నిబద్ధత, ప్రాథమిక హక్కుల పరిరక్షణ పట్ల అంకితభావం గల వ్యక్తి జస్టిస్ ఖన్నా అని జస్టిస్ బిఆర్ గవాయ్ ప్రశంసించారు. ఆయనిచ్చిన తీర్పులన్నీ చాలా సరళంగా వుంటాయని, రాజ్యాంగపరమైన విలువలతో నిండి వుంటాయని వ్యాఖ్యానించారు.

ఆదాయం కోసం అధ్యయనం

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని చంద్రబాబు సూచించారు.

కొత్త ఎక్సయిజ్ పాలసీ ద్వారా ఆదాయం పెరిగినట్లు ఆ శాఖ అధికారులు వివరించారు. గత ఏడాది 28,842 కోట్లు రాగా, అది అంతకుముందుకన్నా 14.84 శాతం ఎక్కువగా ఉన్నట్లు వివరించారు. అయితే తెలంగాణ, కర్నాటక, తమిళనాడు వంటి రాష్ట్రాల కన్నా మన ఆదాయం తక్కువగా ఉన్నట్లు ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో సిఎం ముఖ్య కార్యదర్శి రవిచంద్రతోపాటు ఇతర ఆదాయ వనరులశాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వీరజవాను మురళీ త్యాగం మరువలేనిది

(మొదటి పేజీ తరువాయి)

నాయక్‌లను జగన్ పరామర్శించారు. మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో జగన్ మాట్లాడుతూ దేశ సరిహద్దులో శత్రువులను నిలువరించేందుకు వీర జవాను మురళీ నాయక్ చూపిన తెగవ మరువలేనిదన్నారు. ఆయన ధైర్యసాహసాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. వీర జవాను మురళీ నాయక్ కుటుంబానికి వైసిపి తరపున రూ.25 లక్షలు అందిస్తున్నామని జగన్ ప్రకటించారు. టిడిపి కూటమి ప్రభుత్వం మురళీ నాయక్ కుటుంబానికి రూ.50 లక్షలు, ఇతర సదుపాయాలు అందించడం అభినందనీయమన్నారు. ఆయన వెంట ఉమ్మడి అనంతపురం జిల్లా జడ్‌పి చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైసిపి శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు కెవి.ఉషశ్రీ చరణ్, శ్రీసత్యసాయి జిల్లా వైసిపి మాజీ ఎమ్మెల్యేలు ఉన్నారు.


సింధు జలాలు విడుదల చేయం

- ద్వైపాక్షిక చర్చలకే అవకాశం
- విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్

న్యూఢిల్లీ : ఉగ్రవాదానికి పాక్ మద్దతు నిలిపివేసే వరకు సింధూ జలాల ఒప్పందం నిలిపివేస్తామని భారత్ ప్రకటించింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పిఒకె)పై ద్వైపాక్షిక చర్చలే మార్గమని ఆయన స్పష్టం చేశారు. జమ్ముకాశ్మీర్ విషయంలో భారత్ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని తెలిపారు. ద్వైపాక్షిక చర్చల ద్వారా తప్ప ఈ విషయంలో ఎవరి, ఎలాంటి మధ్యవర్తిత్వాన్ని అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. పిఒకెను పాకిస్తాన్ ఖాళీ చేసే విషయమొక్కటే మిగిలిందని అన్నారు. కాల్పుల విరమణపై భారత్ వైఖరి సుస్పష్టమని రణధీర్ తెలిపారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ప్రపంచ దేశాల నుంచి దీనిపై మాట్లాడిన వారందరికీ భారత్ ఇదే విషయాన్ని స్పష్టం చేసిందన్నారు. ఉగ్రవాదులను అణచివేయడమే భారత్ ప్రాథమిక లక్ష్యమని, ఉగ్ర స్థావరాలపైనే భారత్ దాడి చేసిందని చెప్పారు. అందుకు ప్రతిగా పాక్ దుస్సాహసానికి దిగిందని, దాంతో ప్రతి చర్యగా భారత్ దాడులు చేసిందని తెలిపారు. పాకిస్తాన్ కాల్పులు నిలిపివేస్తే భారత్ దాడులు ఆపేస్తుందని, ఇదే విషయాన్ని ప్రపంచదేశాలకు స్పష్టంగా చెప్పామని రణధీర్ చెప్పారు.

అమెరికాలో ఇద్దరు భారతీయుల మృతి

వాషింగ్టన్ (అమెరికా) : అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు భారతీయ విద్యార్థులు మృతి చెందారు. న్యూయార్క్‌లోని క్లీవ్‌ల్యాండ్ యూనివర్సిటీలో చదువుతున్న మానవ్ పటేల్ (20), సౌరవ్ ప్రభాకర్ (23) మరణించినట్లు న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ ట్వీట్ ద్వారా తెలిపింది. పెన్సిల్వేనియాలో ఈ నెల10వ తేదీన మానవ్ పటేల్, సౌరవ్ ప్రభాకర్, మరో విద్యార్థి కలిసి కారులో బయటకు వెళ్లినప్పుడు ఈ ప్రమాదం జరిగింది.





అందరికీ చదువు



ఒక ఊరిలో రాజు, గౌరమ్మ దంపతులు ఉన్నారు. వాళ్లకు అమల, సిరి అనే ఇద్దరు కూతుళ్లు, గోపి అనే ఒక కొడుకు. ఒక రోజు ఊరికి పోయి వస్తుండగా రాజుకి యాక్సిడెంట్ అయ్యింది. కాలు విరిగి మంచాన పడ్డాడు. అప్పటినుంచి గౌరమ్మ ఇంటి బాధ్యతని తీసుకుంది. పిల్లలకు బడి ఈడు వచ్చింది. గౌరమ్మ తన ఇద్దరు కూతుళ్లని ఇంటి దగ్గరే ఉంచి, గోపిని మాత్రం బడికి పంపింది.

అమల, సిరికి కూడా చదువుకోవాలని ఉంది. కానీ గౌరమ్మ అదేమీ పట్టించుకునేది కాదు. రోజూ చీపుర్లు అమ్మడానికి ఇద్దరు కూతుళ్లని తనతో తీసుకెళ్లేది. కొడుకుని స్కూలుకి తయారుచేసి పంపేది. ఒక రోజు బడి దగ్గరకి రాగానే సిరి అమ్మతో ధైర్యం చేసి మాట్లాడింది. 'అమ్మ నేను స్కూలుకి వెళతాను. పెద్ద చదువులు చదువుతాను. డాక్టర్ అవుతాను' అంది.

అప్పుడు గౌరమ్మ 'మీరు చదివి ఏం ఉద్ధరిస్తారు? గోపిని చదివిస్తే రేపు పెద్దయ్యాక ఉద్యోగం చేసి మాకు అండగా ఉంటాడు' అంది. ఈ మొత్తం సంభాషణని ఆ బడిలో మాస్టారు విన్నారు. 'ఆడపిల్లలను చదివించినా మీకు అండగా ఉంటారు అమ్మా. పిల్లలు ముగ్గురినీ స్కూలుకు పంపు. నేను ఉచితంగా చదువు చెబుతాను' అన్నారు మాస్టారు.

'ఇష్టం లేక కాదు బాబూ, మాకు పిల్లలందరినీ చదివించే స్థోమత లేదు. మీరు ఇంత భరోసా ఇచ్చాక, పిల్లలని తప్పకుండా బడికి పంపుతాను' అని కళ్లనీళ్లు తుడుచుకుంది. అప్పటి నుండి గోపితో పాటు అమల, సిరి బడికి వెళ్లారు. బాగా చదివి అమ్మానాన్నకి అండగా ఉన్నారు.



- ఎం.సాత్విక,
7వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
రేగులపల్లి, బెజ్జంకి మండలం, సిద్దిపేట,
96033 89441.


ప్రవర్తన

అన్నవరం ఊరిలో రాధమ్మ కృష్ణయ్య దంపతులు ఉన్నారు. వారికి ఇద్దరు పిల్లలు. కూతురు రమ్య పదవ తరగతి చదువుతున్నది. కుమారుడు గోపి తొమ్మిదవ తరగతి చదువుతున్నాడు. రమ్య ప్రతి రోజూ బడికి వెళ్ళి శ్రద్ధగా చదివేది. గోపి మాత్రం చదవకుండా బయట తిరుగుతూ బడికి సరిగ్గా వెళ్లేవాడు కాదు.

'అమ్మ నాన్నలు కష్టపడి పనిచేస్తూ మనల్ని చదివిస్తున్నారు. మనం బాగా చదివి, గొప్పవాళ్ళు కావాలి. అమ్మా నాన్నను మంచిగా చూసుకోవాలి' అని రమ్య గోపికి ఎన్నో సార్లు చెప్పింది. అయినా గోపి వినలేదు.

రమ్య బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకుంది. మండలంలోనే ప్రథమ స్థానం వచ్చింది. ఒక కళాశాల రమ్యను ఉచితంగా చదివించింది. ఊరి వారందరు రమ్యను మెచ్చుకున్నారు. అది చూసి గోపిలో మార్పు వచ్చింది. తను కూడా అక్క వలె బాగా చదవాలని నిర్ణయించుకున్నాడు.

కొన్ని సంవత్సరాల తర్వాత రమ్య డాక్టర్ అయింది. గోపి కూడా ఉద్యోగం సంపాదించాడు. ఇద్దరూ తమ తల్లిదండ్రులను మంచిగా చూసుకున్నారు. పట్టణంలో ఇల్లు కొన్నారు. కారు కొన్నారు. తమ కష్టాలు తీరాయని. తల్లి దండ్రులు మురిసి పోయారు.



- పోరెడ్డి నితీశ,
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
అనంత సాగర్,
సిద్దిపేట జిల్లా.

బొమ్మల కొలువు





కె.సాయి సాకేత్
6వ తరగతి
జెనిసిస్ ఇంటర్నేషనల్ స్కూల్,
మదీనాగూడ, హైదరాబాద్



ఎస్.భార్గవి,
7వ తరగతి,
ఎపి మోడల్ స్కూల్,
రొంపిచర్ల గ్రామం,
రొంపిచర్ల మండలం,
పల్నాడు జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com 83329 25496

JEEVANA

జీవన the family

జీవన సౌరభం

ఓటమి నేర్పిన పాఠాలు గుర్తుపెట్టుకుని గెలవడం నేర్చుకోవాలి.

గుడారంలో ప్రసరించిన విద్యా వెలుగులు..





చదువుకొని పెద్ద పెద్ద ఉద్యోగాలు చేయాలని చాలామంది కలలు కంటారు. కొంతమంది మాత్రం చదువుకొని తనని, తన చుట్టూ వున్న వారిని బాగు చేయాలనుకుంటారు. అలాంటి వారి కోవలోకే వస్తుంది కాశ్మీర్ పుల్వామాకి చెందిన 17 ఏళ్ల షబ్నమ్ సాధిక్. టార్పాలిన్ కవర్‌తో కప్పపడిన గుడారం ఆమె నివాసం. విద్యుత్ సౌకర్యం లేక లాంతరు దీపంలో చదువుకుంది. ట్యూషన్లకి వెళ్లే స్థోమత లేదని చెప్పేముందు, మనుగడ సాగించడమే ఆమె కుటుంబ ప్రధాన కర్తవ్యమని చెప్పాలి. ఇంతటి దీనస్థితిలో ఉన్న కుటుంబంలో పుట్టిన షబ్నమ్ ఈ ఏడాది 12వ తరగతి ఫలితాల్లో 92 శాతం మార్కులు సాధించి అందరి దృష్టిని ఆకర్షించింది. ఏప్రిల్ 30న విడుదలైన ఫలితాలతో షబ్నమ్ ఉంటున్న గుడారంలో ఒక్కసారిగా వెలుగులు ప్రసరించాయి. రిజల్ట్స్ వచ్చి 10 రోజులు పైగానే అయినా, అభినందనలు తెలిపేందుకు తన ఇంటికి వచ్చే అతిథులతో ఆ టెంట్ హౌస్ నిండిపోతోంది.

కాశ్మీర్ నోమదిక్ గుజ్జార్ కుటుంబానికి చెదిన షబ్నమ్ కుటుంబం సంచార తెగకి చెందినది. చదువుకోవడం ఆ కుటుంబాల్లో తీరని కల. తరచూ విద్యుత్ అంతరాయాలు, డిజిటల్ సౌకర్యం అన్న మాట వినడమే కానీ, అనుభవించని పేదరిక కుటుంబాలు వారివి. కేవలం చదువుకోవాలన్న దృఢ సంకల్పమే షబ్నమ్‌ని ఈ విజయం సాధించేలా చేసింది.



షబ్నమ్ సాధించిన ఈ ఘనత ఇప్పుడు ఆ కుటుంబాల్లో కొత్త ఆశని చిగురించేలా చేసింది. అందుకే షబ్నమ్ విజయాన్ని కేవలం సామర్థ్యంతోనే సరిపెట్టలేం. అంతకుమించిన గొప్ప విషయంగా చూడాలి. చదువు కోసం తను చేసిన ప్రయాణాన్ని షబ్నమ్ ఇలా చెబుతోంది.

'నాకు చదువుకోవడం చాలా ఇష్టం. కానీ అందుకు అనువైన పరిస్థితులు నాకు లేవు. ఇంటి నుండి రోడ్డు మార్గం చేరుకోవడానికి సుమారు కిలోమీటరు దూరం ప్రయాణించేదాన్ని. నేను వెళ్లేసరికి బస్సు వెళ్లిపోతే మరో ఆరు కిలోమీటర్లు నడిస్తే గానీ స్కూలుకి చేరుకునేదాన్ని కాదు. ఈ ప్రయాణంలో ఎక్కువభాగం కొండపైకి నడవాలి. అప్పుడు నా పుస్తకాల బరువు మరింత ఎక్కువయ్యేది. అయితే ఆ బరువు కంటే బరువైన కలలు కన్నాను. అందుకే ఎంత కష్టపడినా చదువును విడిచిపెట్టలేదు' అని షబ్నమ్ చెబుతున్నప్పుడు ఆ మాటల్లో చదువుకోవాలన్న ఆమె కోరిక ఎంత బలమైనదో స్పష్టమవుతుంది.

స్కూలుకి ప్రయాణించడంతోనే షబ్నమ్ చదువుకష్టాలు అయిపోలేదు. శీతాకాలంలో అధిక మంచు వల్ల తను ఉంటున్న ప్రాంతం పూర్తిగా మంచుతో కప్పబడి ఉండేది. ఆ రోజులను గుర్తుచేసుకుంటూ షబ్నమ్ ఇలా అంటోంది. 'అప్పుడు మాకు ఎవరూ సహాయం చేసేవారు కాదు. టెక్స్ట్ బుక్స్ చదివి నేను పరీక్షలకు సిద్ధమయ్యేదాన్ని'.

ఐఎఎస్ అధికారి కావాలని కలలు కంటున్న షబ్నమ్ గురించి ఆమె టీచర్లు ఏమంటున్నారంటే.. 'పరిమిత వనరులతోనే తను ఈ విజయం సాధించింది. 500 మార్కులకి, 463 తెచ్చుకుంది. ఇప్పుడు తను మొత్తం కాశ్మీరీ లోయకి ఒక ఉదాహరణగా నిలిచింది. చాలామంది విద్యార్థులకు గొప్ప స్ఫూర్తినిచ్చింది' అన్నారు.

కూతురు సాధించిన ఘనత గురించి ఆమె తండ్రి మహ్మద్ సాధిక్ బొక్డా ఏమన్నారంటే.. 'నేను 9వ తరగతితోనే చదువు ఆపేశాను. ఉండడానికి సొంత ఇల్లు కూడా లేని నేను, నా పిల్లలను మాత్రం బాగా చదివించాలని కలలుకనేవాడ్ని. నేను కోరుకున్నట్లుగానే ఇప్పుడు షబ్నమ్ ఇది సాధించింది' అని అలసిన కళ్లతో ఆ దినసరి కూలీ చేసుకునే తండ్రి మాట్లాడుతున్నప్పుడు ఆ ఆనందం అతని కళ్లల్లో స్పష్టంగా కనిపించింది.

ఫలితాలు వచ్చిన రోజు ఆ తండ్రి సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. ఆ క్షణాల్ని ఆయన ఇలా గుర్తుచేసుకున్నాడు. 'నేను రోజూలానే ఆ రోజు కూడా పనికి వెళ్లిపోయాను. ఫోనులో ఫలితాలు చూసేసరికి చంద్రుని మీదకి వెళ్లినంత ఆనందం కలిగింది. అప్పటికప్పుడే నా కూతురి సంతోషాన్ని ప్రత్యక్షంగా చూడాలనుకున్నాను' అని ఆ తండ్రి ఎంతో ఉద్వేగంతో చెప్పాడు.

షబ్నమ్ టెంట్ హౌస్‌లో ఉన్న సామాను కంటే ఎక్కువమంది జనాభా ఇప్పుడు అక్కడ కనిపిస్తున్నారు. వారిలో షబ్నమ్ బంధువులు, స్నేహితుల కుటుంబాలు ఉన్నాయి. అధికారులు, దాతలు కూడా ఆమె ఇంటికి క్యూ కడుతున్నారు. ఇదంతా చూసిన మహ్మద్ 'ఇప్పుడు నా కూతురు సాధించిన ఈ విజయంతోనైనా మేము ఉంటున్న ఈ ప్రాంతం ప్రభుత్వం దృష్టిలోకి వస్తుంది. ఫలితంగా ఇక్కడ రోడ్డు పడుతుంది. కోతలు లేని కరెంటు వస్తుంది. తద్వారా ఇక్కడ నుండి తరువాత చదువుకునే పిల్లలకు మార్గం సుగమం అవుతుంది' అని ఆశపడుతున్నాడు.

ఒక బిడ్డ చదువు, తన ఇంటినే కాక, తనతో ఉండేవారిని, తన తరువాత తరాన్ని కూడా ప్రభావితం చేసిందంటేనే తెలుస్తోంది.. ఆ బిడ్డ కేవలం తన కోసమే చదవలేదని..

---

11 మంది సైనికులు చనిపోయారు : పాక్

లాహోర్ : భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో తమకు జరిగిన నష్టాలను పాక్ వెల్లడిస్తోంది. ఈ నెల 7వ తేదీ నుంచి జరిగిన దాడుల్లో 11 మంది సైనికులు మరణించారని, మరో 78 మంది తీవ్రంగా గాయపడ్డారని తెలియజేసింది. ఇక పాకిస్తాన్ వాయుసేనకు చెందిన ఐదుగురు సిబ్బంది మరణించారని, వీరిలో స్క్వాడ్రన్ లీడర్ ఉస్మాన్ యూసఫ్ కూడా ఉన్నట్టు వివరించింది. భారత్ చేపట్టిన ఆపరేషన్‌లో 40 మంది పౌరులు చనిపోగా, 121 మంది గాయపడ్డారని పేర్కొంటూ పాకిస్తాన్ సైన్యానికి చెందిన డిజి ఐఎస్‌పిఆర్ ఓ ప్రకటనలో వెల్లడించింది.

70 దేశాలకు బ్రీఫింగ్

న్యూఢిల్లీ : పాక్ ఆక్రమిత కాశ్మీర్, పాకిస్తాన్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా మన సైన్యం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌పై రక్షణ నిఘా సంస్థ డిజి లెఫ్టినెంట్ జనరల్ డిఎస్ రాణా 70 దేశాల దౌత్యాధికారులకు వివరించారు. మంగళవారం మధ్యాహ్నం ఢిల్లీలోని రక్షణశాఖ కార్యాలయంలో కీలక భేటీ జరిగింది. ఈ సందర్భంగా రాణా లక్ష్యాల ఎంపిక ప్రక్రియ, భారత శక్తి సామర్థ్యాల ప్రదర్శన తదితర అంశాలను తెలిపారు.

బాలికలదే పైచేయి

- సిబిఎస్ఇ 10, 12 తరగతుల ఫలితాలు వెల్లడి
- విజయవాడ రీజియన్ టాప్

న్యూఢిల్లీ : సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) 10, 12వ తరగతి ఫలితాలను మంగళవారం ప్రకటించారు. అబ్బాయిల కంటే అమ్మాయిలే ఎక్కువ శాతం ఉత్తీర్ణులయ్యారని పరీక్ష కంట్రోలర్ సంయమ్ భరద్వాజ్ మీడియాకు వివరాలు వెల్లడించారు. ఈ రెండు తరగతి ఫలితాల్లోనూ విజయవాడ రీజియన్ టాప్‌లో నిలిచింది. ఈ ఏడాది 12వ తరగతి బోర్డు పరీక్షల్లో 88.39 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని, గతేడాది కంటే స్వల్పంగా ఉత్తీర్ణత శాతం పెరిగిందని సిబిఎస్ఇ పేర్కొంది. అబ్బాయిల కంటే అమ్మాయిలు 5 శాతం ఎక్కువగా ఉత్తీర్ణులయ్యారని తెలిపింది. 12వ తరగతిలో 1.15 లక్షల మందికి పైగా విద్యార్థులు 90 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించారని, 24 వేల మంది విద్యార్థులు 95 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించారని పేర్కొంది. 12వ తరగతిలో బాలికల్లో 91.64 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా, బాలురల్లో 85.70 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ట్రాన్స్‌జెండర్లలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది 12వ తరగతి పరీక్షలకు మొత్తం 16,92,794 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ ఏడాది 12వ తరగతి ఫలితాల్లో విజయవాడ రీజియన్ 99.60 శాతం ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో నిలిచింది. తరువాత స్థానాల్లో తిరువనంతపురం (99.32 శాతం), చెన్నై (97.39 శాతం), బెంగళూరు (95.95 శాతం), ఢిల్లీ వెస్ట్ (95.37 శాతం) నిలిచాయి. 79.53శాతంతో ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ చివరి స్థానంలో నిలిచింది.

టెన్త్‌లో 98 శాతం ఉత్తీర్ణత

10వ తరగతి ఫలితాల్లో 93 శాతం కంటే ఎక్కువ మంది ఉత్తీర్ణులయ్యారు. అబ్బాయిల కంటే అమ్మాయిలు 2 శాతం ఎక్కువగా ఉత్తీర్ణులయ్యారు. 1.99 లక్షల మందికి పైగా విద్యార్థులు 90 శాతం కంటే ఎక్కువగా మార్కులు సాధించారు. 45 వేలకు పైగా విద్యార్థులు 95 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించారు. ఫలితాల్లో విజయవాడ, తిరువనంతపురం రీజియన్లు 99.79 శాతం ఉత్తీర్ణతతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచాయి. బెంగళూరు 98.90 శాతం, చెన్నై 98.71 శాతంతో తరువాత స్థానాల్లో నిలిచాయి. సుమారు 42 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాశారు.

ఫేర్‌వెల్ మ్యాచ్ ఆడించాలి

- రోహిత్, కోహ్లి, అశ్విన్‌లను తగిన రీతిలో సన్మానించాలి
- బిసిసిఐకి స్పిన్ దిగ్గజం అనిల్ కుంబ్లే సూచన



కోహ్లితో కుంబ్లే(ఫైల్)

ముంబయి: టెస్ట్ క్రికెట్‌కు ఇటీవల గుడ్‌బై చెప్పిన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలకు ఘనంగా వీడ్కోలు పలకాలని దిగ్గజ స్పిన్నర్ అనీల్ కుంబ్లే సూచించాడు. వీరిద్దరూ ఒకరి తర్వాత ఒకరు టెస్టులకు వీడ్కోలు పలికారు. తమ ఆటతో, నాయకత్వ పటిమతో కుర్రాళ్లకు స్ఫూర్తిగా నిలిచిన వీరి రిటైర్మెంట్ ప్రకటనపై కుంబ్లే పై విధంగా స్పందించాడు. వారితోపాటు స్పిన్నర్ అశ్విన్‌కు కూడా తగిన విధంగా గౌరవించాలని భారత క్రికెట్ నియంత్రణ మండలి(బిసిసిఐ)కి సూచించాడు. భారత క్రికెట్‌కు ఇన్నేళ్లు సేవలందించిన వీరిని బిసిసిఐ సముచితంగా గౌరవించాలి. ఫేర్‌వెల్ మ్యాచ్ ఆడించాలి అని కుంబ్లే తెలిపాడు. అంతేకాదు మ్యాచ్ విన్నర్లు అయిన కోహ్లీ, రోహిత్ గైర్హాజరీలో భారత జట్టు ఇంగ్లండ్ పర్యటనలో సవాళ్లు ఎదురవుతాయని కుంబ్లే చెప్పాడు. 5 టెస్టుల సిరీస్‌కు స్క్వాడ్ ఎంపిక సెలెక్టర్లకు పెద్ద తలనొప్పి కానుంది. కుర్రాళ్లతో అద్భుతాలు చేయడం సాధ్యమేనా అనేది తెలియాల్సి ఉంది అని ఈ వెటరన్ స్పిన్నర్ తెలిపాడు.

ఆ సిరీస్ వైఫల్యంతో...

జూన్‌లో కీలకమైన ఇంగ్లండ్ పర్యటనలో కోహ్లీ, హిట్‌మ్యాన్ ఆడుతారని అందరూ ఊహించారు. కానీ, నిరుడు న్యూజిలాండ్, ఆపై బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భారత జట్టు వైఫల్యం కారణంగా రోహిత్‌పై వేటు ఖాయమనే వార్తలు వినిపించాయి. దాంతో, తనను కెప్టెన్‌గా తప్పిస్తారని తెలిసిన అతడు మే 7న టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించాడు. తాజాగా విరాట్ సైతం టెస్ క్రికెట్‌కు గుడ్‌బై చెబుతున్నట్లు మే 12న ప్రకటించాడు. అనుభవజ్ఞులైన ఈ ఇద్దరూ లేకపోవడంతో ఇంగ్లండ్ గడ్డపై భారత జట్టు విజయాలపై ప్రభావం చూపుడం ఖాయం.

కోహ్లీ మరికొంతకాలం టెస్టులు ఆడాల్సింది: సయ్యద్ కిర్మాణీ

విరాట్ కోహ్లి టెస్ట్ క్రికెట్ నుంచి తప్పుకోవడంపై 1983 వరల్డ్ కప్ గెలిచిన జట్టులోని సభ్యుడైన సయ్యద్ కిర్మాణి స్పందించాడు. 'విరాట్ ఆటలో స్థిరత్వాన్ని ప్రదర్శించాడు. అదే అతణ్ని ప్రత్యేకంగా నిలిపింది. కోహ్లి యువతకు ప్రేరణగా నిలిచాడు. అతడు వ్యక్తిగత రికార్డుల గురించి పెద్దగా పట్టించుకోడు. అలాగే అతడు వీడ్కోలు నిర్ణయం తీసుకుంటున్నప్పుడు ఎలాంటి ఒత్తిడికీ గురై ఉండడు. రిటైర్‌మెంట్ అనేది అతడి వ్యక్తిగత నిర్ణయం. ప్రతి క్రికెటరూ ఏదో ఒకరోజు రిటైర్ కావాల్సిందే. కానీ విరాట్ కోహ్లీ ఇంకొంతకాలం టెస్టుల్లో కొనసాగిగే బాగుండేది. అతడిలో ఇంకా ఎంతో టెస్ట్ క్రికెట్ దాగిఉంది. ఏది ఏమైనప్పటికీ నేను అతడి నిర్ణయాన్ని గౌరవిస్తున్నా. అతడి భవిష్యత్తు బాగుండాలని కోరుకుంటున్నా' అని తెలిపాడు. అలాగే ఈ మధ్య క్రికెటర్లు తమ రిటైర్‌మెంట్ ప్రకటనలను సోషల్ మీడియా వేదికగా చేస్తున్నారు. దీనిమీద కూడా కిర్మాణి స్పందించాడు. 'క్రికెటర్లు ఇలా సోషల్ మీడియాలో తమ రిటైర్‌మెంట్‌కు సంబంధించిన ప్రకటనలు చేయడంలో ఏవిధమైన తప్పు లేదు. ఇన్‌స్టాగ్రాం లాంటి వేదికల వల్ల ప్రపంచవ్యాప్తంగా విషయం తెలుస్తుంది' అని తన అభిప్రాయం వ్యక్తంచేశాడు.

సౌదీ అరేబియాకు ఆయుధాల విక్రయం

- ట్రంప్ పశ్చిమాసియా పర్యటన ప్రారంభం



రియాద్ : అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ పశ్చిమాసియా పర్యటన మంగళవారం ప్రారంభమైంది. ముందుగా సౌదీ అరేబియాకు ట్రంప్ చేరుకున్నారు. ట్రంప్‌నకు యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుమారు 142 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలను విక్రయించడానికి అమెరికా అంగీకరించింది. అమెరికా ఇప్పటివరకూ చేసుకున్న 'అతిపెద్ద రక్షణ సహకార ఒప్పందం'గా వైట్‌హౌస్ దీన్ని అభివర్ణించింది. ట్రంప్ సంతకం చేసిన ఈ ఒప్పందంలో వాయు-క్షిపణి రక్షణ, వైమానిక దళం, అంతరిక్ష పురోగతి, సముద్ర భద్రత, కమ్యూనికేషన్‌తో సహా 12 అంశాలు ఉన్నాయని వైట్‌హౌస్ తెలిపింది.

కాశ్మీర్‌లో 'ఆపరేషన్ కెల్లర్'

- ముగ్గురు లష్కరే ఉగ్రవాదులు హతం

శ్రీనగర్ : దక్షిణ కాశ్మీర్‌లోని షాపియాన్ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు లష్కరే తోయిబా ఉగ్రవాదులు హతమయ్యారు. షాపియాన్‌లోని షూకల్ కెల్లర్ అడవులలో ఉగ్రవాదులు ఉన్నారంటూ రాష్ట్రీయ రైఫిల్స్ దళం నుండి అందిన సమాచారం మేరకు సైనిక దళాలు 'ఆపరేషన్ కెల్లర్' పేరిట గాలింపు చర్యలు చేపట్టాయి. వారిని గమనించిన ఉగ్రవాదులు కాల్పులు ప్రారంభించారు. భద్రతా దళాలు కూడా ఎదురు కాల్పులు జరపడంతో ముగ్గురు కరడు కట్టిన లష్కరే తోయిబా ఉగ్రవాదులు హతమయ్యారు. మృతులలో ఇద్దరిని షాహిద్ కుట్టే, అద్నన్ షఫీ దార్‌గా గుర్తించారు. పర్యాటకులపై జరిగిన దాడిలోనూ, బిజెపికి చెందిన ఓ సర్పంచ్ హత్యలోనూ కుట్టేకు ప్రమేయం ఉంది. స్థానికేతరుడైన కార్మికుడిని హత్య చేసిన ఘటనలో షఫీ దార్ నిందితుడు. భద్రతా దళాల కాల్పులలో మరణించిన రెండో ఉగ్రవాది షఫీ దార్ గత సంవత్సరం అక్టోబర్ 18న లష్కరేలో చేరాడు. అదే రోజు ఇతర ఉగ్రవాదులతో కలిసి స్థానికేతరుడైన ఓ కార్మికుడిని హత్య చేశాడు.

సినీ కార్మికులకు న్యాయం జరగాలి

- నటుడు, నిర్మాత, దర్శకుడు మాదాల రవి

సినిమా కార్మికుల సమస్యల పరిష్కారం కోసమే నిలబడతాం. అందులో ఎలాంటి అపోహకు అవకాశం ఉండదు. చిత్రపురి కూడా ఇండస్ట్రీలో ఓ భాగం. కనుక సినీ కార్మికులకు ఉపయోగపడేలా, సినిమా రంగానికి మంచి పేరు తెచ్చేలా చిత్రపురి కమిటీ పూనుకోవాలి. చిత్రపురి సభ్యులుగా 9000 మంది ఉన్నారు. అందులో ఇంచుమించు 5000 మందికి ఇళ్లను కేటాయించారు. అందులో మిగిలినవారికి కొత్త ప్రాజెక్ట్‌లో ప్రాధాన్యత ఇవ్వాలి. ముందుగా వెయింటింగ్ లిస్ట్‌లో వున్న నిజమైన సినీకార్మికులకు న్యాయం చేయండి. ఆ తర్వాత కొత్త సభ్యులకు అవకాశం ఇవ్వాలి. ఇలా చేస్తే చిత్రపురి కమిటీ ఆదర్శవంతంగా నిలుస్తుంది. కమిటీ మంచి చేస్తుందని ఆశిస్తున్నాం' నటుడు, నిర్మాత, దర్శకుడు మాదాల రవి అన్నారు. హైదరాబాద్‌లోని ఫిలింఛాంబర్‌లో సినీ పెద్దల సమక్షంలో చిత్రపురి కమిటీ అధ్యక్షుడు అనిల్ వల్లభనేని చిత్రపురిలో నూతన ప్రాజెక్ట్‌కు సంబంధించిన బ్రోచర్‌ను అన్ని విభాగాల ప్రతినిధుల సమక్షంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాదాల రవి పై విధంగా స్పందించారు.

సన్‌రైజర్స్‌కు ఎదురుదెబ్బ

- ఐపిఎల్ పునఃసీజన్‌కు కమిన్స్, హెడ్ దూరం

హైదరాబాద్: ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) మరో మూడ్రోజుల్లో తిరిగి ప్రారంభం కానుంది. ఈ క్రమంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) ఫ్రాంచైజీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు కెప్టెన్ పాట్ కమిన్స్‌తోపాటు, స్టార్ ఓపెనర్ ట్రెవిస్ హెడ్ తిరిగి ప్రారంభమయ్యే ఐపిఎల్ మ్యాచ్‌లకు దూరమయ్యారు. డబ్ల్యుటిసి ఫైనల్‌కు ఆస్ట్రేలియా జట్టు చేరుకోవడంతో ప్రాక్టీస్ సన్నద్ధతలో భాగంగా ఆస్ట్రేలియా క్రికెటర్లు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. దీంతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లైంది. ఐపిఎల్ 2025లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు 11మ్యాచుల్లో కేవలం 7పాయింట్లతో 9వ స్థానంలో ఉంది. కమిన్స్‌ను రూ.18కోట్లకు సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ నిలుపుకుంది.

పంజాబ్, ఢిల్లీ మ్యాచ్ మళ్లీ నిర్వహిస్తాం : బిసిసిఐ

పంజాబ్, ఢిల్లీ జట్ల ధర్మశాల వేదికగా జరుగుతున్న ఐపిఎల్ మ్యాచ్‌ను బిసిసిఐ అర్థాంతరంగా నిలిపివేసింది. భారత్-పాక్ దేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో బిసిసిఐ ఈ నిర్ణయం తీసుకుంది. ఐపిఎల్ పునఃప్రారంభ షెడ్యూల్‌లో అర్థాంతరంగా నిలిచిన మ్యాచ్ గురించి బిసిసిఐ ఎలాంటి ప్రకటన చేయలేదు. ఈ క్రమంలో బిసిసిఐ ఆ మ్యాచ్‌ను తిరిగి మళ్లీ నిర్వహిస్తామని మంగళవారం ప్రకటించింది. ఆరోజు మ్యాచ్ నిలిచే సమయానికి పంజాబ్ జట్టు 10.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 122 పరుగులు చేసింది. సాధారణంగా మ్యాచ్ రద్దయితే ఇరుజట్లకు చెరో పాయింట్ కేటాయిస్తారు. కానీ, రెండు టీమ్‌లకు పాయింట్లు కేటాయించడంపై బిసిసిఐ స్పందించలేదు. మే 24న జైపూర్‌లో పంజాబ్, ఢిల్లీ తలపడనున్నట్లు తాజాగా ప్రకటించింది. పంజాబ్ ఇప్పటివరకు 11 మ్యాచ్‌లు ఆడి 15 పాయింట్లతో ఉంది. మిగిలిన మూడు మ్యాచ్‌ల్లో ఒక దాంట్లో గెలిచినా ఆ జట్టు ప్లే ఆఫ్స్ చేరడం ఖాయం. ఐపిఎల్ పునఃప్రారంభ షెడ్యూల్ ప్రకారం బెంగుళూరు, జైపూర్, ఢిల్లీ, లక్నో, అహ్మదాబాద్, ముంబయిల్లో లీగ్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఫైనల్ జూన్ 3న జరగనుంది.

డబ్ల్యుటిసి ఫైనల్‌కు దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్ల ప్రకటన



దుబాయ్: ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్-2025 ఫైనల్‌కు దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా తమ తమ జట్లను ప్రకటించాయి. 2025 డబ్ల్యుటిసి ఫైనల్ లార్డ్స్ వేదికగా జూన్ 11 నుంచి 15వరకు జరగనుంది. ఇరుజట్లు 15 మంది ఆటగాళ్లతో కూడిన జట్ల వివరాలను వెల్లడించాయి. గాయం కారణంగా శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు దూరమైన రెగ్యులర్ కెప్టెన్, పాట్ కమిన్స్ జట్టులోకి ఆస్ట్రేలియా జట్టుకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. అలాగే ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్, పేసర్ జోష్ హాజిల్‌వుడ్ కూడా గాయం నుంచి కోలుకుని టెస్టు జట్టులోకి రీఎంట్రీ ఇచ్చారు. ఇక స్పిన్నర్ మ్యాట్ కుహ్నెమన్‌కు కూడా ఆసీస్ సెలక్టర్లు డబ్ల్యుటిసి ఫైనల్ ఆడే జట్టులో చోటు దక్కింది. ఇక దక్షిణాఫ్రికా కెప్టెన్‌గా బవుమా ఎంపికవ్వగా.. పేసర్లు రబడా, ఎన్గిడి తిరిగి టెస్ట్ జట్టులో చోటు దక్కించుకున్నారు. 2023-25 డబ్ల్యుటిసి టెస్ట్‌లో భాగంగా దక్షిణాఫ్రికా 12 టెస్టుల్లో 8 విజయాలతో 69.44 పాయింట్లతో అగ్రస్థానంలో, ఆస్ట్రేలియా 19 మ్యాచ్‌ల్లో 13 విజయాలతో 67.54 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి తుది పోరుకు అర్హత సాధించాయి.

జట్లు...

ఆస్ట్రేలియా : కమిన్స్(కెప్టెన్), బోలాండ్, క్యారీ, గ్రీన్, హేజిల్‌వుడ్, హెడ్, ఇంగ్లిస్, ఖవాజా, కాన్‌స్టాస్, కుహ్నెమాన్, లబూషేన్, లియాన్, స్మిత్, స్టార్క్, వెబ్‌స్టర్. ట్రావెలింగ్ రిజర్వ్ : బ్రెండన్ డాగెట్.

దక్షిణాఫ్రికా : బవుమా(కెప్టెన్), జోర్జి, మార్‌క్రమ్, ముల్డర్, జాన్సెన్, రబడా, మహరాజ్, ఎన్గిడి, బోట్స్, వెర్రెయానే, బెడింగ్హామ్, స్టబ్స్, రికెల్టన్, ముత్తుసామి, పీటర్సన్.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68